ఆర్షవిద్యా తరంగిణి

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

# BHAJAGOVINDAM

# భజగోవిన్దమ్

## శ్రీశంకర భగవత్పాదుల ప్రకరణగ్రంథము



**బాలస్తావత్క్రీడాసక్తః, తరుణస్తావత్తరుణీసక్తః।**
**వృద్ధస్తావచ్చిన్తాసక్తః, పరమే బ్రహ్మణి కోఽపి న సక్తః॥**

## సరళమైన తెలుగులో వ్యాఖ్యానము


కస్తూరి వీరరాఘవరావు

Title - BHAJAGOVINDAM
Second edition - Year 2022 1000 copies
Sanskrit Support - Sri Desu Chaitanya Krishna
Mobile: 93924 53042

For Copies

K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 9849092368
Email: raghavkasturi@gmail.com
for softcopy

http://www.telugubhakti.com/telugupages/Adwaitam/Adwaitam.htm

Printed at
Sai Sri Printers
8-3-945, # 21 Pancom Business Centre
Ameerpet, Hyderabad - 500073
e-mail: saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222

Price Rs. 150

# బ్రహ్మయజ్ఞం

స్నిగ్ధ అంటే స్నేహశీలి. ఏముహుర్తంలో మా అమ్మాయికి ఆ పేరు పెట్టామో కాని, అది స్నేహానికి పెట్టింది పేరు. చాలా చిన్నవయస్సులోనే తన నెచ్చెలి నాన్నగారు ఉద్యోగరీత్యా సింగపూర్‌లో ఉంటే, ఇంక ఆ అమ్మాయి బాధ్యతనంతా తన భుజస్కందాలమీద వేసుకుంది. అంతేకాదు తన స్నేహితుల కష్టసుఖాలు పంచుకుని, వారికి బాగానే సుద్దులు కూడా చెబుతుంది. మా అమ్మ ఇలా చెబుతుంది. మా నాన్న ఇలా చెబుతారు అంటూ వారిని ఓదారుస్తుంది.

పువ్వుకు తావి అబ్బినట్టు, ఆకాశమంత ప్రేమ ఉన్న మా అల్లుడు కుందన్ స్నేహితులంటే ప్రాణం పెడతాడు. ఇద్దరి స్నేహితులతోనూ, ఇద్దరూ అరమరికలు లేకుండా బాగా కలిసిపోతారు. ఆ విధంగా స్నిగ్ధ ఎక్కడ ఉన్నా కస్తూరి పరిమళాలు వెదజల్లితే, కుందన్ ఆకాశంలా అందరినీ అక్కున చేర్చుకుంటాడు.

ఇద్దరిలోనూ ఉన్న మరొక మంచిగుణం దానగుణం. స్నిగ్ధ తన మొదటి జీతమంతా భగవంతునికి అర్పిస్తే, రెండవ జీతంతో తల్లిదండ్రులమైన మాకు ఉంగరాలు కొన్నది. అప్పటినుంచీ, ఇప్పటివరకు తన జీతంలో కొంతభాగం దానధర్మాలకు వినియోగిస్తుంది. కుందన్ కూడా ఏమీ తీసిపోలేదు. స్నేహితులను అవసరాలలో ఆదుకుంటాడు. ఇద్దరూ కలిసి ఈ బ్రహ్మయజ్ఞానికి మరొకసారి ఇస్తామంటూ ముందుకు వచ్చారు.

భజగోవిందం ద్వితీయ ముద్రణకు సహకరించిన మా చిన్నారుల సహృదయాన్ని ఏమని పొగడుదుము– ఆ భగవంతుణ్ణి మంచి భవిష్యత్తును, ఆధ్యాత్మిక చింతనను కలుగచేయాలని కోరటం వినా.

చిరంజీవి సౌభాగ్యవతి శ్రీ స్నిగ్ధకూ, చిరంజీవి ఆకాశం కుందన్ కుమార్‌కూ, ఇటువంటి మంచి అల్లుడికి జన్మనిచ్చిన ఆకాశం విజయ్ కుమార్, వాణి దంపతులకూ ఆయురారోగ్య ఐశ్వర్యాలు ఇచ్చి, జ్ఞానప్రాప్తి కలుగచేయాలని భగవంతుణ్ణి మనసారా వేడుకుంటున్నాము.

రాఘవరావు – రాజ్యశ్రీ

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | బ్రహ్మయజ్ఞం | 3 |
| 2. | ముందుమాట | 5 |
| 3. | జ్ఞాననిధి స్వామీ పరమార్థానంద! | 7 |
| 4. | స్పందన | 10 |
| 5. | న తాతో న మాతా న బంధుర్న దాతా! | 13 |
| 6. | భజగోవిన్దమ్ – శ్లోకములు | 16 |
| 7. | ద్వాదశమంజరికా శ్లోకముల వ్యాఖ్యానము | 19 |
| 8. | చర్పటపంజరికా శ్లోకముల వ్యాఖ్యానము | 68 |
| 9. | ఉపసంహార శ్లోకముల వ్యాఖ్యానము | 106 |
| 10. | యమనియమాలు | 114 |
| 11. | తెలుగు భక్తి పేజీలు – వెలుగొందిన తీరు | 122 |
| 12. | దక్షిణమూర్తి స్తోత్రమ్ / దక్షిణమూర్తి అష్టకమ్ | 126 |

# ముందుమాట

శ్రీ గురుభ్యో నమః

ఈశ్వరానుగ్రహంవలన మనుష్యజన్మని పొంది కూడా ఈ జన్మను అర్థ, కామ, ధర్మాలద్వారా శాంతి, సుఖం, తృప్తిని పొందదానికోసం వెంపర్లాడుతున్న ప్రజలకు, వృద్ధకాశీపండితుని ఉద్దేశించి బ్రహ్మజ్ఞానమొక్కటే మనిషికి నిత్యసుఖం, శాంతిని, తృప్తిని ఇస్తుందని ఈ భజగోవిందం గ్రంథంద్వారా శ్రీ ఆదిశంకరులు తెలియజేసారు.

మొదటి 12 శ్లోకములలో అర్థకామాలలో ఉన్న దోషాలను దర్శింపజేసి వాటి అస్థిరత్వం కలుగజేసే అశాంతి, దుఃఖం, అతృప్తిని విషయదోషదర్శనం ద్వారా చూపి, నిత్యమైన, సత్యమైన బ్రహ్మను తన స్వరూపంగా తెలుసుకోవటమే, అంటే, ఆత్మే బ్రహ్మ అనే జ్ఞానము కలిగేలా ఈ గ్రంథము భాష్యకారులు శ్రీ శంకరులచే రచింపబడింది.

ఈ జీవితము తామరాకుపై నీటిబొట్టువలె అస్థిరంగా, అత్యంత చపలంగా, గాలివీస్తే నశించేటటువంటి జలబిందువువలె ఉన్నది. అంతేకాక జీవించి ఉన్నప్పుడే అహంకార, మమకారాలతో, వ్యాధులతో బాధిస్తుందని దానిమీద వ్యామోహం వద్దని తెలియజేసారు. అంతేకాక భద్రతకోసం, సుఖాలకోసం మనం ఆధారపడే ధనం, పదవులు, బంధువులతో సంబంధాలు అన్నీ అనిత్యాలు; భద్రత ఇవ్వకపోగా ఇంకా అభద్రత కలుగజేస్తుందని చెప్పారు. ఏ విధంగా ఇవన్నీ అభద్రత కలుగజేస్తాయో; భద్రతకోసం మనం దేనిని పట్టుకోవాలో తెలియజేస్తూ శ్రీ పరమార్థానంద స్వామివారు ఒక కథను చెప్పారు.

నీటికొరత ఉన్న చెన్నైనుండి హరిద్వార్ యాత్రకు వెళ్ళినతను అక్కడ గంగా ప్రవాహాన్ని చూసి ఆనందంతో స్నానం చేద్దామని నదిలో దిగగానే, ఆ ప్రవాహంతో పాటు కదులుతున్న అందులోని ఇసుకను చూసి, ఆ వేగానికి భయపడి అక్కడి రాళ్ళను గానీ, గట్టును గానీ పట్టుకుందామని ప్రయత్నిస్తే వాటిమీద ఉన్న పాచి ఇంకొంతం అభద్రత కలిగించింది. మరెలా ఆనందించాలని బాధపడుతుంటే, దగ్గరలోనే ఉన్న ఇంకొకతను గవర్నమెంటు నిర్మించిన బలమైన, స్థిరమైన గొలుసులను పట్టుకొని ఆనందంగా నదిలో మునకలెయ్యడం చూసి తను కూడా

ఆ గొలుసులు పట్టుకొని నిర్భయంగా నదీస్నానం ఆనందించాడు. అదే విధంగా మనం కూడా నిశ్చలమైన గోవిందుణ్ణి పట్టుకుంటే, మనకు కూడా భద్రత, భయరహితత్వం, ఆనందం, శాంతి లభిస్తుంది కనుక **"భజగోవిందం, భజగోవిందం, గోవిందం భజ మూఢమతే"** అని శ్రీ శంకరులు బోధించారు. కనుక మనం కూడా అశాశ్వతమైన సుఖాలను త్యజించి శాశ్వతమైన గోవిందుని భజించాలని చెప్పారు. ఈ విధంగా గోవిందుని భజిస్తే **"యోగరతో వా భోగరతో వా సంగరతో వా సంగవిహీనః। యస్య బ్రహ్మణి రమతే చిత్తం, నందతి నందతి నందత్యేవ॥"** అని చెప్పినట్టు ఈ శ్లోకాలన్నీ సులభంగా పాడుకోవడానికి అనువుగా ఉండడం చూసి దానితో ఉత్సాహం పొంది చాలావరకు అవే భావాలున్న, శ్రీ శంకరాచార్యుల వెంట ఉన్న 14 మంది శిష్యులు 14 శ్లోకాలను (చర్పట పంజరికా) ఆశువుగా చెప్పారు. వారు మనందరికీ విష్ణుసహస్రనామ పారాయణం, భగవద్గీతా పఠనం, మురారి పూజనం చేస్తే మృత్యుభయం లేని జీవన్ముక్తిని పొందడానికి కావలసిన అంతఃకరణశుద్ధి లభిస్తుందని తెలియజేసారు.

ఈ ప్రకరణ గ్రంథము అందరికీ సులభంగా అర్థమయి, హృదయంలో ఎల్లవేళలా నిలిచిపోయేలా శ్రీ కస్తూరి వీరరాఘవరావుగారు తెలుగులో మనందరికీ తెలిసిన పోతన భాగవతంనుండి పద్యాలు, ధూర్జటి మహాకవిగారి శ్రీకాళహస్తీశ్వర స్తోత్రంనుండి పద్యాలు ఉదహరిస్తూ సరళశైలిలో వ్యాఖ్యానము చేసి మనకు అందించారు.

దీనిని చదివి, మరల మరల మననం చేసుకుంటూ, తెలుగు ప్రజలు నిత్యానందమును పొందాలని కోరుతున్నాను. శ్రీ రాఘవరావుగారిని, వారి సతీమణి శ్రీమతి రాజ్యశ్రీగారిని, వారి కుటుంబసభ్యులను గోవిందుడు ఆత్మజ్ఞానంతో ఆశీర్వదించాలని ప్రార్థిస్తూ

22nd October 2019 **స్వామిని శివాత్మానంద సరస్వతి**

# జ్ఞాననిధి స్వామి పరమార్థానంద!

**పునరపి జననం పునరపి మరణం, పునరపి జననీ జఠరే శయనమ్।**

**ఇహ సంసారే బహు దుస్తారే, కృపయాఽపారే పాహి మురారే॥**

సంసారచక్రం అంటే పునరపి జననం, పునరపి మరణం. ఈ చక్రంనుంచి మనను రక్షించి మనకు మోక్షం ప్రసాదించగలిగేది శ్రోత్రియ బ్రహ్మనిష్ఠాపరుడైన గురువు ఒక్కరే! అటువంటి గురువు ఎక్కడ ఉన్నారు అని మనం వెతకనవసరంలేదు. ఆయన మన మధ్యలోనే, అవిరామంగా బోధలు చేస్తూ, ఎందరికో ఆత్మజ్ఞానం కలుగచేస్తూ ఉన్నారు. ఆయన వేరెవరోకాదు. సాక్షాత్తూ **స్వామి పరమార్థానందగారు.**

నాకు చిన్నప్పటినుంచి భగవద్గీత అంటే విపరీతమైన ప్రీతి. దాదాపుగా పదిమంది స్వామీజీల భగవద్గీత వ్యాఖ్యానాలు విన్నాను. అది ఉపనిషత్తుల సారం కాబట్టి చిన్మయామిషన్‌లో ఉపనిషత్తు బోధ జరిగినప్పుడల్లా అక్కడికి వెళ్ళి వింటూ ఉండే వాడిని. తరువాత బ్రహ్మసూత్రాలమీద మక్కువ ఏర్పడింది. దానికి ఒక పుస్తకం చదివాను కాని ఇంకా లోతుగా తెలుసుకోవాలనిపించి, నెట్‌లో సర్ఫ్ చేస్తూంటే పరమార్థానందవారి బోధ దొరికింది. అవి 390 తరగతులలో చెప్పిన ఆడియోలు. వాటిని డౌన్‌లోడ్ చేసుకుని వింటే నా ఆనందానికి అవధులు లేవు.

వెంటనే రామకృష్ణ మిషన్‌కు పరుగు పెట్టాను, స్వామీజీని కలుసుకోడానికి. రామకృష్ణమిషన్‌ను నిర్వహణ చేసే స్వామీజీ కూడా ఇదే పేరుతో ఉండేవారు. అక్కడ తెలిసింది, వీరు చెన్నైలో ఉంటారని. హుటాహుటిని చెన్నై బయలుదేరి స్వామీజీని కలిసి వారి శిష్యరికం కోరి, మైలాపూర్‌లోని శాస్త్రప్రకాశికలో వారి ఆడియోలు కొని విందామని లోపలికి అడుగు పెట్టాను. నాకు కళ్ళు తిరిగినంత పనైంది. అనారోగ్యంతో కాదు ఆశ్చర్యంతో! అక్కడ

పదివేల పైనే ఉంటాయి ఆయన సీడీలు!! అంత నిధి బహుశః ఎక్కడాదొరకదేమో! ఈ విషయం గిన్నీస్ బుక్‌లో ఎక్కదగినది. నాకు ఒక పెద్ద నిధి, పెన్నిధి దొరికిన ఆనందం కలిగింది.

**Veni,Vidi, Vici నేను వచ్చాను, నేను చూశాను, నేను జయించాను.**

అద్వైతవేదాంతంలో భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలను ప్రస్థానత్రయం అంటారని స్వామీజీద్వారా విన్నాను. బ్రహ్మసూత్రాలు డౌన్‌లోడ్ చేసుకున్నాను. భగవద్గీత, పది ఉపనిషత్తులమీద వారి వ్యాఖ్యానం ఉన్న ఆడియోలు కొన్నాను. ముందుగా అద్వైతవేదాంత పరిచయం వినాలి, తరువాత భగవద్గీత, పది ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు వినాలిట. ఆ క్రమంలో నిరంతరమూ వింటూ, వారిని ప్రతి సంవత్సరమూ కలిసి, వారి తరగతులలో కూర్చుని, విడిగా వారివద్ద శంకా నివృత్తి చేసుకుని, నిస్సంశయ ఆత్మజ్ఞానాన్ని సమకూర్చుకున్నాను. పదిహేను సంవత్సరాల క్రితం దొరికిన ఆ నిధి, నా జీవితాన్నీ, నా సతీమణి రాజ్యశ్రీ జీవితాన్నీ మార్చేసింది.

ఒక సందర్భంలో అనుకోకుండా నేను బోధ చేయటానికి శ్రీకారం చుట్టటం జరిగింది. నేనేమిటి, ఆత్మవిద్య బోధించమేమిటి అంటే పట్టుపట్టి నాచేత పాఠం చెప్పించారు ఒక సత్సంగ్ సభ్యులు. పాఠం చాలా బాగుందని అందరూ సమ్మతించడం, ప్రోత్సహించడంతో మెల్లిగా ఒక్కొక్క ఉపనిషత్తు చెప్పుకుంటూ వచ్చాను. రాజ్యశ్రీ కూడా నాకు చేదోడువాదోడుగా నిలిచి ఉపనిషత్తులు చెప్పడం మొదలు పెట్టింది.

పాఠంచెప్పే కొత్తల్లో, పరమార్థానందస్వామీజీని అడిగాను, 'నేను పాఠం చెప్పవచ్చా?' వెంటనే ఆయన నన్ను చాలా ప్రోత్సహించారు. 'నువ్వు బోధిస్తున్నావని ఎవరన్నారు, గురుపరంపరగా నీకు అందిన జ్ఞానాన్ని నలుగురుకీ పంచుతున్నావు (యూ ఆర్ షేరింగ్ ది నాలెడ్జి). నేను చేసేదీ

అంతే,' అన్నారు. దాంతో నాకు వేయి ఏనుగుల బలం వచ్చింది. ఇంక వెనుదిరిగి చూడలేదు.

గురుకృపతో మనం సాధించలేనిది ఏమీ లేదు అని చెప్పటానికి మా దంపతులమే ఉదాహరణ. స్వామీజీ ఆశీర్వచనబలంతో మూడు సత్సాంగాలలో బోధిస్తున్నాము. స్వామీజీ ఆంగ్లంలో బోధించిన ఉపనిషత్తులు, ప్రకరణ గ్రంథాలను సులభమైన శైలిలో నా శ్రీమతి తేటతెలుగులోకి అనువదించింది. దానికి కూడా స్వామీజీ అనుగ్రహంకోరితే అన్నీ రాస్తావు అని రెండు చేతులూ ఎత్తి మనసారా దీవించారు. ఆయన దీవెనెలు ఫలిస్తున్నాయి. స్వామివారి సూచన మేరకు **వేదాంత జీవనవిధానం** కూడా ప్రచురించాము. అనతికాలంలోనే అది జనాదరణ పొందింది.

స్వామివారి స్ఫూర్తి, దీవెనెలు, ప్రోత్సాహంతో ఇప్పటిదాకా పద్దెనిమిది పుస్తకాలు ప్రచురించాము. వ్రాయటమే ఎరుగని నేను అంతకు ముందు **తేలికగా తైత్తిరీయం,** ఇప్పుడు **భజగోవిందం** వ్రాశాను. ఈ రెండూ రీ-ప్రింట్‌కు కూడా వచ్చాయి. నా చిరుప్రయత్నానికి కూడా స్వామీజీ కృపాకటాక్షాలే కారణం.

**గురోరంఘ్రిపద్మే మనశ్చేన్న లగ్నమ్।**
**తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్॥**

**శ్రీగురుభ్యో నమః**

**కస్తూరి వీరరాఘవరావు**

# స్పందన

**శ్రుతి స్మృతి పురాణానామ్ ఆలయం కరుణాలయమ్ ।**
**నమామి భగవత్పాదం శఙ్కరం లోకశఙ్కరమ్ ॥**

జ్ఞానసముపార్జనా మార్గానికి జీవితంలో అవరోధంగా నిలిచే, మోక్ష సాధనమైన దైవస్మరణ మిళితం కాని పాఠం, ధనాగమతృష్ణ, మోహావేశం, అతిశయచపలం, బాల్య–యౌవన–వృద్ధాప్య క్రమం, భార్యాపుత్రుల మాయా జగత్తు, ముసలితనం, మరణం, సత్సంగ ప్రాముఖ్యతవంటి ఒక్కొక్క అంశాన్ని స్పృశిస్తూ, అడ్డంకులను అధిగమించే తరుణోపాయాన్ని కూడా సూచిస్తూ శ్రీ శంకరభగవత్పాదులు రచించిన అపూర్వగ్రంథం – భజగోవిందమ్. ఒక్కొక్క శ్లోకం చదువుతూ అంతర్లీనంగా ఉన్న భావం, సందేశాన్ని గ్రహిస్తూ వెళితే మోక్షమార్గాన్వేషణలో ఒక్కొక్క మెట్టు పైకి వెళ్తున్న అనుభూతి కలుగుతుంది.

ఇటువంటి అపూర్వమైన అద్వైత వేదాంత విజ్ఞానాన్ని సరళమైన, సులభశైలిలో తెలుగులోకి అనువదించి సంపుటాలుగా అందిస్తున్న కస్తూరి వీరరాఘవరావు, కస్తూరి/మద్దూరి రాజ్యశ్రీగార్ల కృషి అనిర్వచనీయము. సమాజశ్రేయోభిలాషులు, సమభావవర్తనులు అయిన వీరిరువురి శ్రమ ఒకనాటిది కాదు.

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అనేది ఆర్యోక్తి. సద్బుద్ధి అంకురంలో(తో)నే ఆవిష్కృతమౌతుందన్నది జనవాక్యం. వీరరాఘవరావు గారు భగవద్భక్తి మెండుగా కల కుటుంబ నేపథ్యంలో పెరిగి, చిన్ననాటినుండే తెల్లవారుఝామునే భగవద్గీత, సుందరకాండ పారాయణ చేయటం, మాన్యుల ప్రసంగాలతో వేదాంతజ్ఞానాన్ని పరిపుష్టం చేసుకోవడంవంటి భావజాలంతో పెరిగిన సుగుణసంపన్నులు. వీరి భక్తిభావం దినదిన ప్రవర్థమానమవుతూ, అదే నేటి జిజ్ఞాసువులకు వరప్రసాదమైంది.

ఇక వీరికి సరిజోడీ రాజ్యశ్రీగారి విషయానికొస్తే – జనసామాన్యానికి పుస్తకాలు కొనుక్కునే స్థాయిలేని రోజుల్లో ఇంటింటా గ్రంథాలయం పేరుతో సాహిత్య, హిందూ సాంప్రదాయాలను దగ్గరకు చేర్చి ఎంతోమందిని రచయిత(త్రు)లుగా, విశ్లేషకులుగా, ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దిన సమాజస్ఫూర్తి కలిగిన శేషాచలం అండ్ కో, ఇంటింటా గ్రంథాలయం, స్వామి గ్రంథానందుల ఆవిష్కర్తలైన విద్యావేత్తల

కుటుంబ నేపథ్యంనుంచి రావటమేకాక యాభై పైగా, ఆంగ్లంలోని శాస్త్రీయ సంబంధమైన వాటితో సహా వివిధ పుస్తకాలను తెలుగులోకి అనువదించి, పాఠకులకు పఠనసౌలభ్యం కల్పించిన అనువాదశిల్పి. ఆ స్ఫూర్తిని కొడిగట్టనీయక నేనున్నాను, నేనూ ఉన్నాను అంటూ రాఘవరావు గారికి చేదోడువాదోడై కఠినమైన, జఠిలమైన వేదాంత సాహిత్యాన్ని శ్రీ పరమార్థానందస్వామివారి ఆంగ్ల ప్రసంగాలనుండి సరళమైన తెలుగులోకి అనువదిస్తూ, సంస్కృత పరిభాషా పదజాలాన్నించి కొంత ఉపశమనం కల్గిస్తూ, ముద్రణకు సహాయపడటంతో పాటు ప్రసంగములలో కూడా పాలు పంచుకుంటూ వేదమాతకు సేవ చేస్తున్న ప్రపాపాలిక.

ఆధ్యాత్మిక ప్రసంగాలద్వారా హైదరాబాదు అమీర్‌పేట్‌లోను, నల్లగండ్ల ప్రాంతంలోని అపర్నా కమ్యూనిటీలలోనూ, ఇప్పుడు ఆన్‌లైన్‌ద్వారా అంతర్జాతీయంగానూ, జిజ్ఞాసువులను చైతన్యపరుస్తూ, అవిరామమైన కృషికి అంకితమైన కస్తూరి వీరరాఘవరావు, కస్తూరి/మద్దూరి రాజ్యశ్రీ దంపతులు ధన్యజీవులు.

డుకృఞ్కరణే అని వల్లె వేస్తున్న వృద్ధపండితుడిని (పరోక్షంగా మనని) మోక్ష మార్గాన్వేషకులుగా చేయటానికి శంకరాచార్యులు భజగోవిన్దమ్ బోధిస్తే, దృష్టికోణం మార్చుకుని, అద్వైతాన్ని అధ్యయనం చేసి మోక్షమార్గాన్వేషకులుకండి అని రాఘవరావు, రాజ్యశ్రీ దంపతులు మార్గనిర్దేశం చేస్తున్నారు.

మధ్యలో ప్రస్తావించిన ఉదాహరణలు సహేతుకంగా, సమయోచితంగా శోభిల్లుతూ, విషయవివరణను మరింత పరిపుష్టం చేశాయనడం అతిశయోక్తి కాదు. ప్రత్యేకించి శ్రీ గొల్లపూడి మారుతిరావు గారు వృద్ధాప్యంపై చేసిన విశ్లేషణ సందర్భోచితంగా ఉండి, హృదయానికి హత్తుకునేలా ఉంది.

హిందూధర్మం చెప్పే బ్రహ్మపథానికి పదిసూత్రాలు – యమ, నియమాలు (టెన్ కమాండ్‌మెంట్స్) చాలా సులువుగా అధ్యయనం చేయటానికి అనువైన రీతిలో వివరించారు. వీరు తెనిగించి, ప్రచురించిన ఉపనిషత్తులను చదివిన పాఠకులకు లేదా వీరి ప్రసంగాలను విన్న శ్రోతలకు ఒక విషయం తప్పక స్ఫురిస్తుంది.

కొద్దిగా కష్టమైనది చేయవలసి వచ్చినప్పుడు, 'అదేం పెద్ద బ్రహ్మవిద్యా?' అనే నానుడి తెలుగు ప్రజల నాలుకలపై తరచు నడయాడుతూ ఉంటుంది. ఆ బ్రహ్మవిద్య అనే పదాన్ని ఒక నానుడిగా జనపదాల్లో పెద్దలు అంత సులువుగా పలికించగలిగారు, స్వస్వరూపమైన బ్రహ్మను అంతే సులువుగా అర్థం చేసుకుని బ్రహ్మనిష్ఠలో ఉండే స్థాయికి మనల్ని చేర్చటానికి, 'బ్రహ్మవిద్య నేర్చుకోకుండా కాలం వెళ్ళబుచ్చితే మన జీవితమే వృథా,' అంటూ సున్నితంగా చురకవేస్తూ, పుస్తకాలనిచ్చి, ప్రసంగాలతో బోధ చేస్తూ రాఘవరావు, రాజ్యశ్రీలు మన మస్తకాలకు పదును పెట్టేస్తున్నారేమోననిపిస్తోంది.

**'మీ అంతిమలక్ష్యం ఆధ్యాత్మికతనే సుమా!'** అని గుచ్చిగుచ్చి గుర్తు చేస్తున్నారు. మనసును నిలబెట్టుకుని మననం చేయడమే మన కనీస కర్తవ్యం. ఒక ఆమ్ ఆద్మీని ఆధ్యాత్మిక కోణంలో ఇంతగా ఆలోచింపచేసి, ఆచరణకు ప్రోత్సహించే దిశగా వీరు చేస్తున్న ఈ బృహత్ సత్ప్రయత్నం, యువతకు కూడా చేరి వారిలో సద్భావనా ప్రవృత్తిని జాగృతం చేయగలిగితే, హింసామార్గంలో ఉండేవారిని సన్మార్గ వర్తనులుగా చేసి సమసమాజ స్థాపనకు నాంది కాగలదని, ఇది అసంఘటిత మవుతున్న నేటి సమాజానికి అత్యవసరమని నా ధృడ విశ్వాసం.

వీరి ధార్మిక వ్యాసంగం కలకాలం వర్ధిల్లాలని, ఎన్నో, మరెన్నో సమాజ శ్రేయస్సును కాంక్షించే వీరి ప్రచురణలు, ప్రసంగాలు ఆవిష్కృతమవ్వాలని వీరి ఉనికిలో, మనసులో కొలువైన శ్రీ వేంకటేశ్వరస్వామిని మనఃపూర్వకంగా ప్రార్థిస్తున్నాను.

సర్వేజనాః సుఖినో భవంతు॥

**డా॥ రామానంద శర్మ మంచిరాజు**

# న తాతో న మాతా న బంధుర్న దాతా!

**బాలస్తావత్క్రీడాసక్తః, తరుణస్తావత్తరుణీసక్తః।**
**వృద్ధస్తావచ్చిన్తాసక్తః, పరమే బ్రహ్మణి కోఽపి న సక్తః॥**

జీవితమంతా పరుగుపందెంతోనే సరిపోతోంది. లౌకిక సుఖాలకోసం ఎంతగా పరుగులు తీస్తున్నారంటే, ఒక్కక్షణం ఆ పరుగు ఆపి, ఆత్మవిమర్శ చేసుకునే తీరిక ఎవరికీ లేదు. భగవధ్యానం చేసే భక్తి అసలే లేదు. ఎవరికోసం నీ పరుగు, భార్యా పిల్లల కోసమా?

**కా తే కాన్తా? కస్తే పుత్రః?** నువ్వు మరణించిన మరుక్షణం నీ భౌతికకాయాన్ని తాకటానికి కూడా భయపడుతుంది నీభార్య – **భార్యా బిభ్యతి తస్మిన్ కాయే!**

బంధుమిత్రులకోసమా? **కోఽపి న పృచ్ఛతి కుశలం గేహే –** ముసలితనంలో ఎలా ఉన్నావని కూడా అడగరు.

ధనం చూసుకుని మురిసిపోతున్నావా? **క్షీణే విత్తే కః పరివారః?** ధనం ఖర్చయిపోయాక పరివారం ఎక్కడ?

యౌవనగర్వంతో మిడిసిపడుతున్నావా? **మా కురు ధనజనయౌవనగర్వం, హరతి నిమేషాత్కాలస్సర్వం** ధనం, జనం, యౌవనం ఏవీ శాశ్వతం కాదు. కాలసర్పం అన్నిటినీ కబళించివేస్తుంది.

అలా ఒక్కొక్క సమ్మెటపోటు వేస్తారు శంకరభగవత్పాదులు భజగోవిందంలో. అలా సుత్తిదెబ్బలు వేస్తున్నారనే దీన్ని **'మోహముద్గర'** అని కూడా అంటారు.

నిజానికి, నా జీవితంలో నేను కూడా ఇలా పరుగుపందెంలో కొట్టుకు పోవలిసిన వాడినే! భగవత్కృప నామీద అపారంగా ఉండటంవల్ల, శంకరభగవత్పాదులు దిశానిర్దేశం చేయటంవల్ల, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠా పరులైన గురువు పరమార్థానందస్వామివారి ద్వారా జ్ఞాననిధిని పొందటంవల్ల నేను సకాలంలో కళ్ళు తెరుచుకున్నాను.

ఒకప్పుడు షేరుమార్కెట్‌మీద ఎక్కువ కాలం గడుపుతూ ఉండేవాడిని. ఇప్పుడు షేర్ మాటే మర్చిపోయాను.

**మూఢ జహీహి ధనాగమతృష్ణాం, కురు సద్బుద్ధిం మనసి వితృష్ణామ్।**

ఓ మూఢుడా, ఇంకా ఇంకా ధనం కావాలనే అత్యాశను వీడుము; అంతూపొంతూలేని అతృప్తికరమైన కోరికలు వీడి మనస్సును ఈశ్వరబుద్ధితో నింపు. ఒకరోజు ఈ వాక్యాలు సరాసరి నన్ను ఉద్దేశించి చెప్పినట్టు అయింది. అందువల్ల జ్ఞానమార్గంలోకి అడుగుపెట్టటం జరిగింది. ఆర్షవిద్యను ప్రత్యక్షంగా గురుముఖతః శ్రవణం చేయాలనేది శాస్త్రనియమం. నేను, రాజ్యశ్రీ పూజ్యస్వామి దయానంద సరస్వతి నిర్వహించిన వేదాంత శిబిరాలకు వెళుతూ ఉండేవారము.

**స్వామిని ఆత్మలీనానంద సరస్వతి**వారివద్ద ఐతరేయోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు, బ్రహ్మసూత్రాలు(చతుస్సూత్రీ) శ్రవణం నేను, రాజ్యశ్రీ చేశాము. స్వామిని ఆత్మలీనానంద సరస్వతివారి బోధలు చాలా విపులంగా, వేదాంతసారవంతంగా, సులభతరంగా ఉంటాయి. పూజ్యస్వామీజీ, దయానందసరస్వతి స్వామీజీ నిర్వహించే వేదాంత శిబిరాలకు ప్రతిసంవత్సరమూ వెళుతూండేవాడిని. అలా నేను పరమార్థానందగారి స్వామి బోధలు, స్వామిని ఆత్మలీనానందసరస్వతివారి బోధలు కొన్ని సంవత్సరముల పాటు విన్నాను. మా వెబ్‌సైట్ తెలుగుభక్తి.కామ్ వార్షిక సమావేశంలో నన్ను మాట్లాడమని నా సతీమణి రాజ్యశ్రీ ప్రోద్బలం చేసింది.

**అద్వైత వేదాంతం – ఒక విహంగ వీక్షణం** పేరిట **కుండ పట్టుకుని** పూజ్యస్వామీజీ చెప్పిన కొన్ని అంశాలు చెప్పటం జరిగింది. వెంటనే ఒక సత్సంగసభ్యులు నా దగ్గరకు వచ్చి, వారికి నేను ఉపనిషత్తులను బోధించాలని పట్టుపట్టారు. ముందు సంకోచించినా, గురుపరపరంగా నాకు తెలిసినది కాస్తా నలుగురితో పంచుకోవాలనే సదుద్దేశంతో నా భార్య రాజ్యశ్రీతోపాటు ఈశ్వరానుగ్రహంతో అప్పటినుంచీ అద్వైతవేదాంతాన్ని బోధిస్తున్నాను.

అందులో భాగంగా సంవత్సరానికి ఒకసారి వేదాంత శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాము. రెండవ శిబిరం శ్రీశైలంలోని శృంగేరి పీఠములో నిర్వహించాము. అరవైమంది సభ్యులు పాల్గొన్నారు. అక్కడ నేను భజగోవిందం పాఠం చెప్పాను. అది అందరికీ నచ్చింది. పుస్తకరూపంలో తీసుకు రమ్మని, మా శ్రేయోభిలాషులు వెన్నుతట్టి ప్రోత్సహిస్తే గ్రంథాలు రాసే అలవాటులేని నేను ఈ సాహసం చేశాను. మూడవ శిబిరం నైమిశారణ్యంలో నిర్వహించాము.

ఈ భజగోవిందం గురించి తెలియని వారుండరు. ఎప్పుడో అప్పుడు దాని గురించి వినో, దాన్ని చదివో ఉంటారు. అందువల్ల నేనొక ప్రత్యేక బాణిని ఎంచుకున్నాను.

అధ్యయనానికి వెసులుబాటుగా ప్రతిశ్లోకానికి ప్రతిపదార్థము, తాత్పర్యముతోపాటు, అన్వయము కూడా కలిపాను. వ్యాఖ్యానముతో పాటు దానికి అనుగుణమైన కథ, మరొక శ్లోకము కూడా కలిపి విషయం రసవత్తరముగా, గుర్తుండేలా పొందుపరిచాను. ఈ పుస్తకము బాగా ప్రజాదరణ పొంది, పునర్ముద్రణకు నోచుకుంది. మీకు ఈ గ్రంథము ఆధ్యాత్మిక ఎదుగుదలకు, దిశానిర్దేశమునకు తోడ్పడాలని ఆశిస్తున్నాను.

**సర్వమ్ ఈశ్వరార్పణమస్తు**

**కస్తూరి వీరరాఘవరావు**

# భజగోవిన్దమ్ - శ్లోకములు

## ద్వాదశ మంజరికా శ్లోకములు

భజ గోవిన్దం భజ గోవిన్దం, గోవిన్దం భజ మూఢమతే।
సంప్రాప్తే సన్నిహితే కాలే, న హి న హి రక్షతి 'డుకృఞ్కరణే'॥ 1
మూఢ జహీహి ధనాగమతృష్ణాం, కురు సద్బుద్ధిం మనసి వితృష్ణామ్।
యల్లభసే నిజకర్మోపాత్తం, విత్తం తేన వినోదయ చిత్తమ్॥ 2
నారీ స్తనభరనాభీదేశం, దృష్ట్వా మాగా మోహావేశమ్।
ఏతన్మాంసవసాదివికారం మనసి విచిన్తయ వారం వారమ్॥ 3
నలినీదలగతజలమతితరలం, తద్వజ్జీవితమతిశయచపలమ్।
విద్ధి వ్యాధ్యభిమానగ్రస్తం, లోకం శోకహతం చ సమస్తమ్॥ 4
యావద్విత్తోపార్జనసక్తః, తావన్నిజపరివారో రక్తః।
పశ్చాజ్జీవతి జర్జరదేహే, వార్తాం కోఽపి న పృచ్ఛతి గేహే॥ 5
యావత్పవనో నివసతి దేహే, తావత్పృచ్ఛతి కుశలం గేహే।
గతవతి వాయౌ దేహాపాయే, భార్యా బిభ్యతి తస్మిన్కాయే॥ 6
బాలస్తావత్క్రీడాసక్తః, తరుణస్తావత్తరుణీసక్తః।
వృద్ధస్తావచ్చిన్తాసక్తః, పరమే బ్రహ్మణి కోఽపి న సక్తః॥ 7
కా తే కాన్తా? కస్తే పుత్రః? సంసారోఽయమతీవ విచిత్రః।
కస్య త్వం? కః కుత ఆయాతః? తత్త్వం చిన్తయ తదిహ భ్రాతః॥ 8
సత్సఙ్గత్వే నిస్సఙ్గత్వం, నిస్సఙ్గత్వే నిర్మోహత్వమ్।
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం, నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః (భవతి)॥ 9
వయసి గతే కః కామవికారః శుష్కే నీరే కః కాసారః।
క్షీణే విత్తే కః పరివారో జ్ఞాతే తత్త్వే కః సంసారః॥ 10
మా కురు ధనజనయౌవనగర్వం, హరతి నిమేషాత్కాలస్సర్వం।
మాయామయమిదమఖిలం హిత్వా, బ్రహ్మ పదం త్వం ప్రవిశ విదిత్వా। 11
దినయామిన్యౌ సాయంప్రాతః, శిశిరవసన్తౌ పునరాయాతః।
కాలః క్రీడతి గచ్ఛత్యాయుః, తదపి న ముఞ్చత్యాశావాయుః॥ 12

## చర్పట పంజరికా శ్లోకములు

కా తే కాన్తా ధనగతచిన్తా, వాతుల కిం తవ నాస్తి నియన్తా।
త్రిజగతి సజ్జనసంగతిరేకా, భవతి భవార్ణవతరణే నౌకా॥ 13
జటిలో ముణ్డీ లుఞ్ఛితకేశః, కాషాయామ్బరబహుకృతవేషః
పశ్యన్నపి చ న పశ్యతి మూఢః, ఉదరనిమిత్తం బహుకృతవేషః॥ 14
అఙ్గం గలితం పలితం ముణ్డం, దశనవిహీనం జాతం తుణ్డమ్।
వృద్ధో యాతి గృహీత్వా దణ్డం, తదపి న ముఞ్చత్యాశాపిణ్డమ్॥ 15
అగ్రే వహ్నిః పృష్ఠే భానుః, రాత్రౌ చుబుకసమర్పితజానుః।
కరతలభిక్షస్తరుతలవాసః, తదపి న ముఞ్చత్యాశాపాశః॥ 16
కురుతే గఙ్గాసాగరగమనం, వ్రతపరిపాలనమథవా దానమ్।
జ్ఞానవిహీనస్సర్వమతేన, భజతి న ముక్తిం జన్మశతేన॥ 17
సురమన్దిరతరుమూలనివాసః, శయ్యా భూతలమజినం వాసః।
సర్వపరిగ్రహభోగత్యాగః, కస్య సుఖం న కరోతి విరాగః॥ 18
యోగరతో వా భోగరతో వా, సఙ్గరతో వా సఙ్గవిహీనః।
యస్య బ్రహ్మణి రమతే చిత్తం, నన్దతి నన్దతి నన్దత్యేవ॥ 19
భగవద్గీతా కిఞ్చిదధీతా, గఙ్గాజలలవకణికా పీతా।
సకృదపి యేన మురారిసమర్చా, క్రియతే తస్య యమేన న చర్చా॥ 20
పునరపి జననం పునరపి మరణం, పునరపి జననీ జఠరే శయనమ్।
ఇహ సంసారే బహు దుస్తారే, కృపయాఽపారే పాహి మురారే॥ 21
రథ్యాచర్పటవిరచితకన్థః, పుణ్యాపుణ్యవివర్జితపన్థః।
యోగీ యోగనియోజితచిత్తః, రమతే బాలోన్మత్తవదేవ॥ 22
కస్త్వం కోఽహం కుత ఆయాతః, కా మే జననీ కో మే తాతః।
ఇతి పరిభావయ సర్వమసారమ్, విశ్వం త్యక్త్వా స్వప్నవిచారమ్॥ 23
త్వయి మయి చాన్యత్రైకో విష్ణుః, వ్యర్థం కుప్యసి మయ్యసహిష్ణుః।
భవ సమచిత్తః సర్వత్ర త్వం, వాఞ్ఛస్యచిరాద్యది విష్ణుత్వమ్॥ 24
శత్రౌ మిత్రే పుత్రే బన్ధౌ, మా కురు యత్నం విగ్రహసన్ధౌ।
సర్వస్మిన్నపి పశ్యాత్మానం, సర్వత్రోత్సృజ భేదాజ్ఞానమ్॥ 25
కామం క్రోధం లోభం మోహం, త్యక్త్వాఽత్మానం పశ్యతి సోఽహమ్।
ఆత్మజ్ఞానవిహీనా మూఢాః, తే పచ్యన్తే నరకనిగూఢాః॥ 26

## ఉపసంహార శ్లోకములు

గేయం గీతానామసహస్రం, ధ్యేయం శ్రీపతిరూపమజస్రమ్।
నేయం సజ్జనసఙ్గే చిత్తం, దేయం దీనజనాయ చ విత్తమ్॥ 27
సుఖతః క్రియతే రామాభోగః, పశ్చాద్ధన్త శరీరే రోగః।
యద్యపి లోకే మరణం శరణం, తదపి న ముఞ్చతి పాపాచరణమ్॥ 28
అర్థమనర్థం భావయ నిత్యం, నాస్తి తతః సుఖలేశః సత్యమ్।
పుత్రాదపి ధనభాజాం భీతిః, సర్వత్రైషా విహితా రీతిః॥ 29
ప్రాణాయామం ప్రత్యాహారం, నిత్యానిత్యవివేకవిచారమ్।
జాప్యసమేతసమాధివిధానం, కుర్వవధానం మహదవధానమ్॥ 30
గురుచరణామ్బుజనిర్భరభక్తః, సంసారాదచిరాద్భవముక్తః।
సేన్ద్రియమానసనియమాదేవం, ద్రక్ష్యసి నిజహృదయస్థం దేవమ్॥ 31

***

# శ్రీగణపతి ప్రార్థన

ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే
కవిం కవీనాముపమశ్రవస్తమమ్।
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆ నః
శృణ్వన్నూతిభిస్సీద సాదనమ్॥

ప్రణో దేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ ।
ధీనామవిత్ర్యవతు । శ్రీ గణేశాయ నమః ।
శ్రీ సరస్వత్యైనమః । శ్రీ గురుభ్యో నమః ।
హరిః ఓమ్
॥ ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

***

# భజగోవిన్దమ్ (మోహముద్గర)
# ద్వాదశమంజరికా శ్లోకముల వ్యాఖ్యానము

**సదాశివసమారమ్భాం శంకరాచార్యమధ్యమామ్।**
**అస్మదాచార్యపర్యంతాం వన్దే గురుపరంపరామ్॥**

**ఉపోద్ఘాతం –** ఆదిశంకరాచార్యులు చాలాకాలం కాశీలో ఉండి అనేక గ్రంథరచనలు చేశారు. ఆ సమయంలో వారు గంగాస్నానం నిమిత్తం, గంగాఘాట్‌కు వెళ్ళారు. ఘాట్‌వద్ద ఒక పండితుడు, వయోవృద్ధుడు డుకృఞ్కరణే అనే సంస్కృతపాఠాన్ని వల్లె వేస్తూ కనిపించారు. కృ అనే ధాతువు కర్మను సూచిస్తుంది (కరోతి, కురుతః, కుర్వంతి).

ఆ పండితుడు ముసలివాడు. వృద్ధాప్యంతో నిండినవాడు. అటువంటి వ్యక్తి భగవత్ చింతన ఏమాత్రమూ లేకుండా ఇంకా వ్యాకరణసూత్రాలు వల్లె వేయడం చూసి శంకరులకు అపారమైన జాలి, కరుణ కలిగి, ఆ పండితునకు దిశానిర్దేశము చేయదలచి ఆశువుగా పన్నెండు శ్లోకాలు చెప్పారు. ఇది కేవలం ఆ వృద్ధపండితునకే కాదు, భగవంతుని విస్మరించి లౌకిక వ్యవహారాలలో తలమునకలౌతున్న అనేకమంది జనావళిని ఉద్దేశించి బోధించిన గ్రంథము.

సంస్కృతము చదివితే తప్పేమిటి అని మనకు అనిపించవచ్చు. దీని ఉద్దేశ్యము సంస్కృతము చదవద్దని కాదు. లౌకికవిద్యలలోనే జీవితమంతా గడిచిపోతే పరబ్రహ్మమును ఎప్పుడు తెలుసుకుంటాడనే ఆవేదనతో ఈ శ్లోకాలు చెప్పబడ్డాయి. లౌకికలంపటాలనుంచి విముఖతకోసం కొంచెం కటువుగా చెప్పవలిసి ఉంటుంది. అందుకే శంకరభగవద్పాదులు నిష్కర్షగా విషయాన్ని బోధించారు. లౌకికమోహంనుంచి విముక్తి కలిగించే విషయం కనుక దీనిని **మోహముద్గర** అని కూడా అన్నారు. ముద్గర అంటే సమ్మెటపోటు మోహముద్గర– మోహవిమోచనంకోసం వేసిన సమ్మెటపోటు. మనిషి సంసారానికి మోహితుడై దుఃఖాన్ని కోరి తెచ్చుకుంటున్నాడు. అటువంటి దుఃఖాన్ని పోగొట్టడానికే ఈ సమ్మెటపోటు.

సంస్కృతం ఈర్ష్యతో ఉన్న భార్యలాంటిదని పూజ్యస్వామీజీ ఛలోక్తిగా అంటూ ఉండేవారు. ఈర్ష్యతో ఉన్న భార్య ఎలా మరొకరిని దరిదాపుల్లోకి రానివ్వదో

అలానే సంస్కృత అధ్యయనసమయంలో మరే యితర విషయమూ అధ్యయనం చేయకుండా సంస్కృతపఠనంతోనే కాలం ముగిసిపోతుంది. ఎప్పుడు ఏ విద్య పనికి వస్తుంది అనే విషయంపై శాస్త్రంలో ఓ కథ చెబుతారు.

బేస్తవాడొకడు గంగానదిలో పడవ నడుపుతూ జీవనం గడుపుతున్నాడు. ఒకరోజు ఒక మహాపండితుడు పడవలో గంగను దాటుతున్నాడు. ఆ పడవలో పండితుడు, పడవనడిపే బేస్తవాడు మాత్రమే ఉన్నారు. పండితునికి ఆ బేస్తవానిని ఆట పట్టించాలని కోరిక కలిగింది.

ఆ పండితుడు బేస్తవానితో, 'అబ్బాయ్ నీకు సంస్కృతమొచ్చా?' దానికి బేస్తవాడు, 'స్వామీ, నా తాత ముత్తాలనుంచి నా వరకూ ఎవ్వరమూ చదువుకోలేదు. పరంపరగా పడవ నడిపే వృత్తితోనే పొట్ట పోసుకుంటున్నాము,' అన్నాడు వినయంగా. సంభాషణ ఇంకా కొనసాగింది –

పండితుడు – 'అయితే నీ జీవితంలో నాలుగవ వంతు వృథా అయిపోయింది. కనీసం వ్యాకరణమైనా వచ్చా,'

బేస్తవాడు – 'రాదు స్వామీ.'

పండితుడు – 'అయితే నీ జీవితం అర్ధభాగం వృథా అయిపోయింది. కనీసం మీమాంస శాస్త్రమైనా...'

బేస్తవాడు – 'అయ్యో అదేమో పేరు కూడా వినలేదు స్వామీ.'

పండితుడు – 'అయితే అబ్బాయ్, నీ జీవితం మూడువంతులు వృథా అయిపోయింది.'

ఇంతలో పడవ మధ్యలో కన్నం పడింది. పడవలోకి వడివడిగా నీరువచ్చి నిండుతోంది. మెల్లిగా పడవ మునిగిపోయే పరిస్థితి కూడా వచ్చింది.

బేస్తవాడు – 'స్వామీ మీకు తరణవిద్య (ఈత) వచ్చా?'

పండితుడు – నాకు ఈతెందుకు, నా పాండిత్యమే నన్ను పోషిస్తుంది.' అన్నాడు గర్వంగా.

బేస్తవాడు – 'అయితే స్వామీ మీ జీవితం పూర్తిగా వృథా అయిపోయింది.' అని పడవలోంచి దూకి ఒడ్డుకు ఈదుకుంటు వెళ్ళిపోయాడు. ఈతరాని డాంబిక పండితుడు పడవతోపాటు మునిగి పోయాడు. ఎలా తరణవిద్య ఆ క్లిష్టసమయంలో ముఖ్యమో అలాగే బ్రహ్మవిద్య ఈ సంసారసాగరం దాటడానికి అతి ముఖ్యమైనది. ఈ విషయాన్నే ఆ వృద్ధపండితునకు చెప్పాలని శంకరభగవత్పాదులు పూనుకున్నారు.

అలాగే నారద మహాముని సనత్కుమారుడిని కలిసి నాకు బ్రహ్మవిద్య బోధించమని అర్థిస్తాడు. సనత్కుమారుడు నీకేమి విద్యలు వచ్చో చెప్పమంటాడు. నారదుడు ఈ భూమిమీద ఎన్ని విద్యలున్నాయో అవి అన్నీ ఏకరువు పెడతాడు. నక్షత్రవిద్య, భూవిద్య, గంధర్వవిద్య, శీక్షా, కల్ప, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిష్యం – ఇలా అనంతంగా చెప్పుకుంటూ పోతాడు తనకు తెలిసిన విద్యలు గురించి. ఇన్ని తెలిసిన నీకు బ్రహ్మవిద్య ఎందుకంటాడు సనత్కుమారుడు. ఇన్ని తెలిసినా నాలో ఏదో తెలియని న్యూనత, వెలితి ఉంది. **'తరతి శోకమాత్మవిత్,'** అన్నారు. ఆ ఆత్మవిద్య నీకు తెలుసు, అది నాకు చెప్పు అంటాడు. సనత్కుమారుడు, 'అవును, నువ్వు నేర్చుకున్న ఈ విద్యలన్నీ అపరావిద్యలే, అవి మోక్షాన్నివ్వవు. **బ్రహ్మవిద్య మాత్రమే మోక్షాన్నిస్తుంది**' అని చెప్పి నారదునకు బ్రహ్మవిద్య బోధిస్తాడు.

హిరణ్యకశిపుడు తన కొడుకైన ప్రహ్లాదుని పిలిచి, 'నాయనా నువ్వు గురువు దగ్గర విద్య సరిగ్గా నేర్చుకున్నావా?' అని అడుగుతాడు. అప్పుడు ప్రహ్లాదుడు ఇలా సమాధానమిస్తాడు.

**చదివించిరి నను గురువులు**
**చదివితి ధర్మార్థముఖరశాస్త్రంబుల్ నే**
**చదివినవి గలవు పెక్కులు**
**చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రి!**

తండ్రీగురువులు నాకు లౌకిక విద్యలెన్నో నేర్పారు. ఏ విద్యవల్ల సమస్తము అవగతమౌతుందో ఆ మర్మము నేను గ్రహించాను అంటాడు.

మనకిచ్చిన ఈ అమూల్యమైన కాలాన్ని బ్రహ్మవిద్య నేర్చుకోకుండా కాలం వెళ్ళబుచ్చితే మన జీవితమే వృథా అయిపోయినట్టు!

***

## శ్లోకము - 1

**భజ గోవిన్దం భజ గోవిన్దం, గోవిన్దం భజ మూఢమతే।**
**సంప్రాప్తే సన్నిహితే కాలే, న హి న హి రక్షతి 'డుకృఞ్కరణే'॥**

**మూఢమతే-** = (ప్రాపంచిక విషయాలలో మమేకమైన) ఓ మూఢమతీ!

**(త్వం)-** = (నీవు)

**గోవిన్దం భజ-** = గోవిందుని స్తుతింపుము

**గోవిన్దం భజ-** = గోవిందుని స్మరింపుము

**గోవిన్దం భజ-** = గోవిందుని స్వరూప (ఆత్మ) విచారణ చేయి

**సంప్రాప్తే సన్నిహితే కాలే (సతి)-** = మరణం (యమధర్మరాజు) ఆసన్నమైన కాలంలో

**డుకృఞ్కరణే-** = (ప్రాపంచిక చదువులు) సంస్కృత సూత్రము (ధాతు పాఠము)

**న హి రక్షతి న హి రక్షతి-** = రక్షించదు, రక్షించదు

**పదచ్ఛేదమ్-** **భజ, గోవిన్దం, భజ, గోవిన్దం, గోవిన్దం, భజ, మూఢమతే। సంప్రాప్తే, సన్నిహితే, కాలే, న, హి, న, హి, రక్షతి, 'డుకృఞ్కరణే'॥**

**అన్వయమ్-** **మూఢమతే! (త్వం) గోవిన్దం భజ। (త్వం) గోవిన్దం భజ। (త్వం) గోవిన్దం భజ। సన్నిహితే కాలే సంప్రాప్తే (సతి) 'డుకృఞ్కరణే ' న హి రక్షతి। న హి రక్షతి॥**

**తాత్పర్యం-** ప్రాపంచిక విషయాలలో మోహితుడవైన ఓ మూఢమతీ! గోవిందుని స్తుతింపుము. గోవిందుని స్మరింపుము. గోవిందుని స్వరూపవిచారణ చేయుము. మరణకాలము ఆసన్నమైన సమయములో డుకృఞ్కరణే అనే సంస్కృత ధాతుపాఠం (అపరా విద్య) నిన్ను రక్షింపజాలదు.

వృద్ధపండితునిమీద జాలితో ఆత్మవిద్యవైపు ఆతని ధ్యాస మరలేలా భజగోవిందశ్లోకాలు చెప్పారు. దైవస్మరణతో ఆరంభంకాని గ్రంథాన్ని తాకవద్దని సాంప్రదాయం హెచ్చరిస్తుంది. ఆ దైవప్రార్థననే మంగళాచరణం అంటారు.

ఈ ప్రకరణ గ్రంథం ప్రబోధాత్మకంగా అక్కడ ఉన్న ఆ సంస్కృత పండితునిలో మార్పు తీసుకు రావాలనే ఉద్దేశ్యంతో చెప్పబడింది. సాంప్రదాయంగా దైవస్మరణతో మొదలు పెడితే పండితుడు అక్కడినుంచి పారిపోవచ్చు. కాని శంకరభగవత్పాదులు సంప్రదాయవిత్. అందువల్ల ఆ పండితుని హెచ్చరిస్తూనే మంగళాచరణం కూడా భజగోవిందంలో మిళితం చేశారు. అదెలాగో చూద్దాం-

**(హే)మూఢమతే! (త్వం) గోవిన్దం భజ। (త్వం) గోవిన్దం భజ। (త్వం) గోవిన్దం భజ।** - హే మూఢమతే గోవిన్దుని స్మరింపుము. శంకరులు మహామేధావి. వారు మంగళాచరణంలోనే నాలుగు అంశాలు చొప్పించారు.

**1.దైవస్మరణ 2. హెచ్చరిక 3. గురుప్రార్థన 4. పారమార్థిక బ్రహ్మ**

**1. దైవస్మరణ** - భజగోవిందమ్ అంటే గోవిందుని స్మరింపుము. **గాం విందతి పాలయతి ఇతి గోవిన్దః.** గోరక్షకుడే గోవిందుడు. గోపాలబాలుని నామంతో భజగోవింద ప్రకరణ గ్రంథం ఆరంభమైంది కాబట్టి మంగళాచరణం చేసినట్లైంది సాంప్రదాయం కూడా పాటించడమైంది.

**2. హెచ్చరిక** - గోవిందునివైపు నీ దృష్టి మరల్చుము అని హెచ్చరిక చేశాడు. ప్రపంచదృష్టినుంచి బ్రహ్మదృష్టి అలవరుచుకొమ్మని వృద్ధ పండితునికి దిశానిర్దేశం చేశారు భగవత్పాదులు.

**3. గురుప్రార్థన** - గోవిందనామంతో తన గురువైన గోవిందభగవత్పాదులను కూడా స్మరించుకున్నారు శంకరులు.

**4. పారమార్థిక బ్రహ్మ**- గోవిందశబ్దం పారమార్థికమైన బ్రహ్మను కూడా సూచిస్తుంది. ఈ గోవిందుడెవరు? మురళీధరుడా? పింఛము ధరించినవాడా? కాదు. సచ్చిదానంద పరమాత్మ. సత్యం, జ్ఞానం, అనంతమైన పరమాత్మ. అందుకే వివేకచూడామణిలో **గోవిన్దం పరమానన్దమ్** అన్నాడు. ఆనందానికి స్వస్థానమైన ఆ పరమాత్మ గురించి విచారణ చేయి.

**గో** - అంటే ఇంద్రియాలు. **గాః - ఇంద్రియాణి విందతి పాలయతి ఇతి గోవిన్దః.** ఇంద్రియాలకు, మనస్సుకు సత్తా ప్రదాతగా ఆత్మ ఉంది. వాటి పాలకుడు ఆత్మ లేదా పరబ్రహ్మ.

**సర్వవేదాన్తసిద్ధాన్తగోచరం తమగోచరమ్।**
**గోవిన్దం పరమానన్దం సద్గురుం ప్రణతోఽస్మ్యహమ్।।** - **వివేకచూడామణి**

పరమానన్దమ్ అంటే ఆనందస్వరూపము. ఆత్మతత్త్వము. భజగోవిందంలో కూడా ఇదే ఆలోచన ప్రవేశపెట్టబడింది. గోవిందనామంతో – సగుణ ఈశ్వరుని, గురువుని, నిర్గుణ పరబ్రహ్మను కూడా సూచించారు శంకర భగవత్పాదులు.

**భజ గోవిందమ్ –** గోవిందుని భక్తితో స్మరింపుము. భక్తి విషయమై ఆదిశంకరులు ఇలా అంటారు.

**మోక్షసాధనసామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ।**
**స్వస్వరూపానుసంధానం భక్తిరిత్యభిధీయతే॥**

మోక్షసాధనకు భక్తే ముఖ్యమూ, అతి ఉన్నతమైనది. భక్తి అంటే ఏమిటి? స్వస్వరూపాను సంధానమే భక్తి అనబడుతుంది. ఆత్మనిష్ఠలో ఉండటమే అసలైన భక్తి. అద్వైత భక్తే భక్తి పరాకాష్ఠ.

**సంప్రాప్తే సన్నిహితే కాలే, న హి న హి రక్షతి 'డుకృఞ్కరణే' –** మరణకాలము ఆసన్నమయినప్పుడు **డుకృఙ్కరణే** వ్యాకరణ సూత్రాలు, ప్రాపంచిక విద్యలు నిన్ను రక్షించవు. గోవిందుని శరణుకోరడమే శ్రేయస్కరమైన మార్గము.

**అతిభీషణ కటుభాషణ యమకిఙ్కర పటలీ।**
**కృతతాడన పరిపీడన మరణాగమసమయే।**
**ఉమయా సహ మమ చేతసి, యమశాసన నివసన్।**
**శివశఙ్కర శివశఙ్కర హర మే హర దురితం॥**

ఒక శివభక్తుడిలా అంటున్నాడు – మరణానంతరము యమధర్మరాజు తన కింకర పటాలంతో వచ్చి కొట్టుకుంటూ, ఈడ్చుకుంటూ నేను వద్దని వేడుకొన్నా కటువైన మాటలతో నరకానికి తీసుకుపోతాడు. యముడిని కూడా శాసించగల నీవు నా మనస్సులో అమ్మ పార్వతితో సహా ఉండి నా పాపాలను తొలగించు. అందుకని ఆఖరుకు భగవంతుడే శరణు. లౌకికవిద్యలు మనను కాపాడలేవు.

భజగోవిందం 31 శ్లోకాలతో కూడినది. అందులో మొదటి పన్నెండు శ్లోకాలను శంకర భగవత్పాదులు చెప్పారు. వీటిని **ద్వాదశమంజరికా స్తోత్రము** అంటారు. తరువాత పదునాలుగు శ్లోకాలు వారి శిష్యులు ఇదే బాణిలో చెప్పారు. వాటిని **చర్పట పంజరికా స్తోత్రము** అంటారు. పంజరికా అనేది ఒక ఛందస్సు. ఉపసంహారముగా ఐదు శ్లోకాలును మళ్ళీ శంకరుభగవత్పాదులు చెప్పి గ్రంథమును పూర్తిచేశారు.

**సారాంశము - వ్యాకరణ సూత్రాలు, ప్రాపంచిక విద్యలు, నిన్ను రక్షించవు అనే హెచ్చరిక తోపాటు గోవిందనామంతో సగుణ ఈశ్వరుని, గురువుని, నిర్గుణపరబ్రహ్మను కూడా సూచించారు శంకర భగవత్పాదులు.**

***

# స్వామీజీ సూక్తిముక్తావళి

ఒక వ్యక్తిలో ముగ్గురు జీవులు ఉన్నారు.

1. పారమార్థిక జీవుడు- ఒక వ్యక్తిలో ఉండే బింబ చైతన్యం
2. వ్యావహారిక జీవుడు- చిదాభాస 1
3. ప్రాతిభాసిక జీవుడు- చిదాభాస 2

జాగ్రద్ పురుషుని మనస్సునుంచి ఏర్పడిన చిదాభాసను ప్రాతిభాసిక జీవుడు అంటారు. ఆ వ్యక్తి నిద్ర లేవగానే, స్వప్న పురుషుడు లయమయిపోతాడు. అలాగే వ్యావహారిక జీవుడు, ఈ జాగ్రద్ ప్రపంచం కూడా కలే అని తెలుసుకుని, తన పారమార్థిక స్థాయికి ఎదగాలి.

***

**శ్లోకము - 2**

**మూఢ జహీహి ధనాగమతృష్ణాం, కురు సద్బుద్ధిం మనసి వితృష్ణామ్।**
**యల్లభసే నిజకర్మోపాత్తం, విత్తం తేన వినోదయ చిత్తమ్॥**

**మూఢ!** = మూఢుడా!
**(త్వం)** = (నువ్వు)
**ధనాగమతృష్ణామ్** = ధనం ఇంకా ఇంకా రావాలనే అత్యాశను
**జహీహి** = వదిలి వేయుము
**(త్వం)** = (నువ్వు)
**వితృష్ణాం** = అంతూపొంతూ లేని, అతృప్తికరమైన కోరికలు వీడి
**మనసి** = మనస్సును
**సద్బుద్ధిమ్** = ఈశ్వరబుద్ధి(తో)
**కురు** = చేయి(నింపు)
**నిజకర్మోపాత్తమ్** = ధార్మికమైన సంపాదనతో
**తేన యల్లభసే** = నీకు ప్రాప్తించిన ధనంతో
**చిత్తం వినోదయ** = మనసులో ఆనందంగా ఉండు

పదచ్ఛేదమ్- **మూఢ, జహీహి, ధన+ఆగమతృష్ణాం, కురు, సద్బుద్ధిం, మనసి, వితృష్ణామ్। యత్, లభసే, నిజకర్మోపాత్తం, విత్తం, తేన, వినోదయ, చిత్తమ్॥**

అన్వయమ్- **హే మూఢ! (త్వం) ధనాగమతృష్ణాం జహీహి। (త్వం) వితృష్ణాం సద్బుద్ధిం మనసి కురు। నిజకర్మోపాత్తం యత్ విత్తం (త్వం) లభసే, తేన (త్వం) చిత్తం వినోదయ॥**

**తాత్పర్యం-** ఓ మూఢుడా! ధనం ఇంకా ఇంకా తరతరాలకు సరిపడా పోగుచేయాలనే దురాశ వీడుము. అర్థంపర్థంలేని అనంతమైన, అతృప్తికరమైన కోరికలు వీడి ఈశ్వరునిమీదకు దృష్టి మరల్చుము. నీకు ధార్మికంగా లభించిన ధనంతో తృప్తిపడి ఆనందంగా ఉండుము.

మూఢమతే అంటే తెలివి తక్కువవాడని కాదు. ఎదుట ఉన్నది సంస్కృత పండితుడు, సామాన్యుడు కాదు. కాకపోతే దేనికి ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలో

తెలియని అమాయకుడు. దిశానిర్దేశము జరగనివాడు. ప్రాపంచపు పరుగులలో చిక్కుకుని దారి తెలియని బాటసారి. మోక్షగామి కానివాడు. మోక్షగామి లేదా ముముక్షువులలో కూడా మూడు రకాలుంటారు. మంద, మధ్యమ, ఉత్తమ ముముక్షువులు.

**మంద ముముక్షువు–** మోక్షము కావాలి కాని మోక్షము అతనికున్న అనేకానేక లక్ష్యాలలో 3845వది కావచ్చు. 3844 లక్ష్యాల తరువాత ఎక్కడో ఉందా లేదా అన్నట్టు మినుకు మినుకుమంటూ ఉంటుంది.

**మధ్యమ ముముక్షువు –** ఇతనికి కూడా మోక్షము ముఖ్యమైనదే కాని అది ఒకటే కాదు ఇంకా ఇతరమైనవి కూడా ముఖ్యంగా ఉన్నాయి.

**ఉత్తమ ముముక్షువు–** ఇతనికి మోక్షమొక్కటే లక్ష్యము, తదన్యమైనది మరొకటి లేదు.

ఒకసారి రామకృష్ణపరమహంస దగ్గరకు ఒక భక్తుడు వచ్చి నాకు మోక్షం కావాలన్నాడు. దానికి రామకృష్ణ పరమహంసవారు 'సరే నేను గంగా స్నానానికి వెళుతున్నాను, నాతో రా,' అని తీసుకు వెళ్ళారు. గంగలో వారిరువురు మునిగారు. శ్రీ పరమహంస తన చేతితో శిష్యుని తల గట్టిగా వత్తిపట్టి ఉంచారు. శిష్యుని తల నీటిలోనే ఉండేటట్టుగా పైకి రాకుండా వత్తి పట్టారు. దానితో ఆ శిష్యుడు ఊపిరాడక భయంతో తన బలమంతా ఉపయోగించి బయటకు వచ్చాడు. ఆ శిష్యుడు నిష్ఠూరంగా, 'ఇదేమిటి స్వామీ నాకు మోక్షాన్నివ్వమంటే ఇటువంటి పనిచేస్తున్నారు?' అన్నాడు. దానికి వారు, 'నాయనా నువ్వు యిప్పుడు నీ ప్రాణరక్షణకు ఎంతగా తపించావో, మోక్షానికి దీనిని మించిన తపన కావాలి,' అన్నారు.

**మూఢ జహీహి ధనాగమతృష్ణాం –** ఓ మూఢుడా! ధనాగమతృష్ణ వదిలివేయి.

ఓయీ మూర్ఖుడా ధనం యింకా యింకా సంపాదించాలనే పేరాశ వద్దు. ఇప్పుడు లోకంలో తీరు చూస్తే ధనార్జనకోసం నానా పాట్లుపడుతున్నారు. నానా రకాలుగా డబ్బు సంపాదించడమే ప్రధానం అన్నట్టుగా ఉన్నారు. ఇప్పుడు జరుగుతున్న కుంభకోణం చూస్తే ధనమెంత వెర్రిపరుగులు తీయిస్తోందో అర్థమౌతుంది. ధనంకోసం ఏమైనా చేయడానికి సిద్ధమౌతున్నారు.

మనిషిగా మనకుండాల్సిన ప్రాథమిక లక్ష్యం ఆధ్యాత్మిక ఎదుగుదల అని మన శాస్త్రాలు పదే పదే ఘోషిస్తాయి. మనం సాధించే తక్కిన లౌకిక లక్ష్యాలు రెండవశ్రేణికి చెందినవి. జంతువులు కూడా ఆహారాన్ని సంపాదిస్తాయి. వాటి

పిల్లలకు ఆహారం సంపాదించే విషయంలో శిక్షణ కూడా ఇస్తాయి. అందువల్ల ఆహారం సంపాదించటం, ఇల్లు కట్టుకోవటం, కుటుంబాన్ని నడిపించటం, అంతులేని ఐశ్వర్యాన్ని పొందటం– ఇవి మాత్రమే చాలదు, మనిషిగా ఉన్నతిని, ఆంతరస్వేచ్ఛను సాధించాలంటే. ఈ లక్ష్యాలను పొందకూడదని కాదు దీని అర్థం, కాని ఇవి మాత్రమే కాదు, ప్రాథమిక లక్ష్యం వేరే ఉందని గ్రహించాలి.

ఆధ్యాత్మికసాధన మన లక్ష్యాల్లో అన్నిటికన్నా పైన ఉండాలి! కాని మనకు ఈ విషయం తెలియదు కాబట్టి, మనకు శాస్త్రం చెప్పవలసి వస్తున్నది. శాస్త్రం చెప్పి ఊరుకోకుండా, పదే పదే చెప్పాల్సి ఉంటుంది. ఎందుకంటే మనకు ఆధ్యాత్మికసాధన చేయాలని తెలిసినా కూడా, దానికి సమయం వెచ్చించే తీరిక లేక దాన్ని వెనక్కి తోసేస్తూ ఉంటాము.

అయితే ధనసంపాదన చెడ్డదా? ధనం చెడ్డది కాదు. శాస్త్రం కూడా ధనార్జన చేయమంటుంది. కాని దేనికోసం? **ధనం ధర్మార్థం** అంటుంది శాస్త్రం. ధనం సంపాదించి ధర్మకార్యాలు చేయండి. గృహస్థు తప్పనిసరిగా ధనం సంపాదించి ధర్మాచరణం చేయాలి. అంతే కాని మితిమీరిన ధనాశ కుదరదు. ధనం కావాలనే కోరిక తప్పులేదు కాని ఆ కోరిక 1. ధర్మబద్ధంగా 2. హద్దుమీరకుండా 3. బంధించకుండా ఉండాలి.

ఒక ధనికుడు ఒక వింత చాటింపు వేయించాడు. ఎవరు సూర్యాస్తమయం లోపున ఎంత ఎక్కువ దూరం నడవగలిగితే అంతమేరకు తన భూమిని వారికి బహుమతిగా యిస్తానని చెప్పాడు. అనేకమంది పోటీలో పాల్గొని మరి యిక వారి శక్యము కాక మధ్యలోనే నడక ఆపేశారు.

సూర్యాస్తమయమవబోతోంది, ఒక లోభిమాత్రం పది కిలోమీటర్లు పైన నడిచాడు. అతనిలో ఓపిక సన్నగిల్లింది. రొప్పుతున్నాడు. మూర్ఛ వచ్చేలా ఉంది. ప్రాణాలు పోయేలా ఉన్నాయి. అయినా యింకా నడిస్తే యింకా భూమి చేజిక్కించుకోవచ్చు అనే దురాశతో నడిచి నడిచి నేల రాలి పోయాడు. జీవితాన్నే కోల్పోయాడు. ధనాశ యిలాగే ఉంటుంది.

**కురు సద్బుద్ధిం మనసి వితృష్ణామ్।** – మనసును సద్బుద్ధితో నింపు. తృప్తితో ఉండు. మంచి కార్యాలు చేపట్టు.

**యత్ లభసే నిజకర్మోపాత్తం విత్తం తేన వినోదయ చిత్తమ్** – ధర్మబద్ధమైన, నిష్కపటమైన కర్మలు చేసి వాటితో వచ్చే ధనంతో ఆనందంగా, తృప్తిగా ఉండు.

శ్రీనాథుడు కవిసార్వభౌముడు. ఆయన ఎందరో రాజుల మన్ననలు పొంది ధనం బాగా ప్రోగుచేశాడు. తన బావమరిది అయిన బమ్మెరపోతనను కూడా అదే దిశలో ధనం సంపాదించమని సలహా ఇస్తాడు. దానికి బమ్మెరపోతనగారు కవిత్వం నాకూతురు వంటిది, భార్యా బిడ్డల్ని పోషించుకోడానికి ఇటువంటి తప్పుడు పనులు చేయనవసరం లేదని, దానిని రాజులకు అమ్ముకునేకన్నా సర్వజగద్రక్షకుడైన రామునికి అంకితమిస్తానని చెబుతాడు.

**బాలరసాల సాల నవపల్లవ కోమల కావ్యకన్యకన్**
**కూళలకిచ్చి యప్పడుపు కూడు భుజించుటకంటే సత్కవుల్**
**హాలికులైన నేమి? గహనాంతరసీమల కందమూల కౌ**
**ద్దాలికులైన నేమి? నిజదార సుతోదర పోషణార్థమై.**

అని బమ్మెరపోతన శ్రీనాథునితో చెబుతారు.

**సారాంశము – ధనమే పరమావధియని ప్రాకులాడకు, ఒక్క పైసా కూడా మరణం తరువాత నీతో రాదు. ముందు తరాలకు మూటలు కడుతూ జీవితం ముగుస్తుంది. నీ జీవితపరమార్థం నీకు తెలియాలి. నీకు ధార్మికంగా లభించిన ధనంతో తృప్తిపడు. సద్బుద్ధితో, ఆ భగవంతుని ధ్యాసతో వ్యర్థమైన తృష్ణ వీడు.**

* * *

# స్వామీజీ సూక్తిముక్తావళి

ఆరంభదశలో ఉన్న భక్తుడు– భగవంతుడు ఒక వ్యక్తి అంటాడు.
భక్తి పెరిగాక, జగత్తు అంతా ఈశ్వరమయం అంటాడు.
అత్యంత గొప్ప భక్తుడు, భగవంతుడు చైతన్యం అంటాడు.
జ్ఞానీభక్తుడు, ఆ భగవంతుడు, ఆ చైతన్యం నేను అంటాడు.

* * *

**శ్లోకము - 3**

**నారీ స్తనభరనాభీదేశం, దృష్ట్వా మాఽగా మోహావేశమ్।**
**ఏతన్మాంసవసాదివికారం మనసి విచిన్తయ వారంవారమ్॥**

| | |
|---|---|
| **నారీ స్తనభరనాభీదేశం** | = స్త్రీల బరువైన స్తనములు, నాభి ప్రదేశం |
| **దృష్ట్వా (త్వం)** | = చూచి |
| **మోహావేశం మా అగాః** | = నీవు మోహితుడవు కావద్దు |
| **ఏతత్ మాంస వసాది వికారమ్ (ఇతి)** | = ఈ శరీరము రసం, రక్తం, మేదా, అస్థి, మజ్జా, మాంసం, స్నావ అను సప్తధాతువుల వికారం మాత్రమే అని |
| **వారం వారమ్ (త్వం)** | = నీవు పదే పదే |
| **మనసి విచిన్తయ** | = మనసులో గుర్తుకు తెచ్చుకో (విచారణ చేయి) |

పదచ్ఛేదమ్- **నారీస్తనభరనాభీదేశం, దృష్ట్వా, మా, అగాః, మోహావేశమ్। ఏతత్, మాంస, వస,ఆది, వికారం, మనసి, విచిన్తయ, వారం, వారమ్॥**

అన్వయమ్- **నారీస్తనభరనాభీదేశం దృష్ట్వా (త్వం) మోహావేశం మా అగాః। ఏతత్ మాంసవసాదివికారమ్ (ఇతి) వారం వారమ్ (త్వం) మనసి విచిన్తయ॥**

**తాత్పర్యం-** స్త్రీల అంగాంగ దర్శనం చేస్తూ మోహావేశానికి లోనుకాకుము. ఈ శరీరము రసం, రక్తం, మేదా, అస్థి, మజ్జా, మాంసం, స్నావ అనే సప్తధాతువుల మార్పువల్ల ఏర్పడింది అనే విషయం మనసులో పదే పదే జ్ఞాపకం చేసుకొనుము.

**నారీస్తనభరనాభీదేశం, దృష్ట్వా, మా, అగాః, మోహావేశమ్ -** కామం రెండురకాలుగా ఉంటుంది. దేశకాల పరిస్థితులు తెచ్చేకోరికలు మొదటిరకం. వీటిని ఆగంతుకం అంటారు. ఉదా; కంప్యూటర్ గేమ్స్, స్విమ్మింగ్, స్కేటింగ్, బర్డ్ వాచింగ్ ఈ కోరికలు ఒకప్పుడు లేవు. ఇవి కాలంబట్టి వచ్చాయి. రెండో రకం కోరికలు సహజసిద్ధమైనవి. వీటిని స్వాభావికం అని కూడా అంటారు. యౌవనంలో స్త్రీ - పురుష వ్యామోహం సహజమైనది. ఇది ఒక పువ్వుకు, సీతకోకచిలుకకు ఉన్న

స్వభావసిద్ధమైన సంబంధంవంటిది. ఇది ప్రకృతి సిద్ధమైనది. వైదిక జీవనంలో ఈ కోరిక సహజమే అయినా మోతాదు మించరాదు. భర్తకు భార్యమీద, భార్యకు భర్తమీద కోరిక ఉండటం ధార్మికమైనదే. కాని మోతాదు మించితేనే ప్రమాదం.

దీనికి ఆచార్యులు ఒక రహస్యం బయటపెట్టారు. ఈ బాహ్య శరీరసౌందర్యం కేవలం మాంసం, వసవంటి సప్తధాతువుల వికారమే అని పదే పదే ఆలోచించి వాటి ఆకర్షణకు లోను కావద్దు అంటున్నారు.

గోస్వామి తులసీదాస్‌కు భార్యమీద వల్లమాలిన ప్రేమ. భార్యను వదలి ఒక్క క్షణం కూడా ఉండలేడు. ఒకసారి భార్యను వదిలి పొరుగూరు తప్పనిసరి పనిమీద వెళ్ళవలిసి వచ్చింది. భర్తపొరుగూరు వెళ్ళాడని భార్య రత్నావళి యమున అవతల వున్న తన తండ్రిగారి యింటికి వెళ్ళింది.

పని వెంటనే ముగించుకుని ఆ రాత్రికే తులసీదాసు యింటికి తిరిగి వచ్చాడు. కాని ఇంట్లో భార్య లేదు. తండ్రి దగ్గరకు వెళ్ళిందని పొరుగువారివల్ల తెలిసింది. భార్యలేని ఆ యింట్లో తులసీదాస్ ఒక్క క్షణం కూడా ఉండలేక పోయాడు. భార్య పొందుకోరి హుటాహుటిన యమున ఒడ్డుకు చేరుకున్నాడు.

యమునలో వరద నీరు పరవళ్ళు తొక్కుతోంది. ఎవ్వరూ పడవ నడుపటానికి సాహసించటల్లేదు. అదే సమయంలో అతనివైపు ఒక దుంగ కొట్టుకు వస్తోంది. దాన్ని పట్టుకుని కష్టపడి యమునను దాటాడు. మామగారింటికి నడుచుకుంటూ వచ్చాడు. సరిగ్గా అర్ధరాత్రి సమయం. కీచురాళ్ళు భయంకరంగా రొద చేస్తున్నాయి.

భార్య రత్నావళి పైఅంతస్థులో పడుకుని ఉంటుందని తెలుసు. మెట్లు బయటనుంచి లేవు. మెట్లు యింటిలోంచే ఉన్నాయి. తలుపు తడితే బాగుండదు. పైగా ఏ దొంగో అనుకోవచ్చు కూడా.

పదిహేను అడుగుల ఎత్తైన అంతస్థు ఎక్కాలి. ఎలా? **కామాతురాణం న భయం న లజ్జా** అన్నారు. పక్కనే మర్రిచెట్టు ఊడ ఆసరాతో చెట్టుఎక్కి చెట్టు కొమ్మమీదనుంచి పైఅంతస్థులోకి దూకాడు. తలుపు సుతారంగా తట్టి భార్యను పిలిచాడు. రత్నావళి తలుపుతీసి చూస్తే ఎదుట భర్త. పూర్తిగా తడిసి ముద్దయిపోయాడు. నీకోసమే వచ్చాను అన్నాడు కామోద్రేకంతో ఊగిపోతూ. రత్నావళికి భర్త ప్రవర్తన చీదరింపును కలుగచేసింది.

ఇంతటి విపత్కర పరిస్థితిలో కామావేశంతో ప్రాణాలు కూడా లెక్క చేయకుండా వచ్చాడా అని విసుక్కుని, ఇంత పెనుతుఫానులో ఎలా వచ్చాడో

చూద్దామని ఆరా తీస్తే, అతను ఎక్కిన చెట్టు మర్రి చెట్టు కాదు. రావి చెట్టు. రావి చెట్టునుంచి వ్రేలాడుతున్న కొండచిలువను పట్టుకుని చెట్టు పైకి ఎక్కాడు. ఇక యమున దాటింది ఒక చచ్చిన శవాన్ని పట్టుకుని. రత్నావళి కోపం తారాస్థాయికి చేరుకుంది. నామీద ఉన్న ఈ హీనమైన కోరికలో నాలుగవ వంతైనా జగద్రక్షకుడైన శ్రీరామునిమీద ఉంటే ఈ పాటికి మీరు జీవన్ముక్తులయ్యేవారు కదా అంది నిష్ఠూరంగా. గతజన్మలో అతడు యోగభ్రష్టుడు. వెంటనే మోహముద్గర జరిగింది. కామం మటుమాయమయింది. ఆ తరువాత అతను శ్రీరామునికి అత్యంతభక్తుడై **రామచరిత మానస**వంటి అత్యద్భుత గ్రంథానికి కారకుడయ్యాడు.

వేంగి రాజైన రాజరాజ నరేంద్రుడు చిత్రాంగి అనే స్త్రీ లోలత్వంలో పడతాడు. ఆ చిత్రాంగి తనకు కొడుకుతో సమానుడైన సారంగధరుని మోహిస్తుంది. సారంగధరుడు ఆమెకు లొంగడు. అతను లొంగక పోతే సారంగుధరుడు తనను మోహించాడని పుకారు పుట్టిస్తుంది. అది నమ్మిన రాజరాజ నరేంద్రుడు నిరపరాధియైన తన కొడుకు సారంగధరుని కాళ్ళు, చేతులు నరికిస్తాడు. ఆ ప్రదేశాన్ని సారంగధర మెట్ట అంటారు. క్లియోపాత్రా, హెలెన్ ఆఫ్ ట్రాయి ఇలా మనకు చరిత్రలో ఎన్నో కథలున్నాయి. స్త్రీలోలత్వానికి దేశాలు నాశనమైపోయాయి.

పరస్త్రీవ్యామోహంతోను, పరపురుషవ్యామోహంతోను జీవితాలు పాడుచేసుకున్న పురుషులు, స్త్రీలు ఎందరో ఉన్నారు. అటువంటివారిని హెచ్చరిస్తూ, ఆచార్యులు శంకరభగవత్పాదులు దృష్టిని గోవిందునివైపు మళ్ళించి, జీవితాన్ని పండించుకోమంటున్నారు.

**కాయల్గాచె వధూనఖాగ్రములచే గాయంబు, వక్షోజముల్**
**రాయన్రాపడె రొమ్ము, మన్మథక్లేశవిహార విభ్రాంతిచే**
**ప్రాయంబాయెన్, బట్టగట్టెతల, చెప్పన్ రోత సంసారమే**
**జేయంజాల, విరక్తుంచేయగదవే, శ్రీకాళహస్తీశ్వరా!**

శ్రీకాళహస్తీశ్వరా, స్త్రీల గోళ్ళవల్ల నాశరీరం కాయలు కాసింది. వారి రొమ్ముల రాపిడికి నా రొమ్ము రాయిలా మారింది. కామప్రవృత్తిచే నా వయస్సుడిగింది. బట్టతల వచ్చి అసహ్యంగా తయారయ్యాను. సరాగిగా సంసారంలో పడి కొట్టుకుంటున్న నన్ను నువ్వే విరాగి చేసి బంధమునుంచి విముక్తుడిని చేయి స్వామీ అని వాపోతున్నాడు కవి ధూర్జటి.

**సారాంశము – తుచ్ఛమైన శారీరికసుఖానికి జీవితాన్ని పణంగా పెట్టకు. ఈ శరీరము సప్తధాతువుల సముదాయము. ఈ విషయము పదే పదే తలుచుకుని మోహాన్ని వీడు.**

***

# స్వామీజీ సూక్తిముక్తావళి

ఈత కొట్టడం రాని వ్యక్తి స్విమ్మింగ్‌పూల్‌లో మరణించినా మరణించవచ్చు. కాని ఈత వచ్చిన మనిషికి అది క్రీడారంగం అవుతుంది. నీళ్ళలో చాలాసేపు ఆడుకుంటాడు. అలాగే కర్మ స్విమ్మింగ్‌పూల్‌వంటిది. దానంతట అది ఆనందాన్నివ్వదు. దానంతట అది ప్రమాదాన్నివ్వదు. దానిలోకి దిగే ముందు మనకున్న సంసిద్ధతనుబట్టి ఉంటుంది. జ్ఞానికి కర్మ ఒక క్రీడ; అజ్ఞానికి కర్మ ఒక బంధం. అందువల్లనే భగవంతుడు అవతారం ఎత్తినప్పుడు చేసే కర్మలను లీలలు అంటాము. రాక్షససంహారం కూడా లీలే. జ్ఞానికి కూడా ప్రతి ఒక్క చర్యా లీలే. లీల అంటే ఆట.

***

**శ్లోకము - 4**

**నలినీదలగతజలమతితరలం, తద్వజ్జీవితమతిశయచపలమ్।**
**విద్ధి వ్యాధ్యభిమానగ్రస్తం, లోకం శోకహతం చ సమస్తమ్॥**

| | |
|---|---|
| **నలినీదలగతజలమ్** | = తామరాకుమీద నీటి బిందువు |
| **అతితరలమ్ (భవతి)** | = చాలా చంచలంగా ఉంటుంది |
| **తద్వజ్జీవితమతిశయచపలమ్(భవతి)** | = అదే మాదిరిగా జీవితం చాలా చపలంగా ఉంటుంది |
| **సమస్తమ్** | = అంతా |
| **లోకమ్** | = లోకం (లోకమంతా) |
| **వ్యాధి అభిమానగ్రస్తమ్** | = వ్యాధి కష్టాలతో |
| **శోకహతమ్ చ (ఇతి) విద్ధి** | = శోకంతో బాధించబడుతూ ఉందని తెలుసుకో |

**పదచ్ఛేదమ్ -** **నలినీదలగతజలమ్, అతితరలమ్, తద్వత్, జీవితమ్, అతిశయచపలమ్।**
**విద్ధి, వ్యాధి, అభిమానగ్రస్తం, లోకం, శోకహతం,చ, సమస్తమ్॥**

**అన్వయమ్-** **నలినీదలగతజలమ్ అతితరలమ్ (భవతి)। తద్వత్ జీవితమ్ అతిశయచపలం (భవతి)।సమస్తం లోకం వ్యాధ్యభిమానగ్రస్తం శోకహతం చ (ఇతి) విద్ధి॥**

**తాత్పర్యం-** తామరాకుమీద నీటిబొట్టు చాలా చంచలంగా ఉంటుంది. ఎప్పుడు జారి నీటిలో పడిపోతుందో తెలియదు. అలాగే మానవజీవితం అతి చపలమైనది. లోకమంతా వ్యాధి, కష్టం, శోకంతో బాధించబడుతుందని తెలుసుకో.

**నలినీదలగతజలమ్ అతితరలమ్ (భవతి) -** తామరాకుమీద ఉన్న నీటిబిందువు చపలంగా, చంచలంగా ఉంటుంది. ఎప్పుడు నీటిపాలౌతుందో తెలియదు. తామరాకుమీద ఉన్నంతసేపూ ముత్యమా అన్నట్టు మెరిసి మురిసి పోతోంది. ముత్యాన్ని అన్నట్టుగా మిడిసి పడుతోంది. ఇంతలో ఎక్కడ్నించి వచ్చిందో గాలి - నీటి బిందువు జారి నీటిలో పడింది. నామరూపాలు కోల్పోయింది. నీటిబిందువును చూద్దామన్నా ఆ జలాశయంలో కనిపించలేదు.

నీరు తామరాకుమీద ఉన్నంతసేపూ పిల్లగాలికి నాట్యంచేసింది. పెనుగాలికి రెపరెపలాడింది. ఎప్పుడూ భయంతో గజగజ వణికిపోతూ ఉంటుంది. ఎప్పుడు నీటిలో పడిపోతానో అనే భయం, మరణిస్తానేమో అనే భయం.

నీటి బిందువుకు నీటిదృష్టి, బిందువు దృష్టి అని రెండు కోణాలున్నాయి. నీటిదృష్టిలో చూస్తే నీటిబిందువులోనూ, జలాశయంలోనూ నీరుగా ఒకటే ఉంది. నీరులో ఏ మార్పూ లేదు. బిందువు తయారుకాక ముందూ నీరే, బిందువుగానూ నీరే, జలాశయంలో పడి నామరూపాలు కోల్పోయినా నీరే. అందుచేత, నీరుగా దానికి మరణభయం లేదు. అదే నీటిబిందువుగా చూస్తే అశాశ్వతత్వం, అభద్రతా ఉన్నాయి. ఎప్పుడు ఏమౌతుందో తెలియని భయం.

సంసారం ఇలాగే భయంతో, ఆందోళనలతో, ఒడిదుడుకులతో ఉంటుంది. ఒక ఉపనిషత్తులో సంసారం గురించి వింత వర్ణన వస్తుంది. అడవిలో ఒక ఒంటరి బాటసారిని పులి పసిగట్టి తరుముతూ ఉంది. పులి బారినుంచి తప్పించు కోవాలని పరుగుపెడుతున్న అతనికి ఒక బావి కనిపించింది. భయంతో ముందు వెనుక చూడకుండా అందులోకి దూకాడు. నూతి అడుగున కొండచిలువ ఉంది. అది గమనించి వెంటనే అదే నూతిలో వేళ్ళాడుతున్న మఱ్ఱి ఊడలను పట్టుకుని, వాటి సాయంతో క్రింద పడకుండా మధ్యలో వ్రేలాడుతున్నాడు. పైన పులి కాపు కాచుకుని ఉంది. కింద కొండచిలువ పొంచి ఉంది. ఇదీ పరిస్థితి.

అదే మఱ్ఱిచెట్టు చిటారు కొమ్మకున్న తేనెతుట్టె నుంచి తేనె చుక్కచుక్కగా నూతిలో పడుతోంది. అలా పడే చుక్కల్లో ఒక చుక్క యితని ముక్కుమీద పడి కొంచెం నోట్లోకి వచ్చింది. మొత్తం ఆ తేనె చుక్కను నాకాలని నాలుకను బాగా సాగదీసి ముక్కుకొనకు ఉన్న తేనె బొట్టు అందుకోడానికి ప్రయత్నం చేస్తున్నాడు ఆ బాటసారి. సరిగ్గా సంసారం ఇలాగే ఉంటుంది.

**సమస్తం లోకం వ్యాధ్యభిమానగ్రస్తం శోకహతం చ (ఇతి) విద్ధి –** అదే మాదిరిగా మానవ జీవితం అతి చపలమైనది. జీవితం రోగాలతో కూడినది. అభిమానంతో నిండినది. లోకం దుఃఖమిశ్రితమైంది. ప్రతిసుఖం వెనుక దుఃఖం పొంచి ఉంటుంది. అంతా సవ్యంగా ఉన్నంత వరకు నా అంతవాడు లేడని విర్రవీగుతాడు మనిషి. వ్యాధి, కష్టం, శోకం ఇవి భగవంతుని పలకరింపులు. భగవంతుడు తను ఉన్నానని గుర్తుచేస్తూ తన అధిపత్యాన్ని అలా చూపిస్తాడు.

**కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే**
**వారేరీ సిరిమూటకట్టుకొని పోవంజాలిరే భూమిపై**
**బేరైనం గలదే శిఖిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై**
**యీరే కోర్కులు వారలన్ మరిచిరే యిక్కాలమున్ భార్గవా!**
**- వామన చరితం**

బలిచక్రవర్తి దగ్గరకు విష్ణుమూర్తి వామనుడై వచ్చి దానమడిగాడు. గురువైన శుక్రాచార్యులు వచ్చినది ఎవరోకాదు విష్ణువు, నిన్ను వామనరూపంలో సంహరిస్తాడని హెచ్చరించాడు. దానికి గురువైన శుక్రాచార్యునకు బలిచక్రవర్తి ఇచ్చిన సమాధానము ఇది. అనేకమంది రాజులు రాజ్యాలు ఏలారు. వారు వారి సంపద, పరాక్రమంతో గర్వించారు. కాని వారు మరణసమయంలో తమ సంపదను మూట కట్టుకుని పోలేదు. కనీసం వారి పేరు కూడా ఈ లోకంలో మిగల లేదు. సంపద, పరాక్రమం ఇవేవి శాశ్వతం కావు అంటూ చెబుతాడు.

ఒక యోగి ఋణానుబంధంవల్ల కర్మవశాత్తు ఒక ఇంట్లో పుడతాడు. పిల్లవాని జాతకం చూసినవారు ఈ పిల్లవాడు మహాయోగి, యితను ఋణం తీర్చుకోడానికే పుట్టాడు. ఇతని దగ్గరనుంచి ధనం స్వీకరించవద్దు అని సూచన చేశారు. అతని తల్లి దండ్రులు అల్లారుముద్దుగా అతనిని పెంచుతారు. అతని దగ్గరనుండి ధనం మాత్రం గ్రహించకుండా తగు జాగ్రత్త తీసుకుంటున్నారు. అతనికి యుక్త వయస్సు వచ్చింది. తండ్రి రాజుగారి కొలువుకు కొడుకును తీసుకుని వెళ్ళి అతనికి ఏదైనా ఉద్యోగం ఇవ్వమని రాజుగారిని అర్థించాడు. రాజు అతనిని రాత్రిపూట నగర కాపలాదారుగా నియమించాడు. అతని పని ఝాము ఝాముకు లెక్కగా గంటలు కొట్టాలి. అలా గంటలు కొడుతూ మానవాళిని హెచ్చరిస్తూ **జాగ్రదాష్టకం** చెబుతాడు ఈ యోగి. నిద్రపట్టక అవస్థ పడుతున్న రాజుగారు జాగ్రదాష్టకం విన్నాడు. అతనిని మహాయోగిగా గుర్తించి మరుసటి రోజు ఉదయం అతని యింటికి వెళ్ళి పళ్ళెం నిండా బంగారు నాణెలు యిచ్చి సత్కరించాడు. రాజుగారు స్వయంగా తనింటికి వచ్చి కొడుకును సత్కరించడం చూసి, తల్లి మహదానందపడింది. యోగి ఆ పళ్ళెం అందుకుని తల్లి చేతిలో పెట్టాడు. రాజుగారు సత్కారం చేశాడనే ఆనందంలో ఉన్న తల్లి, జాతకకారుల హెచ్చరిక మరచి ఆ పళ్ళెం అందుకుంది. యోగి మరణించి ఋణవిముక్తుడయ్యాడు. అతను చెప్పిన జాగ్రదాష్టకంలో శ్లోకమిది.

**జన్మదుఃఖం జరాదుఃఖం జాయాదుఃఖం పునః పునః।**
**సంసారసాగరం దుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత ॥**

పుట్టడం దుఃఖంతో మొదలౌతుంది. ముసలితనం దుఃఖం, భార్య దుఃఖహేతువు, సంసారసాగరం దుఃఖమయంగా ఉంది. అందువల్ల జాగ్రత్త పడు. దీపముండగానే ఇల్లు చక్కదిద్దికో. తత్త్వవిచారణ చేయి.

భగవద్గీతలో కూడా తామరాకుమీద నీటి బొట్టు ఉదాహరణ వస్తుంది. అక్కడ సందర్భం వేరు. నీటిబొట్టు తామరాకుకు అంటుకోకుండా అసంగంగా ఉంటుంది. అలా సాధకులు అసంగంగా జీవించాలని ఉద్దేశ్యం.

సాధకుడు సంసారంలో ఉంటూ, సంసారాన్ని మిథ్యగా తెలుసుకుని దానినుంచి అసంగంగా ఉండాలి.

**సారాంశము– తామరాకుమీద నీటి బొట్టులాగా జీవితం క్షణభంగురము. మన దేహము చక్కగా ఆరోగ్యంతో ఉన్నప్పుడే జీవితము సరిదిద్దికోవాలి. సంసారము దుఖమయము. దేహం అభిమానం, వ్యాధితో నిండి పోయాక ఏమీ చేయలేము.**

***

# స్వామీజీ సూక్తిముక్తావళి

విష్ణుమూర్తి చేతిలో సుదర్శనచక్రం ఉంటుంది. దర్శనం అంటే జ్ఞానం; సుదర్శనం అంటే సరియైన జ్ఞానం. ఈ సుదర్శన చక్రంతో సంసారాన్ని నాశనం చెయ్యవచ్చు. అజ్ఞానంవల్ల ఏర్పడిన సంసారాన్ని; సంసారంవల్ల ఏర్పడిన పుణ్యాపాపాలను; పుణ్యాపాపాలవల్ల ఏర్పడిన సుఖదుఃఖాలను అన్నిటినీ నాశనం చెయ్యవచ్చు. ఈ సుదర్శన చక్రం కేవలం నాకు చెందిందే కాదు, మీరు కూడా పొందవచ్చు అంటున్నాడు కృష్ణ పరమాత్మ, భగవద్గీతలో.

***

**శ్లోకము - 5**

**యావద్విత్తోపార్జనసక్తః, తావన్నిజపరివారో రక్తః।**
**పశ్చాజ్జీవతి జర్జరదేహే, వార్తాం కోఽపి న పృచ్ఛతి గేహే॥**

**(కశ్చిత్ పురుషః) యావత్** = ధనం సంపాదించి
**విత్తోపార్జనసక్తః (భవతి)** నంత కాలం
**తావన్నిజపరివారః (తస్మిన్) రక్తః (భవతి)** = నిజపరివారం వెంట ఉంటుంది
**పశ్చాత్ జీవతి జర్జర దేహే** = దేహమందుముసలితనం ప్రవేశించి నప్పుడు
**గేహే కః అపి వార్తాం న పృచ్ఛతి** = గృహంలో ఎవరూ ఎలా ఉన్నావని కూడా పలకరించరు

పదచ్ఛేదమ్- **యావత్, విత్తోపార్జనసక్తః, తావత్, నిజపరివారః, రక్తః। పశ్చాత్, జీవతి, జర్జరదేహే, వార్తాం, కః, అపి, న, పృచ్ఛతి, గేహే॥**

అన్వయమ్- **(కశ్చిత్పురుషః) యావత్ విత్తోపార్జనసక్తః భవతి। తావన్నిజపరివారో (తస్మిన్) రక్తః భవతి। పశ్చాత్ జర్జరదేహే జీవతి, గేహే కః అపి వార్తాం న పృచ్ఛతి॥**

**తాత్పర్యం-** ధనసంపాదన ఉన్నంత వరకు నీ వెంట పరివారం అంతా ఉంటారు. తర్వాత ముసలితనంలో సంపాదన ఆగిపోయాక నిన్ను పలకరించే నాథుడు ఎవడూ ఉండడు.

ఉద్యోగం చేస్తూ నాలుగు రాళ్ళు సంపాదించినంత వరకు అందరూ మర్యాదతో మాట్లాడతారు. ఎప్పుడు సంపాదన ఆగిపోయిందో, అప్పుడు ఇంట్లో వారు కూడా నిన్ను పలుకరించరు.

దీనికే **ఉద్యోగానంతరమున చూడవలెనమ్మ ఆ అయ్య సౌభాగ్యముల్** అంటారు. ప్రభుత్వ ఉద్యోగంలో చాలా ఉన్నత పదవులలో ఉన్న వారికీ అనుభవం అవుతూ ఉంటుంది. ఉద్యోగంలో ఉన్నంతకాలం నౌకర్లు, చాకర్లు ఉంటారు. ఆఫీస్‌లోకి వస్తూనే అందరు లేచి వంగి వంగి నమస్కారాలు పెడతారు. పదవీ

విరమణ అయింది. పెన్షను తీసుకోవడంకోసం ఆఫీసుకు వెడితే కనీసం కూర్చోమనేవారు కూడా కనిపించరు. ఇదీ పదవి, డబ్బు మహిమ.

బృహదారణ్యకంలో యాజ్ఞవల్క్య మైత్రేయీల ఉదంతం వస్తుంది. యాజ్ఞవల్క్యకి యిద్దరు భార్యలు. వారు కాత్యాయినీ, మైత్రేయీ. యాజ్ఞవల్క్య వారిరువురుని పిలిచి యిలా అంటాడు. నేను సన్యాసం తీసుకుందామని సంకల్పించాను. అందుకని నా ఆస్తిని మీరు చెరి సగం చేసుకుని సుఖంగా జీవించండి అంటాడు. యాజ్ఞవల్క్య తన ప్రజ్ఞాపాటవాలతో బాగా సంపాదించాడు. ఆస్తి సగం తీసుకోవడానికి కాత్యాయిని సరే అంటుంది. కాని మైత్రేయి తెలివైనది. మైత్రేయి భర్తతో యిలా అంటుంది, 'నాథా! నువ్వు నీ ఆస్తినంతా తృణప్రాయంగా వదలి సన్యాసం తీసుకుంటానని అంటున్నావు కదా! అంటే నీకు అందులో యింకా ఎక్కువ ఆనందం దొరికేదేదో ఉంది. అది నాకు కావాలి,' అంటుంది. నిజంగా మైత్రేయి చాలా తెలివైనది.

అప్పుడు యాజ్ఞవల్క్య ఒక పచ్చినిజం ఆమెకు చెబుతాడు. ఈ ప్రపంచంలో ఎవరు ఏ పనిచేసినా అందులో తనకు ఆనందం ఉంటేనే చేస్తాడు. **న వా అరే మైత్రేయీ! ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి॥**

భర్త భార్యను ప్రేమించినా, భార్య భర్తను ప్రేమించినా వారి స్వార్థంకోసమే ప్రేమిస్తారని పచ్చినిజం బయట పెట్టాడు.

ఆధునిక కాలంలో ఒక ప్రయోగం జరిగింది.

ఒక ఆరడగుల గాజు తొట్టెలో ఒక కోతిని, దాని పిల్లను కూర్చోపెట్టారు. తొట్టెను మూతతో మూసి కోతి, కోతిపిల్ల పారి పోకుండా బందోబస్తు చేశారు. గాజు తొట్టెను గొట్టంద్వారా నీటితో నింపడం  మొదలు పెట్టారు.

కొంతసేపటికి నీటిమట్టం కోతి ముక్కుదాక వచ్చింది. అప్పుడు కోతి తన పిల్లను ఎత్తి పట్టుకుంది, అది చనిపోకుండా. యింకా నీరు నిండడం మొదలైంది. ఆ సమయంలో ఇంక కోతి ప్రాణంమీదకే వచ్చేలా ఉంది. కోతి ఆ పిల్లను క్రింద పారేసి దానిమీద నుంచుని తన ప్రాణం కాపాడుకుంది. ఇదే **ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి** అంటే.

మరొక విషయం ఇక్కడి బంధాలన్నీ డబ్బుచుట్టూ తిరుగుతూ ఉంటాయి. డబ్బుంటే బెల్లం చుట్టూ ఈగల్లాగా జనం మూగుతారు. డబ్బు లేదని తెలిస్తే నీ సొంతవారే నిన్ను పట్టించుకోరు. ఇది లోకం తీరు. **డబ్బు నిన్ను ఆదుకోదు.**

**బంధువులు నిన్ను ఆదుకోరు. భగవంతుడొక్కడే నిన్ను ఆదుకునేది.** ఆ భగవంతుణ్ణి శరణువేడు.

**ఋణానుబన్ధరూపేణ పశుపత్నిసుతాలయాః।**
**ఋణక్షయే క్షయం యాన్తి తత్ర కా పరివేదనా॥**

గతజన్మల ఋణమే పశువులు, పుత్రులు, భార్య, స్నేహితులు, బంధువులు. ఋణం తీరిన ఉత్తరక్షణంలో వారు ఉండరు. దీని గురించి చింత ఎందుకు! ఎవ్వరూ లేరంటే ఏకాకిగా మిగిలాం అని విచారించక ఒక విధంగా ఋణవిముక్తి అయినట్టే అని భావించు.

**ఆలున్ బిడ్డలు తల్లిదండ్రులు ధనంబంచు న్మహాబంధనం**
**బేలా నామెడ గట్టినాడవిక నిన్నే వేళంజింతింతు,**
**నిర్మూలంబైన మనంబులో నెగడు దుర్మోహాబ్ధిలో గ్రుంకి యీ**
**శీలామాలపుఁజింతనెట్లుడిపెదో శ్రీకాళహస్తీశ్వరా!**

శ్రీకాళహస్తీశ్వరా! ఆలు,బిడ్డలు,తల్లి, తండ్రి అనెడి మోహపాశం వలతో కట్టబడిన నేను నీ నామస్మరణ కూడా విస్మరించాను. కాబట్టి ఈ బంధాలు కలిగించిన నీవే వీటినుండి విడగొట్టాలి. అట్టి మోహపాశములు పోగొట్టి నీ స్వరూపధ్యానము నాకందేలా చేయి.

**సారాంశము– సంపాదన ఉన్నంత వరకే మర్యాద. సంపాదన ఆగిపోతే ఎవరూ పట్టించుకోరు. ఈ శ్లోకం ఉద్దేశ్యం ఆఖరిశ్వాస వరకు సంపాదించుకోమని కాదు. నీదగ్గర దబ్బున్నప్పుడు సద్వినియోగము చేసుకో. మంచి కార్యాలు తలపెట్టు.**

***

## శ్లోకము - 6

**యావత్పవనో నివసతి దేహే, తావత్పృచ్ఛతి కుశలం గేహే।**
**గతవతి వాయౌ దేహాపాయే, భార్యా బిభ్యతి తస్మిన్కాయే॥**

| | |
|---|---|
| **యావత్ పవనః** | = ఎంతవరకు వాయువు |
| **దేహే నివసతి** | = దేహములో సంచరిస్తోందో |
| **తావత్ గేహే** | = అంతవరకు నీ గృహములో |
| **కుశలం** | = నీ బాగోగులు |
| **పృచ్ఛతి** | = అడుగుతారు |
| **దేహాపాయే** | = దేహపతనానంతరము |
| **వాయౌ గతవతి** | = వాయు సంచారం నిలిచిపోయాక |
| **తస్మిన్ కాయే** | = నీ శరీరం చూచి |
| **భార్యా** | = నీ భార్య కూడా |
| **బిభ్యతి** | = నీ శవం దగ్గరకు రావటానికి భయపడుతుంది.(జంకుతుంది) |

పదచ్ఛేదమ్- **యావత్, పవనః,నివసతి,దేహే,తావత్,పృచ్ఛతి,కుశలం,గేహే। గతవతి,వాయౌ,దేహాపాయే,భార్యా,బిభ్యతి,తస్మిన్,కాయే॥**

అన్వయమ్- **యావత్ పవనః దేహే నివసతి తావత్ గేహే కుశలం పృచ్ఛతి. దేహాపాయే వాయౌ గతవతి (సతి) భార్యా తస్మిన్ కాయే బిభ్యతి.**

**తాత్పర్యం-** దేహంలో ఊపిరాడుతున్నంత కాలం ఇంట్లో నీ కుశలం అడుగుతారు. ఊపిరి పోయిన తరువాత నీ ప్రియాతి ప్రియమైన భార్య కూడ నీ శవాన్ని చూసి జడుసుకుంటుంది.

**బిభ్యతి** అనేది బహువచనంలో ఉంది. అంటే అనేక భార్యలనా? కాదు. **భార్యాః** అంటే అతనిమీద ఆధారపడిన వ్యక్తులు. అతనిమీద ఆధారపడిన వ్యక్తులు పిల్లలు కావచ్చు, వృద్ధులైన తల్లిదండ్రులు కావచ్చు. నౌకర్లు కావచ్చు. ఆధారపడినవారందరినీ భార్యగా తీసుకోవచ్చు.

దేహంలో వాయుసంచారం జరిగేటంతవరకు ఇంట్లో కుశలం అడుగుతారు. ప్రాణం పోతే నీకత్యంత ప్రియమైన భార్య కూడా నీ దేహాన్ని(శవాన్ని) చూసి భయపడుతుంది.

ఒకతనికి నలుగురు భార్యలు ఉండేవారు. అతను మొదటి భార్యను అసలు పట్టించుకునేవాడు కాదు. అతను రెండవ భార్యను కొంచెము పట్టించుకునే వాడు. మూడవ భార్యంటే మురిపం. నాలుగవ భార్యంటే వల్లమాలిన ప్రేమ. ఆయనకు అవసాన దశ వచ్చింది. నలుగురు భార్యలను పిలిచి, 'నేను మరణించే సమయం దగ్గర పడింది, మీరెవరైనా నాతో వస్తారా?' అడిగాడు.

నాలుగవ భార్య, 'నన్ను క్షమించు నేను నీతో రాలేను,' అంది.

మూడవ భార్య, 'నీ మరణానంతరం నేను నాకీడైన జోడీ వెతుక్కుని పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతాను,' అంది.

రెండవ భార్య, 'నిన్ను స్మశానంవరకు సాగనంపుతాను. ఆ తరువాత నీ దారి నీది, నాదారి నాది,' అంది.

మొదటి భార్య, 'నువ్వు నాకెప్పుడూ ప్రియమే, నిన్ను విడిచి నేనుండను,' అంది.

నాలుగవ భార్య– స్థూలశరీరము– అది దహనమై పోతుంది. జీవితో మరణం తరువాత రాదు.

మూడవ భార్య– సంపద, ఆస్తి – సంపద,ఆస్తి కూడా రాదు సరి కదా మరొకరి సొంతం అవుతుంది. మనిషికి జీవించినంత కాలం సంపద, ఆస్తి గురించిన వెంపర్లాట ఇంతా అంతా కాదు.

రెండవభార్య – బంధువులు, స్నేహితులు –వీరు స్మశానం వరుకు వస్తారు.

మొదటి భార్య – ఆత్మ – అంతటా ఆత్మ సన్నిధిలోనే జరుగుతుంది గనుక, ఎవ్వరూ దీన్ని విడిచే ప్రసక్తే లేదు. కాని మనం జీవించి ఉన్నంత కాలం ఆత్మచింతనే మనకుండదు.

ఇప్పుడు తల్లిదండ్రులు చనిపోతే పిల్లలు విదేశాలనుంచి రానవసరం లేకుండా, ఆన్‌లైన్ సదుపాయంకూడా ఉంది. అసలే మాతృభూమిని మర్చిపోయి, డబ్బుచుట్టూ పరుగులు పెట్టే, మనవాళ్ళు ఈ కాలంలో ఇటువంటి మహాసదుపాయంతో కనీసం ఆఖరుకు దహనక్రియకు కూడా రారు.

తండ్రి శవాన్ని శ్మశానంలో దహనం చేసే ముందు మూడుచోట్ల కాడి దింపి కొడుకును నాన్నా అని గట్టిగా అరవమంటారు. అలా విదేశంనుంచి దహన క్రియలకోసం వచ్చిన కొడుకు ఆవేశంగా నాన్నా నాన్నా గట్టిగా అరుస్తున్నాడు. వెనుకనుంచి అతని భార్య అంత గట్టిగా అరవకు, ముసలాడు లేచినా లేస్తాడు. అసలే సెలవు దొరకటం లేదు అంటోంది. ఇదీ పరిస్థితి.

మరికొన్ని చోట్ల శవాన్ని స్మశానానికి తీసుకు వెళ్ళనివ్వరు. ఆస్తి విషయం తెగందే శవం లేపడానికి వీలులేదు అని కుటుంబీకులే పేచీ పెట్టుకుంటారు. ఆ చనిపోయిన ఆసామి బ్రతికుండగా వారికోసం తన జీవితమంతా తన సుఖాన్ని వారికి ధారపోసి సంపాదించాడు. చనిపోయాక శవానికి జరిగే మర్యాద ఇదీ. **భార్యా బిభ్యతి తస్మిన్ కాయే.**

**అందరూ ఇలా ఉంటారని కాదు. చాలా మంచివాళ్ళు ఎంతోమంది ఉన్నారు. వారందరికి నా హృదయపూర్వక నమస్సుమాంజలులు.** కాని ఇలాగ కూడా జరుగుతోందని అనుభవంలోంచే చెపుతున్నాను.

**మాతా నాస్తి పితా నాస్తి నాస్తి బన్ధుః సహోదరః।**
**అర్థం నాస్తి గృహం నాస్తి తస్మాత్ జాగ్రత జాగ్రత॥**

తల్లి, తండ్రి, బంధువులు, సహోదరులు, డబ్బు, ఇల్లు ఇవేవి నీకు ఆత్యంతిక ఆనందాన్నిచ్చేవి కావు. వీటిలో ఏదీ శాశ్వతమైనది కాదు. నాలో ఏదో వెలితి ఉంది అని ఆ వెలితి ఇదుంటే తీరుతుందనే భ్రాంతితో మనిషి జీవితమంతా వెంపర్లాడతాడు. తానే పూర్ణుడను, ఆనందస్వరూపుడను అని గ్రహించకపోవడంవల్ల ఈ సమస్య వస్తోంది.

**సారాంశము- ప్రాణం ఉన్నంత వరుకు ఇంట్లో మనుష్యులు కుశలం అడుగుతారు. ప్రాణం పోయిన వెంటనే ఇంటి బయట నేలమీద పారేస్తారు. ఇంత సంపాదించాడు. ఈ ఇల్లు అతను కట్టినదే అని చూడరు. అతనిమీద ఆధారపడిన వారంతా శవయాత్ర తొందరగా చేయిద్దామనే యోచనలో ఉంటారు. అంతకు ముందున్న ప్రేమ అనురాగాలు ఎక్కడికి పోయాయి? దేహమే నీవు అని బ్రతికావు. ఏదీ నీ దేహానికి మర్యాద?**

***

**శ్లోకము - 7**

**బాలస్తావత్క్రీడాసక్తః, తరుణస్తావత్తరుణీసక్తః।**
**వృద్ధస్తావచ్చిన్తాసక్తః, పరమే బ్రహ్మణి కోఽపి న సక్తః॥**

**బాలస్తావత్** = బాల్యమంతా
**క్రీడాసక్తః** = క్రీడలలో గడిచి పోతుంది
**తరుణస్తావత్** = యుక్తవయస్సు అంతా
**తరుణీసక్తః** = స్త్రీల వెంట లేదా సంసారలంపటంలో గడిచిపోతుంది
**వృద్ధస్తావత్** = వృద్ధాప్యం అంతా చింతలలో గడిచి పోతుంది
**పరమే బ్రహ్మణి** = పరమాత్మగురించి
**కోఽపి న సక్తః** = చింత ఎవరికీ లేదు

**పదచ్ఛేదమ్- బాలః, తావత్, క్రీడాసక్తః, తరుణః, తావత్, తరుణీసక్తః।**
**వృద్ధః, తావత్, చిన్తాసక్తః, పరమే, బ్రహ్మణి, కః, అపి, న,సక్తః॥**

**అన్వయమ్- (యావత్) బాలః (సన్ అస్తి) తావత్ క్రీడాసక్తః (భవతి)।**
**తరుణః తావత్ తరుణీసక్తః (భవతి)। వృద్ధః తావత్ చింతాసక్తః**
**(భవతి)। పరమే బ్రహ్మణి కః అపి సక్తః న (భవతి)॥**

**తాత్పర్యం-** బాల్యమంతా ఆటపాటలతో గడిచి పోతుంది. యౌవనం ఆడపిల్లల ధ్యాసతో, వృద్ధాప్యం చింతలతో గడిచి పోతోంది. పరమమైన బ్రహ్మచింతన ఎవరికీ (ఎప్పటికీ) లేదు!

బాల్యం ఆటపాటలతో, యౌవనం ఆడపిల్లల ధ్యాసతో, వృద్ధాప్యం చింతలతో గడిచి పోయింది. పరమమైన బ్రహ్మను తెలుసు కునేదెప్పుడు?

శరీరం షడ్వికారాలకు లోనవుతుంది. **అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి.**

**అస్తి -** పిండరూపంలో తల్లి గర్భంలో ఉంటుంది, **జాయతే** - ఒక రోజున పుడుతుంది, **వర్ధతే -** పెరుగుతూ వస్తుంది, **విపరిణమతే -** అనేకమార్పులు శరీరపరంగా, మానసికంగా వస్తాయి (మగవారైతే మీసాలు గడ్డాలు వస్తాయి, గొంతులో మార్పువస్తుంది, మనస్సు పరిణతి చెందుతుంది), **అపక్షీయతే -** ఆ తరువాత శరీరం శుష్కించడం మొదలౌతుంది, చర్మం ముడతలు పడుతుంది,

పటుత్వం తగ్గుతుంది, **వినశ్యతి –** ఒక రోజున శరీరం పడిపోతుంది. ధనవంతుడైనా, బీదవాడైనా, రాజైనా, సేవకుడైనా, పండితుడైనా, పామరుడైనా ఇదే కథ. సశరీరంగా ఎవ్వరూ నిలిచిపోయేవారు లేరు. అంతా మూన్నాళ్ళ ముచ్చట మాత్రమే. దానికీ మిడిసిపాటు ఎందుకు?

బాల్యంలో గీత చదివితే తోటి పిల్లలు ఆట పట్టిస్తారు అని పిల్లలు అనుకుంటారు. గీతను బాల్యంనుంచే అందుకుంటే వారు జీవితంలో ఎంతో ఉన్నతిని పొందగలరు. బాలగోకులం వంటి సంస్థలు ఈరోజు పిల్లలకు ఆటపాటలతో పాటు గీత నేర్పే ఉద్యమంలో ఎంతో ముందుకు వెళ్తున్నారు. అటువంటి సంస్థలు ఎంతో అవసరం. **ఆ సంస్థలకు నా హృదయపూర్వక నమస్సుమాంజలులు.** దీనివల్ల పిల్లలే కాదు సమాజం కూడా బాగుపడుతుంది. గీత ఎలా జీవించాలో నేర్పుతుంది.

ఆధ్యాత్మిక విద్య నేర్చుకోడానికి ఇంకా సమయం ఉంది అంటూ కాలయాపన చేస్తారు. అలా చేయడంవల్ల వారు ఒక జీవితకాలం వృథా చేసుకుంటున్నారు. ఆధ్యాత్మిక విద్య అనగానే సంసారం వదలి సన్యాసం స్వీకరించడమని చాలా మంది అభిప్రాయం. లేదా పని పాటల్లేని వారికో కాలక్షేపం అని మరికొందరి ఉద్దేశ్యం. అధ్యాత్మిక విద్యవల్ల మీరు చేసే పనిని సమర్థవంతంగా చేయగలుగుతారు. మీ ఆలోచనా విధానంలో మంచిమార్పు వస్తుంది.

లౌకిక సుఖాల్లో మునిగి తేలే వారికి ఆధ్యాత్మికవిద్య సొక్కదు. కాని వారికి గాని ఆధ్యాత్మికవిద్య వంట పట్టిందా వారనుభవించే సుఖాలను మించిన ఆనందం ఇందులో ఉందని అనతి కాలంలోనే గ్రహిస్తారు.

జైమిని శిష్యుడైన బృహస్పతి చార్వాక సిద్ధాంతాన్ని ప్రచారం చేశాడు. అసురులకు ఆత్మవిద్య అందకూడదని ఇలా చేశాడంటారు. అసురులెవరు? **అసుషు రమంతే అసురాః –** భోగభాగ్యాలలో రమించే వారిని అసురులంటారు. భోగమే పరమావధిగా ఎంచుకున్నవారంతా అసురులే! అటువంటి వారే చార్వాక సిద్ధాంతాన్ని నమ్మే చార్వాకులు.

చార్వాకులు వేదాన్ని, శాస్త్రాన్ని నమ్మరు. స్వర్గమూ లేదు. నరకమూ లేదు అంటారు. దేహం ఇచ్చిందే సుఖపడటానికి. సుఖపడకుండా దేముడూ రాముడూ అంటూ కాలం పాడుచేసుకోవద్దు అంటారు వీరు.

**యావత్ జీవేత్ సుఖం జీవేత్। ఋణం కృత్వా ఘృతం పిబేత్॥**

జీవించినంత కాలం సుఖంగా బ్రతుకు, అప్పుచేసి నేతివంటలు చేసుకుని అనుభవించు. ఇదీ వీరి పద్ధతి, ఇదీ వీరి సిద్ధాంతం. అప్పుచేస్తే తీర్చడం ఎలా అంటే, అప్పిచ్చిన వాడి కర్మ. నీ పని సుఖించడమే. అప్పుతీరకుండా చనిపోతే ఎలా, పాపం రాదా అంటే?

పాపమూ లేదు, పుణ్యమూ లేదు. పునర్జన్మ అసలే లేదు. అవి ఏ వ్యాపకమూ లేని వారు పుట్టించిన పనికి మాలిన మాటలు. వాటిని ఖాతరు చేయద్దు అంటాడు చార్వాకుడు. దేవుణ్ణి ప్రత్యక్షంగా చూపిస్తే నమ్ముతానంటాడు. **భస్మీభూతస్య దేహస్య పునరాగమనం కుతః?**

మరణానంతరం స్మశానంలో దేహం భస్మీభూతం అవడం నీ కళ్ళతో నువ్వు స్వయంగా చూసావు. అది మళ్ళీ రావటమేమిటి? అంతా అబద్ధం అంటాడు. చాలామంది అలా చార్వాకులలాగ జీవించేస్తారు.

మనకున్న ఆయుష్షు అతి స్వల్పమైనది. ఈ కాలాన్ని బాల్యము, యౌవనం, వృద్ధాప్యము అని విభజిస్తే– బాల్యంలో తెలిసీ తెలియని వయస్సులో, రోజులు ఆటపాటలతో అమాయకంగా గడిచిపోతాయి. యవ్వనంలో ప్రకృతి జన్యమైన కోరికలమీద ఆసక్తి. పురుషులకు స్త్రీలమీద, స్త్రీలకు పురుషులమీద ఆకర్షణ, స్వాభావికంగా ఉంటుంది.

దీనివల్ల కొంతమంది చదువు సంధ్యలు కూడా కుంటుబడతాయి. యవ్వనంలో ప్రకృతిజన్యమైన కోరికల తాకిడినుంచి ప్రయత్నపూర్వకంగా అభ్యాసంతో బయటపడి శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడైన గురువును ఆశ్రయించి శాస్త్రపఠనం చేయాలి. ఎందుకంటే శాస్త్రం జీవన్ముక్తి ప్రసాదిస్తుంది. జీవించి ఉండగానే ఆనందాన్ని అనుక్షణం అందుకోవడం నేర్పుతుంది.

ఇక వృద్ధాప్యం రెండవ బాల్యావస్థ. కూర్చోడం ఒక ప్రాజెక్టు, నుంచోడం మరొక ప్రాజక్టు. శాస్త్రాన్ని గురువుని ఆశ్రయించి శ్రవణం, మననం, నిదిధ్యాసనం చేసిన వ్యక్తి మానసికంగా ఎవరిమీదా ఆధారపడడు. భౌతికంగా సహాయం అవసరమయితే అది తప్పదు. వేదాంతాన్ని అర్థం చేసుకున్న వ్యక్తి కుటుంబవ్యక్తులను పీడించడు. అతను కూడా ఆనందంగా ఉంటాడు.

**రోసీ రోయదు కామినీజనుల తారుణ్యోరు సౌఖ్యంబులన్,**
**పాసీ పాయదు పుత్రమిత్ర జన సంపద్భ్రాంతి, వాంఛాలతల్**
**కోసీ కోయదు నామనం బకట! నీకున్ ప్రీతిగా సత్క్రియల్**
**చేసీ చేయదు, దీని త్రుళ్ళణచవే శ్రీకాళహస్తీశ్వరా!**

శ్రీకాళహస్తీశ్వరా! ఈ చంచలమైన బుద్ధిని మాకెందుకిచ్చావయా! నీమీద క్షణము నిలచిన బుద్ధి మళ్ళీ మళ్ళీ సుఖభోగాలకు పరుగులు తీస్తోంది. స్త్రీలతో యవ్వనసుఖములందూ, పుత్రులు, స్నేహితులు, ధనముపట్ల భ్రాంతి తొలగినట్లే తొలగి మళ్ళీ కలుగుతోంది. కోర్కెలనే తీగలను కోసినా మళ్ళీ పుడుతున్నాయి. అలా కాకుండా నిశ్చలమైన బుద్ధిని మాలో ప్రచోదనము చేయి స్వామీ!

బాల్యంలో క్రీడలమీద ఆసక్తి, తరుణ వయస్సులో స్త్రీమీద ఆసక్తి, వృద్ధాప్యంలో చింతలతో మునిగిపోతే, బ్రహ్మగురించి ఆలోచించే తీరిక ఎవరికి ఉంది? మరీ చిన్నప్పుడు, ఆధ్యాత్మిక చింతన ఇప్పుడేనా, తరువాత చేయవచ్చులే అనుకుంటాము. కాని వృద్ధాప్యంలోకి అడుగుపెట్టేసరికి ప్రాపంచిక చింతలలో కూరుకుపోతాము. అంతేకాక ఇంద్రియాలు కూడా బలహీనమైపోతాయి. అలా జీవితాంతం ఏదో ఒక హడావిడిలో మునిగితేలుతూ మన అంతిమ గమ్యాన్ని మర్చిపోతుంటాము. ఈ కారణంవల్లనే మన శాస్త్రం ఇన్ని పండుగలనూ, వ్రతాలనూ ఏర్పరచింది. దీనిద్వారా మనలను నిరంతరం హెచ్చరిస్తూనే ఉంటుంది. 'నీ అంతిమ లక్ష్యం ఆధ్యాత్మికతనే సుమా,' అంటూ భగవత్పాదులు గుర్తు చేస్తున్నారు.

**సారాంశము – బాల్యం ఆడుతూ పాడుతూ గడిచింది. యుక్తవయసు స్త్రీ వ్యామోహముతో గడిచింది. ముసలితనము వెంపర్లాటతో అతి దుఖముతో గడుస్తుంది. భగవంతుని చింతన మాత్రము లేదు. జీవితం చరమాంకానికి వచ్చింది ఇప్పటి కన్నా మేల్కొని భగవంతుని ధ్యాసలో ఉండాలి.**

***

**శ్లోకము - 8**

**కా తే కాన్తా? కస్తే పుత్రః? సంసారోఽయమతీవ విచిత్రః।**
**కస్య త్వం? కః కుత ఆయాతః? తత్త్వం చిన్తయ తదిహ భ్రాతః॥**

**హే భ్రాతః!** = ఓ తమ్ముడా!
**తే కాన్తా కా?** = నీ భార్య ఎవరు?
**తే పుత్రః కః?** = నీ కొడుకెవరు?
**త్వం కస్య అసి?** = నీవెవరివాడవు?
**(త్వం) కః?** = నీవెవరవు?
**త్వం కుతః ఆయాతః?** = నీవెక్కడినుండి వచ్చావు?
**అయం సంసారః అతీవ విచిత్రః** = ఈ సంసారము అతి విచిత్రమైనది
**తత్ తత్త్వమ్ (త్వం) ఇహ చింతయ** = ఈ విధంగా నీవు తత్త్వచింతన చెయ్యి

పదచ్ఛేదమ్- **కా, తే, కాన్తా?, కః, తే, పుత్రః?, సంసారః, అయమ్, అతీవ, విచిత్రః। కస్య, త్వం?,కః? కుతః, ఆయాతః? తత్త్వం, చిన్తయ, తత్, ఇహ, భ్రాతః॥**

**అన్వయమ్- (హే) భ్రాతః! తే కాన్తా కా? తే పుత్రః కః? అయం సంసారః అతీవ విచిత్రః (అస్తి)। త్వం కస్య అసి? (త్వం) కః? త్వం కుతః ఆయాతః? తత్ తత్త్వమ్ (త్వం) ఇహ చింతయ।**

**తాత్పర్యం-** ఓ తమ్ముడా! ఎవరు నీ భార్య? నీ పుత్రుడెవరు? నీవెవరివాడవు? నీవెవరవు? నీవెక్కడనుంచి వచ్చావు? ఈ సంసారము అతి విచిత్రమైనది. ఈ విధమైన తత్త్వవిచారణ చెయ్యి.

భార్య - ఏ జన్మలో భార్య? ఎన్ని జన్మలు గడిచాయి? ఎవరయ్యా నీ భార్య? నీ పుత్రుడెవరు? ఈ సంసారం అతి విచిత్రమైనది. నువ్వు ఎక్కడ్నించి వచ్చావు, తిరిగి ఎక్కడకు పోతున్నావు? తమ్ముడూ నీ నిజస్వరూపం గురించి చింతన చేయి. కాంత అంటే ఆకర్షించేది. అయస్కాంతము- ఇనుము వైపు ఆకర్షించేది. మనలను లోకంవైపు లాగేవన్నీ కాంతలే.

అభిమన్యుని మరణానంతరం అర్జునుడు చాలా దుఃఖంలో పడతాడు. ఎలాగైనా అభిమన్యుణ్ణి బ్రతికించమని శ్రీకృష్ణుడిని వేడుకుంటాడు. నేను బ్రతికించలేను కాని చూపిస్తానని అభిమన్యుడున్న లోకానికి అర్జునుణ్ణి

తీసుకువెళతాడు శ్రీకృష్ణుడు. అభిమన్యుడు అక్కడ సింహాసనంమీద కూర్చుని రాజ్యమేలుతుంటాడు.

అర్జునుడు కొడుకుతో ఎంతో ప్రేమగా నాతో రా నాయనా అని పిలుస్తాడు. అభిమన్యుడు అర్జునుడు ఎవరో గుర్తుపట్టడు. నువ్వు ఎవరు? నీతో నేనెందుకు రావాలి? అని ప్రశ్న వేస్తాడు. దానితో అర్జునుని మనసు విరిగిపోతుంది. బంధము అనే మోహంనుంచి బయటపడతాడు.

తల్లి, తండ్రి, కొడుకు, కూతురు, గురువు, శిష్యుడు ఇవన్నీ పాత్రలే. శరీరం పతనంతోనే ఈ పాత్రల పని అయిపోతుంది. అజ్ఞానంవల్ల అవే సత్యమన్నట్టుగా ప్రవర్తిస్తూంటాము.

జీవుడు సనాతనుడు. తల్లిగర్భంనుంచి వచ్చినట్టుగా కన్పిస్తున్నాడు. ఈ జన్మలో తల్లి ఈ శరీరము అనే తాత్కాలిక యింటికి ఆగంతుక కారణమైంది. అనంతంగా మనకు అనేక జన్మలలో అనేక మంది తలిదండ్రులున్నారు. ఎవ్వరూ శాశ్వతము కాదు. ఒక్క గోవిందునితో సంబంధము మాత్రమే శాశ్వతమైనది. మిగతావన్నీ పాత్రపోషణే, అంతా మిథ్యా రూపాలే.

ఒక ఊళ్ళో ఒక చాకలివాడుండేవాడు. అతను రోజూ తన బట్టల మూటను గాడిదమీద వేసుకుని రేవు దగ్గరకు తీసుకు వెళ్ళి, గాడిదను రాటకు కట్టి, బట్టలు ఉతికి, బట్టలు అన్నీ ఆరాక మళ్ళీ అవన్నీ మూటకట్టి, గాడిదను విప్పి, మూటను గాడిదమీద వేసి తన ఇంటికి తీసుకు వెళ్ళేవాడు.

ఒక రోజు యథావిధిగా తను మూటకట్టి గాడిదమీద వేసి రేవుకు వచ్చాడు. గాడిదను రాటకు కడదామంటే గాడిదను కట్టే త్రాడు మర్చిపోయాడు. ఎలా? తను బట్టలుతికి వచ్చేలోపు గాడిద ఎటో వెళ్ళిపోవచ్చు. దిగులు పట్టుకుంది చాకలికి. అక్కడ ఉన్న స్వామీజీ అతనిని చూసి విషయం తెలుసుకున్నారు.

అతనికో చిట్కా చెప్పారు. అదేమిటంటే చాకలి రోజూ త్రాడుంటే ఎలా గాడిదను కడతాడో అలాగే కట్టినట్టు నటించమన్నాడు. చాకలి తూచా తప్పకుండా అలాగే చేష్టలు చేస్తూ, శబ్దాలు చేస్తూ, గాడిదను కట్టినట్టు నటించి, దానిదగ్గర గడ్డివేసి తను రేవులోకి వెళ్ళి బట్టలు ఉతికి, అవి ఆరాక మళ్ళీ మూట కట్టి గాడిద మీద వేద్దామని వచ్చాడు. కూర్చున్న గాడిద లేవమంటే ఎంతకీ లేవదు!! అతనికి కంగారు పుట్టి స్వామీజీ దగ్గరకు పోయి అడిగాడు.

స్వామీజీ అతనితో ఇలా అన్నారు. 'గాడిదను కట్టావుగా, ఇప్పుడు విప్పకుండా అది ఎలా వస్తుంది? అందుకని ఇప్పుడు విప్పినట్టుగా నటించు,' అన్నారు. చాకలి అతను త్రాడు విప్పేటప్పుడు ఏ ఏ చేష్టలు, శబ్దాలు చేస్తాడో అవన్నీ చేస్తూ కట్టు విప్పినట్టుగా నటించాడు. గాడిద టక్కున లేచింది.

నవ్వొస్తోందా? సరిగ్గా మన పరిస్థితీ ఇంతే!! మనం లేని బంధాలు పెనవేసుకుని బందీలమౌతున్నాం. మన జీవితంలో తండ్రిగా, కొడుకుగా, స్నేహితుడుగా, గురువుగా, శిష్యుడుగా ఇలా అనేకరకాలుగా వ్యవహరిస్తూంటాం!! ఇవన్నీ మనం ధరించే పాత్రలే, అవి మన స్వరూపం కాదు. పాత్రపోషణ సక్రమంగా, సజావుగా చేయాలి కానీ పాత్రే నేను అనుకుంటే, ఆ గాడిద పరిస్థితే మనకి కూడా!! బంధాలు ఉండవచ్చు కాని బందీలుగా జీవించ కూడదు. నిత్యస్వాతంత్ర్యం కావాలంటే అవన్నీ కేవలం పాత్రలే అని తెలుసుకోవాలి. దేహమే మనం కానప్పుడు, ఆ దేహం వహించే పాత్రలు మనమెలా అవుతాము? మనం నిజానికి సచ్చిదానంద పరమాత్మ. ఆ ఆత్మనిష్ట లోనే ఉండాలి.

**అంతా మిథ్యయని తలంచి చూచిన నరుండట్లౌ టెరింగిన్ సదా**
**కాంతాపుత్రుల్ నర్థముల్ తనువునిక్కంబంచు మోహార్ణవ**
**భ్రాంతింజెంది చరించుగాని, పరమార్థంబైన నీయందు దా**
**చింతాకంతయు చింతనిల్పడు కదా శ్రీకాళహస్తీశ్వరా!**

ఓ పరమేశ్వరా! '**బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా**' అన్న నిజం తెలియక సంసారమనే సాగరంలో పడి ఎంతసేపూ భార్యాబిడ్డలు, ధనధాన్యాదులు, శరీరపోషణ వీటి చుట్టే తిరుగుతున్నాము. ఈ మోహసముద్రం లోంచి, ఈ మాయా జగత్తులోంచి బయటపడే మార్గమైన నీ స్వరూప ఆలోచన కొంచమైనా చెయ్యము కదా!.

**సారాంశము-భార్య, పుత్రులు, బంధువులు అని అతి విచిత్రమైన పాశాల్లో పడి కొట్టుకుంటున్నాము. నీ స్వరూపమేమిటి? నువ్వు ఎవరవు? దేహానివా? మనస్సువా? అని తత్త్వవిచారణ చేసి బంధంనుంచి బయటపడు తమ్ముడూ!**

***

**శ్లోకము - 9**

**సత్సఙ్గత్వే నిస్సఙ్గత్వం, నిస్సఙ్గత్వే నిర్మోహత్వమ్।**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వం, నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః॥**

**సత్సఙ్గత్వే** = సత్సంగంవల్ల
**నిస్సఙ్గత్వం** = నిస్సంగత్వం వస్తుంది
**నిస్సఙ్గత్వే** = నిస్సంగత్వంవల్ల
**నిర్మోహత్వం** = నిర్మోహత్వం ఏర్పడుతుంది
**నిర్మోహత్వే** = నిర్మోహత్వంవల్ల
**నిశ్చలతత్త్వం** = నిశ్చలతత్త్వం సమకూరుతుంది
**నిశ్చలతత్త్వే** = నిశ్చలతత్త్వమే
**జీవన్ముక్తిః** = జీవన్ముక్తి (ఎటువంటి ఆందోళనలు లేకుండా గడపడం)

**పదచ్ఛేదమ్ - సత్సఙ్గత్వే, నిస్సఙ్గత్వం, నిస్సఙ్గత్వే, నిర్మోహత్వమ్।**
**నిర్మోహత్వే, నిశ్చలతత్త్వం, నిశ్చలతత్త్వే, జీవన్ముక్తిః॥**

**అన్వయమ్- సత్సఙ్గత్వే నిస్సఙ్గత్వం। నిస్సఙ్గత్వే నిర్మోహత్వమ్।**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వం। నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః (భవతి)॥**

**తాత్పర్యం -** సత్సంగంవల్ల సంగరాహిత్యం, సంగరాహిత్యంవల్ల మోహనిర్మూలనం, మోహనిర్మూలనంవల్ల నిశ్చలతత్త్వం, నిశ్చలతత్త్వంవల్ల జీవన్ముక్తి ఏర్పడతాయి. జీవన్ముక్తి అంటే ఇక్కడే ఇప్పుడే జీవించి ఉండగానే ఆనందంగా ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా జీవించవచ్చు.

**దుర్లభం త్రయమేవైతద్ దేవానుగ్రహహేతుకమ్।**
**మనుష్యత్వం, ముముక్షుత్వం, మహాపురుషసంశ్రయః॥ - వివేకచూడామణి**

మూడు విషయాలు చాలా కష్టంట, అవి దైవానుగ్రహమువల్లే సంభవమౌతాయి. మనిషిగా పుట్టడం చాలా అరుదు. కొన్ని కోట్ల జీవరాసులున్నాయి. వాటిలో మనుష్యజన్మ విశిష్ఠమైనది. ఈ జన్మలో జన్మరాహిత్యానికి కృషి చేయవచ్చు. మనిషిగాపుట్టిన వారిలో కూడా మోక్ష ఇచ్ఛ ఉండటం యింకా అరుదట. అలా మోక్షేచ్ఛ ఉన్నా అతనిని సన్మార్గం వైపుకు తీసుకు వెళ్ళే సద్గురువు దొరకడం అతి కష్టం.

మనిషిగా పుట్టినందుకు మన జీవిత లక్ష్యం ఏమిటి? అది తెలుసుకోవాలంటే, సృష్టిలో అన్నింటినీ గమనిస్తే, ఒక అంశం అన్నింటిలోనూ సమానంగా సాగుతుంది. చెట్లు పెరుగుతూ వస్తాయి. ఆ పెరిగే కాలంలో తాము మాత్రం పెరగకుండా, మానవాళికి పండ్లు, కూరగాయలను సమృద్ధిగా అందిస్తాయి. అంటే పరోపకారం కోసమే ఉన్నాయి అవి. అలాగే జంతువులు కూడా తాము పెరుగుతూ, వాటికి చేతనైన సహాయం మనకు చేసి, వాటి కాలం తీరాక తనువును చాలిస్తాయి. మనం కూడా వాటిలాగే శారీరకంగా ఎదుగుతాము. మనం కూడా జీవించి ఉన్నన్నాళ్ళూ మనం చేయగలిగిన సహాయం ఇతరులకు చేస్తూ, సమయం ఆసన్నమయినప్పుడు ఈ భూమిని తర్వాత వచ్చేతరంకోసం వదిలి వెళ్ళిపోతాము.

కాని, చెట్లు,జంతువులతో పోలిస్తే మన ఎదుగుదలలో ఒక ప్రత్యేకత ఉంది. వాటిది కేవలం భౌతికమైన ఎదుగుదల. మన విషయం అలాకాదు. మనం బుద్ధిపరంగా కూడా ఎదుగుతాము. శారీరక ఎదుగుదలకోసం మనం ఎక్కువ కష్టపడనవసరం లేదు. ఆ మాటకొస్తే పూజ్య స్వామీజీ సరదాగా అంటుంటారు, మనం బ్రతికి ఉంటే చాలు, మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా పెరుగుతాము, ఒక్కోసారి అవసరమైన దానికన్నా ఎక్కువగా. అందువల్ల శారీరక ఎదుగుదలకి జీవించి ఉండి, జీవించటానికి అవసరమైన మేరకు తింటూ, అనారోగ్య సమస్యలను రానివ్వకుండా చూసుకుంటే చాలు. మన ప్రమేయం లేకుండానే ఎదిగిపోతాము.

కాని మనిషి బుద్ధిజీవి. శారీరక ఎదుగుదల దగ్గరే ఆగిపోకూడదు. మనం అంతరంగంలో – భావపరంగా, బుద్ధిపరంగా, ఆధ్యాత్మికపరంగా ఎదగాలి. వీటన్నింటినీ కలిపి **అంతర్గత ఎదుగుదల** అంటారు. ఈ అంతర్గత ఎదుగుదల ఎంత మేరకు ఉండాలి? ఎంతమేరకన్నా ఉండవచ్చు. విశ్వమంతా నాది అనే భావన కలిగేవరకూ ఎదగవచ్చు.

**మయ్యేవ సకలం జాతం । మయి సర్వం ప్రతిష్ఠితమ్ ।**
**మయి సర్వం లయం యాతి । తద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్ ॥ – కైవల్యం**

నేను సర్వవ్యాపకమైన బ్రహ్మను. అలా అంతర్గతంగా ఎదుగుతున్నప్పుడు ప్రపంచానికి మనవంతు సహాయం చేయాలి.

**ఛాయామ్ అన్యస్య కుర్వంతి। తిష్ఠన్తి స్వయమాతపే।**
**ఫలాన్యపి పరార్థాయ। వృక్షాః సత్పురుషాః ఇవ॥**

చెట్లు అవి ఎండలో నిలుచుని తక్కినవారికి నీడనిస్తాయి. ఫలాలను కూడా ఇతరులకోసం పండిస్తాయి. అంతర్గత ఎదుగుదల ఉండాలి. కాని అది సాధించటం ఎలా? ఇది మన ప్రశ్న. బాహ్యమైన ఎదుగుదలకి పౌష్టికాహారం తినాలి, అది తెలుసు. అంతర్గతంగా ఎదగాలంటే ఏం చేయాలి? మనం ఆ విషయంలో, ప్రయత్నపూర్వకంగా కృషి చేయాలి. కాని ఈ సందర్భంలో మనం ఆ అంశాన్ని పట్టించుకోబోవడం లేదు.

అంతర్గత ఎదుగుదలకు మన కృషికి తోడు, మన చుట్టూ ఉన్నవారి ప్రమేయం కూడా ఉంటుంది. ఒక చెట్టు బాగా పెరగాలంటే దానికి విత్తనం పాతటం, నీరు పోయటం, చెదపురుగులు పట్టకుండా మందులు జల్లటంవంటి పనులు చేయటమే కాకుండా, దానికి తగ్గ వాతావరణం కూడా ఉండాలి. అది చాలా ముఖ్యం. ఏర్కాడ్‌వంటి కొండ ప్రాంతంలో పెరిగే మొక్కలను తెచ్చి చెన్నైలాంటి ప్రాంతంలో వేస్తే అవి బ్రతకవు, చచ్చిపోతాయి.

అలాగే మనం అంతర్గతంగా ఎదగాలంటే మనకు సత్సంగం ఉండాలి. మనం ఎవరితో కలిసి ఉంటున్నామనేది చాలా ముఖ్యం. బృహదారణ్యకోపనిషత్తులో తల్లి, తండ్రి, గురువు – ఈ ముగ్గురూ ఉండి, వీరి మాటను వినే అతను చెప్పే మాటకు విలువ ఉంటుంది అని వస్తుంది. మనకు ముగ్గురితో సత్సంబంధం ఉండాలి. తల్లి, తండ్రి, గురువు. వీరు చిన్నప్పటినుంచి మనను తీర్చిదిద్దుతారు. గురువు దగ్గర విద్యను ముగించాక బయట ప్రపంచంలోకి అడుగుపెడతాము.

ఆ బయట ప్రపంచంలో ఎవరితో కలిసి మెలిసి ఉంటామో, అది మన జీవితాన్ని నిర్దేశిస్తుంది. భర్తృహరి నీతిశతకంలో నీరుని ఉదాహరణగా తీసుకుని సత్సంగం ప్రభావం ఎలా ఉంటుందో వివరిస్తారు.

**నీరము తప్తలోహమున నిల్చి యనామకమై నశించు, నా**
**నీరమె ముత్యమట్లు నళినీదళసంస్థితమై తనర్చు, నా**
**నీరమె శుక్తిలోబడి మణిత్వము గాంచు సమంచితప్రభం;**
**బౌరుషవృత్తులిట్లధము మధ్యము నుత్తము గొల్చు వారికిన్.**

1. వేడి వస్తువుమీద నీరు జల్లితే ఆ నీరు వెంటనే మాయమవుతుంది. ఉదాహరణకు దోశె వేసే ముందు పెనం కాలిందా అని చూడటానికి నీళ్ళు జల్లుతారు కదా! ఆ నీరు వెంటనే ఆవిరయిపోతుంది. దీన్ని అధమసంగం అంటారు.

2. తామరాకుమీద నీటిబొట్టు నాశనమవదు. ముత్యంలా మెరుస్తుంది కూడా. కానీ కొంతసేపే. దీన్ని మధ్యమసంగం అంటారు.

3. స్వాతి నక్షత్రం రోజున వర్షపు చినుకు ఆల్చిప్పలో పడితే అది ముత్యంగా మారుతుంది. అది శాశ్వతంగా ఉంటుంది. దీన్ని ఉత్తమ సంగం అంటారు.

మూడు సందర్భాలలోను నీరు ఒకటే. అధమ సంగంలో నీరు నాశనమైపోయింది. మధ్యమసంగంలో కొంతసేపు మెరిసి మాయమయ్యింది. ఉత్తమసంగంలో నీరు కూడా ఉత్తమంగా అంటే ముత్యంగా మలచబడింది. ఇదే సూత్రం మనిషికి కూడా వర్తిస్తుంది. సత్సంగానికి ఉన్న విలువ అది. గొప్పవారితో సత్సంగం ఉంటే, మన ప్రమేయం లేకుండానే మనం కూడా మారతాం.

**సత్సంగత్వే నిస్సంగత్వమ్–** మనం ఉన్నతమైన వ్యక్తులతో సత్సంగం చేస్తే, మనం ఎక్కువ కష్టపడకుండానే, చెడు విషయాలకు దూరమవుతాము. వాటితో నిస్సంగత్వం ఏర్పడుతుందన్నమాట. ఒక కోతి మన వస్తువు ఏదైనా తీసుకున్నదనుకోండి. దాన్ని వదలమంటే అది వదలదు. దానికి ఇంకోటేదైనా ఇస్తే, చేతిలో ఉన్నది వదిలేసి, దీన్ని తీసుకుంటుంది. అలాగే చెడు విషయాలమీద ఆసక్తిని తేలిగ్గా వదులుకోలేము. కాని వేరే మంచి విషయాలమీద మొగ్గు చూపితే, చెడు విషయాలు వాటంతట అవే మనకు దూరమవుతాయి.

**నిస్సంగత్వే నిర్మోహత్వమ్–** వాటికి దూరమయ్యేసరికి వాటిమీద మోహం కూడా పోతుంది. సిగరెట్టు తాగకుండా ఉండలేని ఒక వ్యక్తి ఉన్నాడనుకోండి. అతను ఒక సత్సంగంతో కలిసి ఎక్కడికో వారం రోజుల పాటు వెళ్ళాడు. అక్కడ సిగరెట్టు ముట్టించుకునే ఆస్కారం లేదు. వారం రోజులూ దాని జోలికి పోకుండా ఉన్నాడు. అప్పటిదాకా తను సిగరెట్టులో ఆనందం ఉందనుకున్నాడు. కాని అది లేకపోయినా ఆనందంగా ఉన్నాడని గ్రహించటంతో దానిమీద ఉన్న మోహం పోతుంది అతనికి. అంటే ఆనందం బాహ్యవస్తువులో ఉందనుకుని, వాటి వెంట వెంపర్లాడే వ్యామోహం పోతుంది.

**నిర్మోహత్వే నిశ్చలతత్త్వమ్–** ఎప్పుడైతే మోహం పోతుందో అప్పుడే మనసు ప్రశాంతంగా అవుతుంది. మోహం ఉన్నన్నాళ్ళూ ఆ వస్తువు పొందకపోతే ఆరాటం, అసహనం కలుగుతుంది. మోహమే లేనప్పుడు, మోహం కలిగించే అసహనానికి చోటేది? చలితం అంటే చలించడం, మనసు పరిపరివిధాల ఆలోచనలు చేయడం అంటే కలత చెందటం. నిశ్చలతత్త్వం అంటే ప్రశాంతంగా ఉండటం.

**నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః –** మనస్సు ప్రశాంతంగా ఉంటే ఇక్కడే, ఇప్పుడే మోక్షం కలుగుతుంది. సంసారం అంటే శాంతి, భద్రత, ఆనందం బాహ్యవస్తువుల్లో ఉన్నాయనుకుని వాటి వెంట పరుగులు తీయటం. జీవన్ముక్తి అంటే వాటి వెంట పరుగులు తీయటం ఆపి నేనే ఆనందస్వరూపుణ్ణి అని తెలుసుకోవటం.

ఈ సత్సంగం మూడు స్థాయిల్లో జరుగుతుంది.

**1. ధార్మికపురుషునితో సంగత్వం –** సత్‌పురుషుడంటే ధార్మికపురుషుడు. విలువలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒదులుకోనివాడు. ఇప్పటి పిల్లలు రెండు రకాల ధర్మాల మధ్య నలిగిపోతున్నారు. తండ్రి సత్యం వద అని నేర్పిస్తాడు. సత్యమే పలుకు అని చెపుతాడు. కాని తనకు ఫోన్ వస్తే తను ఇంట్లో లేనని చెప్పమంటాడు. అంటే సత్యం వధ చేయాలని అనుకుంటాడు. ఆ విధంగా రెండు రకాల జీవనాలు గడపాలనుకుంటాడు పిల్లవాడు. 1. విలువల గురించి మాట్లాడాలి. 2. కాని ఆ విలువలను పాటించనవసరం లేదు. అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ విలువలను ఒదులుకోని వ్యక్తితో సావాసం చేయాలి. **ఒక విలువకు విలువ – ఆ విలువకు విలువనిచ్చినప్పుడే వస్తుంది.**

సత్సంగం చేస్తే మనకు తెలియకుండానే ఎలా మంచి విలువలు నేర్చుకుంటామో చూపటానికి పరమార్థానంద స్వామీజీ ఆయన అనుభవంలోంచి ఒక ఉదాహరణనిచ్చారు. ఆయన పూజ్య స్వామీజీ నేతృత్వంలో మూడేళ్ళ కోర్సు బొంబాయిలో అభ్యసించారు. వారి విద్యావిధానంలో భాగంగా శ్రమదానం కూడా ఉండేది. ఎండిపోయిన ఆకులను ప్రోగేసి, వాటిని తగులబెట్టేవారు. అలా ఒక రోజు వారు వాటిని గుట్టగా ఒక పెద్ద చెట్టు కింద పోసి తగులబెడుతుంటే పూజ్య స్వామీజీ (స్వామి దయానందసరస్వతీజీ) వచ్చి చెట్టు కింద ఎలా కాలుస్తారు అన్నారు. అప్పుడు వారికి వృక్షాల్లో కూడా జీవముందని అర్థమైంది. అహింస మనుష్యులకే కాదు, వృక్షాలకు కూడా చూపాలని నేర్చుకున్నారు. ఇది ఎలా నేర్చుకున్నారు? పూజ్య స్వామీజీతో కలిసి ఉండి, ఆయన మామూలుగా మాట్లాడిన మాటల్లోంచి నేర్చుకున్నారు. క్లాసురూములో చెప్పిన పాఠం కాదది. కాని అది వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.

**2. జ్ఞానీపురుషునితో సంగత్వం–** జ్ఞానిపురుషునితో సత్సంగం అంటే రెట్టింపు లాభం ఉంటుంది. ఒకటి విలువలను పెంపొందించుకుంటాము. ప్రతి ధార్మికవ్యక్తీ జ్ఞాని కాకపోవచ్చు కాని ప్రతి జ్ఞానీ ధార్మికపురుషుడు అవుతాడు. రెండోది జ్ఞానం

పొందే అవకాశం కలుగుతుంది. విలువలు నేర్చుకోవటానికి జ్ఞానితో కలిసి ఉంటే చాలు. కాని జ్ఞానం విషయంలో అలా కాదు. కలిసి ఉంటే సరిపోదు. జ్ఞానం పొందాలంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. గురువుకు శుశ్రూషలు, పాదపూజలు చేస్తే చాలదు, కొన్ని సంవత్సరాల పాటు విద్యనభ్యసించాలి. అది దీర్ఘకాల ప్రణాళిక. పూర్వం అందువల్లనే గురుకులవాసం ఉండేది. గురువుతో కలసి జీవించటం ఉభయతారకం. గురువు ప్రవర్తనను దగ్గరగా గమనిస్తూ తనకు తెలియకుండానే గురువు మంచి గుణాలను అనుకరిస్తాడు శిష్యుడు. రెండో లాభం గురువు దగ్గర విద్యనభ్యసిస్తాడు. పూజ్యస్వామీజీ జ్ఞాని. ఆయన దగ్గర అన్ని రకాల మనస్తత్వాలున్న శిష్యులు ఉండేవారు. అటువంటి వారందరినీ ఒక్కత్రాటి మీద ఎలా నడిపిస్తారో వీళ్ళు గమనించేవారు.

ఎప్పుడైతే ఒక వ్యక్తి ధార్మిక పురుషసంగత్వం లోనూ, జ్ఞానీపురుష సంగత్వంలోనూ కొన్నాళ్ళు గడుపుతారో అప్పుడే అతనికి మూడవ సంగత్వం దానంతట అదే ఏర్పడుతుంది. అది బ్రహ్మతో సంగత్వం.

**3. బ్రహ్మతో సంగత్వం–** ఉన్నదొకటే బ్రహ్మ. ఆ బ్రహ్మవు నువ్వే అని జ్ఞానీపురుషుని ద్వారా నేర్చుకుంటాడు. సత్ అంటే బ్రహ్మ. సత్సంగం అంటే బ్రహ్మతో ఉండటం.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్ –** ఛాందోగ్యమ్

బ్రహ్మతో సంగత్వం ఎలా కుదురుతుంది? బ్రహ్మతో సంగత్వం శారీరకంగా ఉండదు. బ్రహ్మ ఒక వ్యక్తి అయితే, గురువు వచ్చి అదిగో అక్కడ ఉన్నాడు అని చెపితే వెళ్ళి కాసేపు సంగత్వం చేసి రావచ్చు. కాని బ్రహ్మ ఎవరు? వ్యక్తి కాదు. దేవుడు కాదు, నేనే. నా స్వరూపమే బ్రహ్మస్వరూపం. నేను బ్రహ్మకు ఎన్నడూ భిన్నంగా లేను. ఒకవేళ నేను భిన్నంగా ఉన్నాను అనుకుంటే, దానికి నా అజ్ఞానమే కారణం. ఎప్పుడైతే ఆత్మ జ్ఞానం లేదా బ్రహ్మ జ్ఞానం పొందుతానో అప్పుడే నాకు బ్రహ్మ ప్రాప్తి, బ్రహ్మ సంగప్రాప్తి, బ్రహ్మ ఐక్యప్రాప్తి కలుగుతుంది. ఇది మొదటి రెండు సత్సంగాల ఫలితం. మొదటి రెండు స్థాయిలూ దాటందే, మూడవస్థాయికి రాలేము.

ధార్మికపురుషునితో నేను సత్సంగం పెట్టుకోవటానికి సిద్ధమే కాని అలాంటి పురుషులు ఎక్కడా కనపడటం లేదు. నేనొక్కడినే మంచివాడిగా అనిపిస్తున్నాను నాకు! ఈ ప్రశ్న మీలో ఉదయిస్తే దానికి వేరే మార్గం ఉంది. మనకు సత్పురుషుల

జీవితచరిత్రలు ఉన్నాయి. వారి చరిత్ర, వారి ఆలోచనలు మనకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. వాటినుంచి ప్రేరణ పొందవచ్చు మనం.

అయినా మన సందేహం తీరదు. సరే ధార్మికపురుషుణ్ణి పుస్తకంలో వెతుక్కోవచ్చు కాని జ్ఞానితో సత్సంగం చేయాలంటే పుస్తకాలు చాలవు కదా! జ్ఞానం స్వయంగా శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారా పొందాలంటారు కదా, మరి దాని మాటేమిటి అనుకుంటాము.

**తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్।**
**దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే॥**
**తేషామేవానుకంపార్థమ్ అహమజ్ఞానజం తమః।**
**నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా॥ గీత 10- 10,11**

మీరు మొదటి స్థాయి విషయంలో ప్రయత్నం చేస్తే నేను మీకు రెండవ స్థాయిని ఏర్పరుస్తాను అంటాడు భగవానుడు. ప్రతి ఒక్క సాధనశిబిరమూ సత్సంగమే.

గురువు దొరికితే గురువుద్వారా మీకు బ్రహ్మసత్సంగం దొరుకుతుంది. తద్వారా జీవన్ముక్తి, మోక్షప్రాప్తి కలుగుతుంది.

మామూలుగా పిక్నిక్‌లకు వెళుతుంటారు అందరూ. అక్కడ అందరి రుచులూ, ఆలోచనలు, సరదాలు ఒక్కలాగా ఉండవు. అందువల్ల అందరితో కలవటం కష్టంగా ఉంటుంది. కాని సాధన శిబిరాల్లో అలా కాదు. అందరి ఆలోచనలు, దృక్కోణాలు ఒక్కలాగే ఉంటాయి. ప్రతి ఒక్క విద్యార్థి కూడా ఒక సత్పురుషుడే! మనం విద్య నేర్చుకునేందుకు నాలుగు అంశాలు తోడ్పడుతాయి. గురువు బోధ, మన కృషి, తోటి విద్యార్థులు, కాలం- అందువల్ల తోటి విద్యార్థులతో సత్సంగం చేస్తే ఎన్నో విషయాలు తెలుస్తాయి.

**సారాంశము- మొదట సత్పురుషులతో సంగత్వం, తరువాత సద్గురువులతో, ఆపైన సత్‌తో సంగత్వంవల్ల అనాత్మతో నిస్సంగత్వం వస్తుంది. అలా ఏర్పడే సద్దర్శనమువల్ల రాగ ద్వేషాలవంటి ద్వంద్వాలనుంచి ముక్తి వస్తుంది. ద్వంద్వాల వెంట పరుగులెప్పుడాగుతాయో అప్పుడు ప్రశాంతత ఏర్పడుతుంది. అదే నిశ్చలతత్త్వం. నిశ్చలతత్త్వమే జీవన్ముక్తి. ఇదే అద్వైతమిచ్చే అమూల్యమైన కానుక.**

***

**శ్లోకము - 10**

**వయసి గతే కః కామవికారః శుష్కే నీరే కః కాసారః।**
**క్షీణే విత్తే కః పరివారో జ్ఞాతే తత్త్వే కః సంసారః॥**

| | |
|---|---|
| **వయసి గతే (సతి)** | = వయసు గతించిన తరువాత |
| **కః కామ వికారః?** | = కామ వికారమెక్కడ? |
| **శుష్కేనీరే (సతి)** | = నీరు ఎండిన తరువాత |
| **కః కాసారః?** | = చెరువెక్కడ? |
| **క్షీణే విత్తే (సతి)** | = ధనం ఖర్చు అయిపోయాక |
| **పరివారః కః?** | = పరివారం ఎక్కడ? |
| **జ్ఞాతే తత్త్వే (సతి)** | = తత్త్వం తెలిసిన తరువాత |
| **సంసారః కః?** | = సంసారమేది? |

**పదచ్ఛేదమ్-** **వయసి, గతే, కః, కామవికారః, శుష్కే, నీరే, కః, కాసారః।**
**క్షీణే, విత్తే , కః, పరివారః, జ్ఞాతే, తత్త్వే, కః, సంసారః॥**

**అన్వయమ్-** **వయసి గతే (సతి) కః కామ వికారః? శుష్కే నీరే (సతి) కః కాసారః? క్షీణేవిత్తే (సతి) కః పరివారః? తత్త్వే జ్ఞాతే (సతి) కః సంసారః?**

**తాత్పర్యం-** వయసుడిగాక కామవికారమెక్కడిది? నీరెండిపోయాక కాసారమేది? ధనం నష్టమయ్యాక పరివారమేది? తత్త్వం తెలిసాక సంసారమేది?

పెద్ద వయస్సు వచ్చాక కోరికలేముంటాయి? పిల్లవాడు హైడ్రొజన్ బెలూన్ కావాలని కాలికి, చేతికి అడ్డంపడి ఏడుస్తున్నాడు. అది ఎక్కువసేపు ఉండదురా అన్నా వినడు. పగిలిపోతుందిరా అన్నా ఏడుపు ఆపడు. ఏడుపు స్థాయి పెరుతోందేగాని తగ్గేధోరణి కనపడటంలేదు. ఆ బెలూను అమ్మేవాడికి డబ్బు చెల్లించి పిల్లవాడి ఏడుపు ఆపగలిగాను.

ఆకాశంలో నిటారుగా ఉన్న బెలూన్ చూసి గంతులేస్తున్నాడు. ఎప్పుడో నోట్లో వేలుపెట్టుకుని బొటన వేలు చీకాలని గుర్తుకొచ్చి బొటన వేలు నోట్లో పెట్టడంలో బెలూను చేతిలోంచి జారిపోయింది. ఎగురుతున్న గంతులు కేరింతలు మళ్ళీ ఏడుపులోకి దింపాయి. సరిగ్గా మన పరిస్థితీ అంతే. ఇక్కడున్నదేదీ నిలబడేది కాదని తెలిసినా అవి కావాలి ఇవి కావాలని ఎగిరిపోయే బెలూన్లు తెచ్చి పెట్టుకుంటాము. ఆ తరువాత బెలూను ఎగిరిపోయిందే అని రోదిస్తాము. అలా

రోదించి రోదించి వృద్ధాప్యంలో అడుగుపెడతాము. వృద్ధాప్యం ఒక హుందాతనాన్ని, నిండుతనాన్ని తెస్తుంది. ఆ బెలూన్ల మోజు ఇప్పుడు లేదు.

వృద్ధాప్యం గురించి శ్రీ గొల్లపూడి మారుతీరావు గారు చక్కటి విశ్లేషణ చేసారు. వృద్ధాప్యానికి ఆహ్వానం అని అద్భుతమైన వ్యాసం రాసారు. అది కౌముది వారు ముద్రించారు. అందులో కొన్ని విషయాలు–

చమకంలో **వృద్ధిశ్చ మే, వృద్ధం చ మే** అంటాము. వృద్ధిశ్చమే నాకు వృద్ధినియ్యి అనడం బాగానే వుంది. నాకు వృద్ధాప్యాన్ని యివ్వమని అడుగుతాడేమిటి అని ఆశ్చర్యం. కోరికలనుంచీ, ఈ జీవితంలో సుఖాలనుంచి బయట పడలేని జీవుడు– అలా బయట పడేసే మానసిక స్థితిని, ఆ దశను ప్రసాదించు స్వామీ – అంటూ ఆ కోరికల వెల్లువలోనే ఒక విచిత్రమైన కోరికని జత చేశాడు. నన్నీ కోరికలనుంచి విముక్తం చేసే – లేదా విరక్తిని కలిగించే వృద్ధాప్యాన్ని ప్రసాదించు – అని వేడుకోవడం బహుశా ఏ మతంలోనూ లేదేమో, ఏ భక్తుడూ యింత పరిణతితో, యింత గంభీరమైన కోరిక కోరలేదేమో!

వృద్ధాప్యం ఒక మజిలీ. ప్రతివ్యక్తి, కోరుకున్నా కోరుకోకపోయినా, తప్పని సరిగా చేరుకునే మజిలీ. వయస్సులోని కోరికలన్నింటికీ సెలవిచ్చి, అలసిపోయిన అనుభవాలన్నీ ఆరిపోయి, అనుభూతులను నెమరువేసుకునే చలివేంద్రం. వృద్ధాప్యం ఒక అవకాశం. వెనక్కి తిరిగి చూసుకుని చేసిన తప్పిదాలకు నవ్వుకుని, దాటిన అడ్డంకులను పరామర్శించి, ఇక దాటనక్కరలేని స్థితి వచ్చినందుకు ప్రశాంతంగా నిట్టూర్చే ఆట విడుపు.

వృద్ధుడిని అందరూ గౌరవిస్తారు. జీవితకాలంలో సాధనలన్నీ పక్కనపెట్టి కేవలం వయస్సు కారణంగానే పెద్దరికాన్ని అంగీకరిస్తారు. అదొక అంతస్థు.

ఇలా గొల్లపూడి మారుతీరావుగారు వృద్ధాప్యం ముచ్చట్లమీద చాలా వ్యాఖ్యానం చేశారు. వయసు మీదపడ్డాక ఇంకా అర్థంపర్థం లేని కామవికారాలేమిటి?

శ్రీరంగంలో కావేరిని చూద్దామని వెళితే అక్కడ పిల్లలు క్రికెట్ ఆడుకుంటున్నారు. కావేరి నది ఎండిపోయి ఉంది.

**శుష్కే నీరే కః కాసారః?** నీరు ఎండిపోతే కాసారమేది?

**క్షీణే విత్తే కః పరివారః?** డబ్బు లేకపోతే పరివారము ఎక్కడ ఉంటారు.

డబ్బు చుట్టూ జనం. డబ్బులేదని తెలిస్తే అందరూ జారుకుంటారు. ఎక్కడ డబ్బు సాయం చేయాల్సి వస్తుందో అని డబ్బులేని వాడికి ఆమడ దూరం ఉంటారు.

**జ్ఞాతే తత్త్వే కః సంసారః?** ఆత్మవిద్య తెలిసాక సంసారమెక్కడిది? సంసారము అజ్ఞానమువల్ల ఏర్పడుతుంది. జనరేటర్లు లేని కాలంలో పూర్వం కరెంటుపోతే ఊరంతా చిమ్మచీకటి, అంధకారమై పోయేది. ఆ రోజుల్లో రాత్రి పూట పెళ్ళి చేసే సందర్భాలలో పెట్రమాక్స్ లైట్లు వాడేవారు. ముందుజాగ్రత్తగా పెట్రమాక్స్ లైట్లు అమర్చు కునేవారు.

ఒకచోట రాత్రిపూట వివాహం జరుగుతోంది. ఎందుకైనా మంచిదని పెట్రమాక్స్ లైట్స్ తెప్పించారు. అవి చాలా పెద్దవిగా కూడా ఉండేవి. నెత్తిమీద పెట్టుకుని వచ్చేవారు. అలా ఒకతను నెత్తిమీద పెట్రమాక్స్ లైట్ పెట్టుకుని పెళ్ళిపెద్ద దగ్గరకు వచ్చి 'అయ్యా! ఈ లైటు ఎక్కడ పెట్టమంటారు?' అని అడిగాడు. ఆయన ఎక్కడ చీకటిగా ఉందో అక్కడ లైటుంచు అన్నారు. సరేనని ఆ నౌకరు చీకటిగా ఉన్న చోటుకి వెళితే, అతను వెళుతూండగానే చీకటి మాయమయింది. మళ్ళీ మరోచోట చీకటి కనిపించింది. అక్కడ పెడదామని అక్కడకు వెళ్ళాడు. అతను వెళ్ళడం తడవు ఆ చీకటి పోయింది. అలా రోజంతా ఆ అమాయకుడు, చీకటిని వెతుక్కుంటూ తెల్లవారే దాకా తిరిగాడు. అదే మాదిరిగా ఆత్మజ్ఞానము రాగానే అజ్ఞానము మాయమవుతుంది.

ఆత్మలో నెలకొని ఉన్నవానికి సంసారబాధలుండవు. ఆత్మ అసంగము, అవ్యవహారి, అకర్తా, అభోక్తా కనుక అహమ్ ఆత్మ అనే నిష్ఠలో ఉన్నవానికి సంసారములోని ఒడిదుడుకులు బాధలు ఉండవు. ఎలాగా? మనం పనసకాయ కోసేటప్పుడు చేతికి నూనె రాసుకుని, కత్తికి నూనె రాసి కాయ కోస్తాము. అందులో తొనలు తీస్తాము. ఈ విధంగా చేయటంవల్ల పనసకాయకున్న జిగురు మనకు అంటుకోదు. అదే విధంగా ఆత్మజ్ఞానమనే తైలం రాసుకుంటే మనలను సంసారము బంధించదు, బాధించదు.

**క్షణం విత్తం క్షణం చిత్తం క్షణం జీవితమావయోః।**
**యమస్య కరుణా నాస్తి తస్మాత్ జాగ్రత జాగ్రత॥**

ధనము, బుద్ధి, జీవితము క్షణభంగురములు. యముడు సమయం రాగానే తీసుకు వెళ్ళిపోతాడు. ఎటువంటి కరుణ చూపడు. ఎంతో జాగరూకతతో ఉండు. సమాయాన్ని వృథా చేసుకోవద్దు. ఈలోపునే ఆధ్యాత్మిక ప్రగతి సాధించు.

**సారాంశము-వృద్ధాప్యంలో శరీరపరమైన కోరికలు ఎక్కడ? కూర్చోడం, నుంచోడమే కష్టంగా ఉంది. నీరు లేకపోతే చెరువు మైదానమైపోతుంది. ధనము లేకపోతే పరివారముండరు. అజ్ఞాన నిర్మూలనం తరువాత సంసారము లేదు.**

***

# స్వామీజీ సూక్తిముక్తావళి

**దమయజ్ఞం** – దమం అంటే ఇంద్రియనిగ్రహం. ఇంద్రియనిగ్రహం వేరు, ఇంద్రియాలను అణగద్రొక్కటం వేరు. గుర్తుంచుకోండి, శాస్త్రం ఎప్పుడూ ఇంద్రియాలను అణగద్రొక్కమని చెప్పదు. ఎందుకంటే ఇంద్రియాలకు బానిస అవటం ఎంత ప్రమాదకరమో, ఇంద్రియాలను అణగద్రొక్కటం కూడా అంతే ప్రమాదకరం.

అణగద్రొక్కటం ఎవరో బలవంతపెడితే జరుగుతుంది. ఇంద్రియ నిగ్రహం మన స్వయం నిర్ణయంతో జరుగుతుంది. ఉదాహరణకు మీరు ఏకాంతం కోరుకుని, మీ అంతట మీరు ఒక గదిలో తలుపు వేసుకుని గంటసేపు కూర్చుంటే అది ఇంద్రియ నిగ్రహం అవుతుంది. అదే ఎవరో మిమ్మల్ని బలవంతంగా ఒకగదిలో తలుపువేసి గంటసేపు కూర్చోబెడితే అది అణగద్రొక్కటం అవుతుంది.

***

## శ్లోకము - 11

**మా కురు ధనజనయౌవనగర్వం, హరతి నిమేషాత్కాలస్సర్వం।**
**మాయామయమిదమఖిలం హిత్వా, బ్రహ్మ పదం త్వం ప్రవిశ విదిత్వా॥**

| | |
|---|---|
| **ధనజనయౌవనగర్వం** | = ధనంవల్ల, చుట్టూ చేరే జనంవల్ల, యౌవనంతో ఏర్పడే గర్వం |
| **మా కురు** | = వీడుము |
| **కాలః సర్వం** | = కాలప్రభావంతో సర్వం |
| **నిమేషాత్** | = క్షణంలో |
| **హరతి** | = హరించుకు పోతుంది |
| **ఇదమ్ అఖిలం** | = ఈ జగత్తు సర్వం |
| **మాయామయం** | = మిథ్యా భూతం |
| **హిత్వా** | = అని గ్రహించి |
| **బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా** | = నిత్యమూ సత్యమూ అయిన బ్రహ్మపదాన్ని అందుకో |

పదచ్ఛేదమ్- **మా, కురు, ధన- జన- యౌవనగర్వం, హరతి, నిమేషాత్, కాలః, సర్వం। మాయామయమ్, ఇదమ్, అఖిలం, బుద్ధ్వా, బ్రహ్మపదం, త్వం, ప్రవిశ, విదిత్వా॥**

అన్వయమ్- **(త్వం) ధనజనయౌవనగర్వం మా కురు। నిమేషాత్ కాలః సర్వం హరతి। ఇదమ్ అఖిలం మాయామయమ్ ఇతి త్వం బుద్ధ్వా బ్రహ్మపదం విదిత్వా (బ్రహ్మపదం) ప్రవిశ॥**

**తాత్పర్యం-** ధనంవల్ల, చుట్టూ చేరే జనంవల్ల, యౌవనంవల్ల ఏర్పడే గర్వం వీడు. క్షణకాలంలో అవి అన్నీ హరించుకు పోతాయి. ఇదంతా మాయామయం అని గ్రహించి నిత్యమూ సత్యమూ అయిన బహ్మపదం తెలుసుకుని బ్రహ్మపదంలో ప్రవేశించు.

ఓడలు బళ్ళు, బళ్ళు ఓడలు అవుతూంటాయి. ఒకప్పుడు రాజరికం అనుభవించిన రాజులు, సంస్థానాధీశులు ఏమయ్యారు? మొదట్లో ప్రీవీ పర్స్ అని గవర్నమెంట్ సంస్థానాధిపతులకు డబ్బు ఇస్తూండేది. తరువాత అదీ రద్దు చేశారు. ధనం, జనం, యవ్వనం ఏదీ నిలబడేది కాదు. అన్నీ హరించుకు పోయేవే. ప్రపంచ దేశాలపై దండయాత్ర చేసి దేశాలను కొల్లగొట్టిన అలెగ్జాండర్ చివరి కోరికగా తన

శవపేటికకు రెండు కన్నాలు పెట్టి తన చేతులను బయట పెట్టి అలెగ్జాండర్ ది గ్రేట్ చనిపోయాక చిల్లి గవ్వకూడ పట్టుకు పోలేకపోతున్నాడనే సందేశాన్ని ప్రపంచానికి తెలియచేసేలా తన శవయాత్ర చేయమన్నాడు.

ఒక యువధనవంతుడు తన జీవితాన్ని జల్సాలతో విలాసాలతో గడుపుతున్నాడు. అతనికి కావల్సినంత డబ్బుంది. అతనికే కాదు కొన్ని తరాలకు సరిపడా డబ్బుంది. చుట్టూ సేవకులు ఉండేవారు. నాకేం తక్కువ అన్నట్టుగా మదగర్వంతో దేముణ్ణి కూడా ఖాతరు చేయకుండా ఒక రోజు తాగి కారు నడుపుతూ ఒక చెట్టుకు ఢీకొని మరణించాడు. అతని ధనంగాని, జనంగాని, యవ్వనం గాని అతని చావుని తప్పించ లేకపోయాయి. అతని లాప్‌టాప్‌లో అతని ఆస్తి వివరాలు అంటే ఎక్కడెక్కడ డబ్బు గుప్తంగా దాచాడో అవి గుప్తంగా పెట్టుకున్నాడు. ఈ విషయం అతని భార్యకు, పిల్లలకు తెలియకుండా జాగ్రత్త పడ్డాడు. అతనితో పాటు అతని లాప్‌టాప్ కూడా ముక్కలు ముక్కలైంది. డబ్బుండీ అతని కుటుంబం రోడ్డున పడింది. **ధనజనయవ్వనగర్వం మా కురు।**

కాలం వేగంగా పరుగులు పెడుతోంది. ధనం, జనం, యౌవనం ఏదీ మనని మరణంనుంచి రక్షించలేవు. ఇచ్చిన సమయాన్ని పాడుచేసుకోకుండా ముందే ఆత్మవిచారణ చేయి.

ఒక ధనికుడు మహాలోభి. తన ధనాన్ని పెంచుకుంటూ పోతున్నాడు. పిల్లికి కూడా బిచ్చం పెట్టడు. ధనముందని మిడిసి పాటు, గర్వం, ఎవరికి సాయం చేయడు. ముష్టివారు వస్తే వారిని హేళనచేసి పంపుతాడు. రోజూ ఆయన చేసే కార్యక్రమాలలో అతి ముఖ్యమైనది – తన ఇనపపెట్టెను తెరిచి అందులో ఎంత ధనం నిల్వచేసాడో దాన్ని కళ్ళారా పదినిముషాల పాటు చూసి ఆనందించడం.

ఒక బిచ్చగాడికి ఈయన విషయమంతా తెలుసు. ఒక రోజు ఆయన ఇంటి ముందు నుంచున్నాడు. ధనికుడు చీత్కారంతో పొమ్మన్నాడు. బిచ్చగాడు ధనికునితో ఇలా అన్నాడు. అయ్యా నేను మీదగ్గర బిచ్చమెత్తుకోడానికి రాలేదు. మీకు వంద రూపాయలు ఇద్దామని వచ్చాను. అలాగా అయితే ఇయ్యి మరి అన్నాడు ధనికుడు ఆశగా.

మీరు ఇనప్పెట్టె తెరిచి రోజూ కొన్ని నిముషాలు అందులో ధనం చూస్తారు కదా! ఈ రోజు నన్ను కూడా మీతో పాటు చూడనివ్వండి. మీకు ఎదురు నేను వందరూపాయిలిస్తాను అన్నాడు బిచ్చగాడు. దానికి ధనికుడు, 'సరే రా,' అని

వాడిని కూడా తనతో పాటు నుంచో పెట్టుకుని తన ఇనపెట్టెలో డబ్బు చూడనిచ్చాడు. బిచ్చవాడు ధనికుని చేతిలో వందరూపాయిలుంచి, 'అయ్యా! మీరు నేనూ సమానమే,' అన్నాడు. ఎలా? ధనికుడు తన డబ్బును సద్వినియోగం చేయకుండా ఇనప్పెట్టెలో బంధించి కేవలం చూస్తున్నాడు. బిచ్చగాడు అదే చేశాడు. కాబట్టి వారిద్దరిలో ఏమీ తేడాలేదు. **ధనం ధర్మార్థం** అంటుంది శాస్త్రం.

ధనం, జనం, యౌవనంలో ఆనందముందనుకుని మిడిసి పడుతూంటాడు మానవుడు. కరెంటుపోతే యూపీయస్ వాడతాము. అలాగే గోవిందుడు ఒక యూపీయస్. **అన్ ఇంటెరెప్టెడ్ ప్లజర్ సప్లయి.** గోవిన్దుణ్ణి శరణు కోరితే నిరాఘాతమైన అపారమైన ఆనందము దొరుకుతుంది. అందుకే **భజ గోవిన్దమ్** అన్నారు శంకరులు.

**బలయుతులకు దుర్బలులకు**
**బలమెవ్వడు నీకు నాకు బ్రహ్మాదులకున్**
**బలమెవ్వడు ప్రాణులకున్**
**బలమెవ్వండట్టి విభుండు బలమసురేంద్రా.**

ఒక ఆధ్యాత్మిక సాధకుని దగ్గర డబ్బు ఎంత ఉండాలి అని శాస్త్రం ఒక చక్కని ఉదాహరణ ఇస్తుంది. డబ్బు మనం తొడుక్కునే చెప్పులా ఉండాలిట. మరీ లూజ్‌గా ఉండకూడదు. లూజ్‌గా ఉంటే జారిపోతూంటుంది. మరీ టైట్‌గానూ ఉండకూడదు. టైట్‌గా ఉంటే కరుస్తుంది. ఈ విషయమే ఒక ధనిక సాధకుడికి చెప్తే అతను ఆ విషయం కొంచం కూడా అరిగించుకోలేకపోయాడు. రాత్రంతా మథనపడి మర్నాడు కలిసి, 'అలాంటి చెప్పుల జతలు ఒకడి దగ్గర ఎన్ని ఉండచ్చు,' అని అడిగాడు.

**సమ్పదః స్వప్నసంకాశాః యౌవనం కుసుమోపమమ్।**
**విద్యుచ్చంచ్చల ఆయుష్యం తస్మాత్ జాగ్రత జాగ్రత॥**

సంపదలు కలలలాంటివి. కరిగిపోతాయి. యవ్వనం పూవువలే తొందరగా వడిలి పోతుంది. జీవితం మెరుపులాగ మెరిసి క్షణభంగురమౌతుంది. కాబట్టి సావధానుడవై ఉండుము. సమయాన్ని ఆత్మవిద్యవైపు మళ్ళించు.

**సారాంశము- ధనం, జనం, యౌవనం ఏదీ నిలిచేది కాదు. కాలప్రవాహంలో అన్నీ మనను వదిలేసేవే. వాటి గురించిన గర్వం వ్యర్థమైనది. సమయంమించకుండా బ్రహ్మపదమువైపుకు అడుగులు వేయాలి. అప్పుడే గమ్యం చేరుకుంటావు.**

**శ్లోకము - 12**

**దినయామిన్యౌ సాయంప్రాతః శిశిరవసన్తౌ పునరాయాతః।**
**కాలః క్రీడతి గచ్ఛత్యాయుః తదపి న ముఞ్చత్యాశావాయుః॥**

**దినయామిన్యౌ సాయం ప్రాతః** = పగలు, రాత్రి, సాయం కాలం, ప్రాతఃకాలం
**శిశిరవసంతౌ** = శిశిరము, వసంతకాలం
**పునరాయాతః** = మళ్ళీ మళ్ళీ వస్తాయి
**కాలః క్రీడతి** = కాలం క్రీడిస్తోంది
**గచ్ఛత్యాయుః** = ఆయుష్షు తరిగి పోతోంది
**తదపి న ముఞ్చతి ఆశావాయుః** = అయినా ఆశమాత్రం పోవటంలేదు

**పదచ్ఛేదమ్-** **దినయామిన్యౌ, సాయం-ప్రాతః, శిశిరవసన్తౌ, పునః ఆయాతః। కాలః, క్రీడతి, గచ్ఛతి, ఆయుః, తత్, అపి, న, ముఞ్చతి, ఆశావాయుః॥**

**అన్వయమ్-** **దినయామిన్యౌ (ఆయాతః)। సాయం ప్రాతః చ (ఆయాతః)। శిశిరవసంతౌ పునః (ఆయాతః)। కాలః క్రీడతి। ఆయుః గచ్ఛతి। తత్ అపి ఆశావాయుః న ముంచతి।**

**తాత్పర్యం-** పగలు, రాత్రి, సాయం కాలం, ప్రాతఃకాలం వస్తున్నాయి, వెళుతున్నాయి. శిశిరం, వసంతకాలం మళ్ళీ మళ్ళీ వస్తాయి. మనతో కాలం వినోదం చేస్తోంది. అయినా ఆశాపాశం వీడటం లేదు.

కాలం పరుగులు పెడుతోంది. అయినా లౌకిక యావ చావలేదు. ఒక వర్తకుడు పెద్ద వ్యాపారం చేసి చాలా సంపాదించాడు. అతనికి రాము, సోము, దాము, ప్రేము అని నలుగురు పిల్లలు. వారందరు అతనిని మించిన వ్యాపార నైపుణ్యంతో వ్యాపారాన్ని చేసి, తండ్రికి చేదోడు వాదోడుగా నిలిచి, వ్యాపారాన్ని పదింతలు చేశారు.

వ్యాపారి మరణకాలం ఆసన్నమైంది. ఇంకో కొన్ని క్షణాలు అన్నట్టుగా ఉంది. వ్యాపారి అతి కష్టంమీద గొంతు పెగుల్చుకుని, 'రామూ,' అని పిలిచాడు. 'ఇక్కడే ఉన్నాను నాన్నా!' అని రాము తండ్రి ఎదుటగా తండ్రికి కనిపించేలా నుంచున్నాడు. 'సోమూ,' అన్నాడు వ్యాపారి. 'ఇక్కడున్నాను నాన్నా,' అంటూ ముందుకొచ్చాడు సోము. 'దాము,' అన్నాడు కష్టంమీద 'ఉన్నాను నాన్నా,' అని

హాజరు పలికాడు దాము. మళ్ళీ ప్రయాస పడి 'ప్రేమూ,' పిలిచాడు వ్యాపారి. 'ఇక్కడున్నాను,' అంటూ నాన్న చేతిని చేతిలోకి తీసుకున్నాడు ఆఖరి వాడు ప్రేమగా. ఉగ్గపట్టిన ఊపిరితో పోతున్న సత్తువను కూడగట్టుకుని వ్యాపారి, 'అందరూ ఇక్కడే ఉంటే వ్యాపారమేమవుతుందిరా,' అని అరిచి శ్వాసకోల్పోయాడు. ఆశాపాశం అంటే ఇదే . ఆఖరివరకు వదిలి పెట్టదు. మనను బంధిస్తుంది. రోజులు దొర్లిపోతున్నా భగవంతుడు గుర్తురాడు.

ఆఖరి క్షణంలో భగవన్నామం ఉచ్చరిస్తే ఉన్నతలోకాలకు వెళతారని శాస్త్రవాక్యం. ఒక లోభికి నార చూపించారు. నారాయణ అనక పోయినా కనీసం నార అని అంటాడేమో అని ఆశించారు. భగవన్నామం ఉచ్చరించని ఆ మూర్ఖుడు 'పీచు,' అని శ్వాస వదిలాడు. భగవంతుణ్ణి అనుక్షణం స్మరించు కోవాలి.

మనం అనుభవించే ప్రతిక్షణం భగవత్ ప్రసాదమే. భగవంతుణ్ణి అంత్యకాలంలో స్మరణ చేయమంటే అంత్యకాలంలో మాత్రమే అని కాదు, నిత్యం భగవత్ స్ఫురణతో ఉండమని.

**ఆశయా బధ్యతే జన్తుః కర్మణా బహుచిన్తయా।**
**ఆయుక్షీణం న జానాతి తస్మాత్ జాగ్రత జాగ్రత॥**

ఆశలతో కర్మలతో, అనేక చింతలతో మనిషి బంధంలో పడుతున్నాడు. తరిగిపోతున్న కాలాన్ని గుర్తించటం లేదు. అందుచేత ఓ మానవుడా సావధానుడవై ఉండుము.

**సారాంశము– ఉదయం, సాయంత్రం, రాత్రి ఒకదాని వెంట మరొకటి పోటీపడుతూ పరుగులు పెడుతున్నాయి. ఇవి ఎవరికోసం ఆగవు. కాలం క్రీడిస్తోంది. ఆయుష్షు మెల్లిగా తగ్గుముఖం పడుతోంది. ఇంకా సంసారము యావ తగ్గకపోతే ఎలా? ఇప్పటికైనా మేల్కొని సత్ చింతన చేయండి.**

**భజ గోవిన్దం భజ గోవిన్దం గోవిన్దం భజ మూఢమతే।**
**సంప్రాప్తే సన్నిహితే కాలే న హి న హి రక్షతి డుకృఞ్కరణే॥**
**ద్వాదశమఞ్జరికాభిరశేషః కథితో వైయాకరణస్యైషః।**
**ఉపదేశోऽభూద్విద్యానిపుణైః శ్రీమచ్ఛఙ్కరభగవచ్ఛరణైః॥**

శ్రీ శంకరభగవత్పాద విరచిత ద్వాదశమంజరికా స్తోత్రము ఇక్కడతో అయినది. మంజరికా అనేది సంస్కృతభాషలో ఒక ఛందస్సు. ఆ ఛందస్సులో అందించబడిన పన్నెండు కుసుమాల గుచ్ఛం కనుక ద్వాదశ మంజరికా స్తోత్రము అయింది.

**శృతిస్మృతిపురాణానామ్ ఆలయం కరుణాలయమ్।**
**నమామి భగవత్పాదం శంకరం లోకశంకరమ్॥**

* * *

# స్వామీజీ సూక్తిముక్తావళి

హెూరున వాన కురుస్తుంటే, మీరు వానను ఆపలేరు కాని, రెయిన్‌కోట్ వేసుకుని వెళితే తడవకుండా వెళ్ళగలరు. జ్ఞానం శక్తి; జ్ఞానం రక్షణ; జ్ఞానం అన్ని సమస్యలకూ పరిష్కారం. ఆఖరికి శారీరక సమస్యలను కూడా తొలగిస్తుంది. ఎందుకంటే జ్ఞానం మన మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. మన అనారోగ్యానికి సగం కారణం మానసిక దౌర్బల్యమే కాబట్టి. ఎప్పుడైతే మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందో, అప్పుడే శారీరక ఆరోగ్యం కూడా మెరుగు పడుతుంది.

* * *

# చర్పటపంజరికా శ్లోకముల వ్యాఖ్యానము

ద్వాదశమంజరికా స్తోత్రము తరువాత శంకరుల శిష్యులు ఒక్కొక్కరు ఒకొక్క శ్లోకం చొప్పున పదునాలుగు శ్లోకాలు చెబుతూ భజగోవింద ప్రకరణగ్రంథాన్ని పూర్తి చేశారు. వీటిని చర్పటపంజరికా స్తోత్రము అంటారు. శిష్యులు చెప్పిన చర్పటపంజరికా శ్లోకాలు ఆదిశంకరులు విని శిష్యులకు, సంస్కృత పండితులకు దీవెనలుగా మరొక ఐదు శ్లోకాలు చెప్పి గ్రంథ ఉపసంహారము చేశారు -

**శ్లోకము - 13**

**కా తే కాన్తా ధనగతచిన్తా, వాతుల కిం తవ నాస్తి నియన్తా।**
**త్రిజగతి సజ్జనసంగతి రేకా, భవతి భవార్ణవతరణే నౌకా॥**

| | |
|---|---|
| **వాతుల** | = మూర్ఖుడా! |
| **తే కాన్తా కా?** | = ఎవరు నీ భార్య? |
| **ధనగతచిన్తా** | = ఖర్చయిపోయిన ధనంగురించి చింత ఎందుకు? (ఏమి లాభం?) |
| **తవ నియన్తా నాస్తి కిం?** | = నిన్ను శాసించేవారెవరు లేరా? (నీకు మంచి బోధించే వారు లేరా?) |
| **త్రిజగతి సజ్జనసంగతిః ఏకా** | = మూడు లోకాలలోనూ (కాలాల్లోనూ) సజ్జన సాంగత్యము ఒకటే |
| **భవార్ణవతరణే నౌకా భవతి** | = భవసాగరము దాటించే నౌక |

**పదచ్ఛేదం -** **కా, తే, కాన్తా, ధనగతచిన్తా, వాతుల, కిం, తవ, నాస్తి, నియన్తా। త్రిజగతి, సజ్జనసంగతిః, ఏకా, భవతి, భవార్ణవ, తరణే, నౌకా॥**

**అన్వయమ్ -** **(హే) వాతుల! తే కాన్తా కా? ధనగతచిన్తా (కిమర్థమ్)? తవ నియన్తా నాస్తి కిం? త్రిజగతి సజ్జనసంగతిః ఏకా భవార్ణవతరణే నౌకా భవతి॥**

**తాత్పర్యం -** ఓ మూర్ఖుడా! నీ భార్య ఎవరు? గతించిన ధనం గురించి చింత ఏమి లాభం? ధనం గురించి, గతం గురించి చింతచేసి ఏమి ప్రయోజనం? మూడు కాలాల్లోనూ సజ్జనసాంగత్యము ఒకటే భవసాగరమునుండి దాటించే నౌక.

శంకరభగవత్పాదుల బోధ అనంతరం వారి శిష్యులు అదే బాణిలో శ్లోకాలు చెప్పడం మొదలు పెట్టారు.

ప్రస్తుత శ్లోకం శంకారాచార్య శిష్యులలో ముఖ్యుడు **పద్మపాదులవారు** ఆశువుగా చెప్పినది. పద్మపాదాచార్యులకు గురుభక్తి మెండుగా ఉంది.

ఒకరోజు వారు గంగకు ఆవలి ఒడ్డున ఉన్నారు. గురువుగారు శంకరులు రమ్మని సైగచేసేసరికి వేరే ఆలోచనే లేకుండా గంగవైపు నడవటం మొదలు పెట్టారు. మధ్యలో గంగ ఉంది. వారు చూసుకోకుండా గంగలోకి అడుగు పెట్టారు. గంగలో మునిగిపోయే పరిస్థితి. వారి గురుభక్తికి గంగమ్మ పులకరించింది. పద్మపాదులు మునిగి పోకుండా అడుగు అడుగుకు ఒక పద్మాన్ని నీటిపైకి తెచ్చి పద్మపాదుల పాదాలు ఆ పద్మంలో మోపేలా చేసి పద్మపాదులు మునగకుండా గంగను దాటేలా చేసింది. అప్పటినుంచి వారికి పద్మపాదులు అనే పేరు సార్థకమైంది. వీరు శంకరులు స్థాపించిన, దేశానికి తూర్పున పూరిలో ఉన్న గోవర్ధన పీఠానికి మొదటి ఆచార్యులు. ఇక్కడ ఋగ్వేదము ప్రధానముగా స్వీకరించబడింది. **ప్రజ్ఞానం బ్రహ్మ** అనేది ఈ వేదములోని మహావాక్యము.

పద్మపాదులు భవబంధాలకు అతీతమైన ఆ భగవంతుని దృష్టి అలవరచుకోమని మళ్ళీ చెపుతున్నారు. ఎవరు నీ భార్య? ఎప్పటిదీ బంధము? ఖర్చయిపోయిన ధనం గురించి చింత చేయకు. అనుభవించే ఈ క్షణమే నీది, దానిని సద్వినియోగము చేసుకో. నిన్ను సరిదిద్దే పెద్ద వారెవరు లేరా అని వాపోతున్నారు పద్మపాదులు.

దీని అర్థం భార్యా పిల్లలను ద్వేషించమని కాదు. మనవడు వడిలోకి వచ్చి కూర్చుంటే తోసేయమనీ కాదు. గృహస్థుగా సంసారబాధ్యత నిర్వహిస్తూనే మన లక్ష్యం మరిచిపోకుండా లక్ష్యసాధనలో కృషి చేయాలి. మానసికంగా పారమార్థిక లక్ష్యానికి పెద్దపీటవేయాలి.

ఒక రాజుగారు జనరంజకంగా ధార్మికంగా ప్రజాపాలన చేస్తున్నాడు. దైవభక్తితో రోజూ నిత్యం భగవంతుని స్మరిస్తూ ఉన్నాడు. ఆయన సత్ప్రవర్తనను మెచ్చి భగవంతుడు ఆయనను ఏదైనా కోరిక ఉంటే కోరుకోమన్నాడు. ప్రజాశ్రేయస్సే ప్రధానంగా ఉన్నవాడు కనుక రాజు నాకేమి కోరిక లేదు, నా ప్రజలకు కనిపించి వారి కోరికలు తీర్చమన్నాడు. అదెలా కుదురుతుంది? నీ ప్రవర్తనకు మెచ్చి నీకు వరమివ్వాలనుకున్నాను అన్నాడు భగవంతుడు. నా ప్రజలకు కనబడి వారి కోరికలు తీర్చమని రాజు పట్టుబట్టాడు. సరే రేపు ప్రొద్దుటే ఆ ఊరులోని కొండమీద గుడిదగ్గరకు వస్తే వారికి దర్శనమిచ్చి వారి కోరిక తీరుస్తానన్నాడు భగవంతుడు.

రాజు ఈ విషయమే చాటింపు వేయించాడు. రాణితో సహా, ప్రజలతోపాటు ఉదయమే కొండ ఎక్కడం మొదలు పెట్టాడు.

కొండ మలుపు తిరగ్గానే కొండ చరియనుంచి జలజలా వెండి నాణేలు రాలడం మొదలు పెట్టాయి. రాజు గారి ప్రజలు సగం మంది రాజు విషయం, భగవంతుడి విషయం మరిచి వెండి నాణేలు ఏరుకోవటం మొదలు పెట్టారు. మరొక మలుపొచ్చింది ఈసారి బంగారు నాణేలు రాలాయి. మిగతా జనం వాటిని ఏరుకోడానికి ఆగిపోయారు. రాణి గారు, రాజు గారు మిగిలారు. నిస్పృహతో రాజు కనీసం నువ్వన్నా భగవదర్శనం చేసుకోవచ్చు అన్నారు.

ఇంతలో కొండ పైనుంచి వజ్రాలు రాలడం మొదలైంది. రాణి గారు రాజు గారిని పట్టించు కోకుండా వజ్రాలు ఏరుకోడానికి ఆగిపోయింది. వేరే గత్యంతరం లేక రాజు ఒక్కడు గుడికి చేరుకున్నాడు. 'రాజా ఏరి నీ బంధుజనం?' అడిగాడు భగవంతుడు. రాజుకు ప్రజల అవివేకం అర్థమైంది. మాయా కల్పితమైన నాణేలు, వజ్రాలు భగంవంతుడితో పాటు మాయమయ్యాయి.

పద్మపాదులు అవివేకంనుంచి బయటపడటానికి మనకు ఒక చిట్కా చెపుతున్నారు. 'మూడుకాలాల్లోను సజ్జనసాంగత్యమే మిమ్మల్ని సన్మార్గంలో పెట్టేది. కాబట్టి సజ్జనుల సాంగత్యం పెంచుకోండి. అది మిమ్మల్ని శ్రోత్రియుడు బ్రహ్మనిష్ఠుడైన గురువు దగ్గరకు తీసుకువెళుతుంది. ఆ గురువు చెప్పే మహావాక్యాల నిష్ఠవల్ల మీకు జీవన్ముక్తి, విదేహముక్తి కలుగుతాయి.'

**నాహం దేహో నేన్ద్రియాణ్యన్తరఙ్గో।**
**నాహంకారః ప్రాణవర్గో న బుద్ధిః।**
**దారాపత్యక్షేత్రవిత్తాదిదూరః।**
**సాక్షీ నిత్యః ప్రత్యగాత్మా శివోఽహమ్॥**

నేను దేహము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, అహంకారము, చిత్తములు, పంచప్రాణములు కాను. కళత్ర, పుత్ర, క్షేత్రములు కాను. (భార్య, పుత్ర, క్షేత్రములు కాను అంటే నిజానికి అవి కూడా నావి కావు). నేను కేవలం సాక్షిని, నిత్యమైన ప్రత్యగాత్మను. నేను సచ్చిదానందరూపమైన శివుడను.

**సారాంశము – బంధువులు మోక్షాన్నివ్వరు సరికదా రాగంతో, మోహంతో బంధిస్తారు. ధనం మోక్షాన్నివ్వదు. చింతలు తెస్తుంది. సత్పురుషుల సాంగత్యంతో నీకు మోక్షమార్గం దొరుకుతుంది.**

## శ్లోకము - 14

**జటిలో ముణ్డీ లుఞ్ఛితకేశః, కాషాయామ్బరబహుకృతవేషః**
**పశ్యన్నపి చ న పశ్యతి మూఢః, ఉదరనిమిత్తం బహుకృతవేషః॥**

**జటిలో ముణ్డీ లుఞ్ఛితకేశః** = జటలుతో ఒకరు, ముండనముతో ఒకరు, కేశములు ఊడతీసుకుని మరికొందరు
**కాషాయామ్బరబహుకృతవేషః** = కాషాయ దుస్తులతో అనేక వేషాలతో
**ఉదరనిమిత్తం బహుకృతవేషః** = పొట్టకూటికి వేషధారణ అన్నట్టుగా ఉంది
**మూఢః** = మోహితుడైన మూఢుడు
**పశ్యన్నపి చ న పశ్యతి** = (భగవంతుడు అంతటా) కన్పిస్తున్నా చూడలేకున్నాడు

**పదచ్ఛేదమ్ - జటిలః, ముణ్డీ, లుఞ్ఛిత-కేశః, కాషాయామ్బర-బహుకృతవేషః,పశ్యన్, అపి, చ, న, పశ్యతి, మూఢః, ఉదరనిమిత్తం, బహుకృతవేషః॥**

**అన్వయమ్ - జటిలః (వా) ముణ్డీ (వా) లుఞ్ఛితకేశః (వా) కాషాయామ్బరబహుకృతవేషః (వా) మూడః,పశ్యన్ అపి చ న పశ్యతి। ఉదరనిమిత్తం హి (ఏషః) బహుకృతవేషః॥**

**తాత్పర్యం -** జటాధారిలా ఒకరు, ముండనంతో ఒకరు, కేశములు ఊడదీసుకుని మరొకరు కాషాయదుస్తులతో అనేక వేషాలతో ఉన్నారు. వీరంతా పొట్టకూటికోసం ఈ రకరకాల వేషధారణలతో ఉన్నారనిపిస్తుంది. సర్వత్రా భగవంతుడు కన్పిస్తున్నా మూఢుడు చూడలేకున్నాడు.

ఈ శ్లోకాన్ని **తోటకాచార్యులు** అందించారు. వీరు శంకరుల శిష్యులలో ముఖ్యులు. తోటకాచార్యులు ఉత్తరభారతమున బదరిదగ్గర జ్యోతిర్మఠమనే శంకరమఠమునకు మొదటి పీఠాధిపతులు. ఈ మఠమును అక్కడ వారు జోషీ మఠమని పిలుస్తారు. ఇక్కడ వేదము అథర్వణ వేదము. మహావాక్యము **అయమాత్మా బ్రహ్మ.**

వీరు శిష్యులుగా శంకరభగవద్పాదులతో అంతేవాసిగా ఉండి విద్యనభ్యసించేవారు. తోటకులు కొంచము మందకొడిగా ఉండేవారు. మందబుద్ధితో చురుకుతనం తక్కువ ఉండేది. వీరి తెలివితక్కువతనము మిగతా శిష్యులకు పరిహాసముగా ఉండేది.

ఒకరోజు ఉదయం ఆదిశంకరలు తన శిష్యులకు పాఠం చెప్పడానికి ఉపక్రమించబోయి తోటకులు రాలేదని, తోటకుని రాకకోసం పాఠం మొదలుపెట్టకుండా వేచి ఉన్నారు. దాంతో వారి శిష్యులలో ఒకరు పరిహాసంగా తోటకుడు ఉన్నా ఈ గ్రాను ఉన్నా ఒకటే అని వేళాకోళం చేశాడు.

ఈ పరిహాసానికి ఆచార్యులు శంకరులు చాలా నొచ్చుకుని తోటకునకు విద్యుత్ శక్తిని మానసికంగా ప్రసాదించారు. ఆ శక్తితో తోటకుడు గురువును ప్రశంసిస్తూ , **భవ శఙ్కర దేశిక మే శరణమ్** అనే మకుటంతో తోటకాష్టకం ఆశువుగా చెబుతూ వారిని సమీపించాడు. మిగతా వారంతా విభ్రాంతికి గురయ్యారు. ఈ అష్టకం తోటకవృత్తంలో ఉండటంవల్ల ఆయనకు తోటక నామధేయమొచ్చింది. వీరు తత్త్వమసి మహావాక్య విశ్లేషణ చేస్తూ వేదాంతసారాన్ని అందిస్తూ **శ్రుతిసారసముద్ధరణము** అనే గ్రంథము వ్రాసారు.

ఒక సన్న్యాసి ఒక నిర్జన ప్రదేశంలో చిన్న పాక వేసుకుని ప్రశాంతజీవనం గడుపుతున్నాడు. ఏకాంతంగా ధ్యానం చేసుకునేవాడు. కొన్నాళ్ళు గడిచాయి. అతని పాకలోకి ఎలుకలు ప్రవేశించాయి. మెల్లిగా ఎలుకల సంఖ్య పెరిగి పెద్ద పటాలం అయింది. అతని కౌపీనానికి (గోచీకి) కన్నాలు పెట్టాయి. దాంతో ఎలుకల బారినుండి రక్షించుకోవడానికి పిల్లిని పెంచాడు.

ఆ పిల్లిపోషణకి పాలు కావల్సి వచ్చాయి. కొన్నాళ్ళ తరువాత పాలకోసం ఒక ఆవును కొన్నాడు. ఆవురాగానే దాని పాడి చూసుకోవడం, దూడ సంరక్షణ కష్టంగా ఉంది. దానికి ఒక ఆడ పనిమనిషిని పెట్టాడు.

కొన్నాళ్ళు గడిచాయి. ఆ పనిపిల్లమీద రాగం ఏర్పడి, ఆమెను వివాహమాడాడు. ఆమెతో సంతానం కలిగింది. ఇంకేముంది అతని ఏకాంతం, ప్రశాంతజీవనం భంగమైంది. సన్న్యాసత్వం భ్రష్టుపట్టింది. సన్న్యాసి వివాహమాడకూడదు. అలాంటిది పూర్తిగా సంసారలంపటంలో మునిగిపోయాడు. తన పరమలక్ష్యమైన మోక్షం పూర్తిగా మరిచిపోయాడు.

అతని తోటి సన్న్యాసి పర్యటన ముగించుకుని చాలా కాలం తరువాత ఈ సన్న్యాసిని కలిసాడు. ఇతని గృహస్థ జీవితం చూసి ఆశ్చర్యపోయాడు. ఇదేమిటని ప్రశ్నిస్తే, అప్పుడీ సన్న్యాసి **కౌపీనరక్షణార్థం అయమ్ పటాటోపః** అని సమాధానం చెప్పాడు. కౌపీనం కాపాడుకోవడంలో ఇంత సంసారమేర్పడిందని చెప్పాడు.

అయోగ్యుడైన సన్న్యాసి, మనస్సును సంస్కరించుకోనివాడు, మనస్సుమీద అదుపు లేనివాడు, కేవలం కాషాయాంబరం ధరించి, ఒక గురువును ఆశ్రయించక, శాస్త్రపఠనం చేయక యథేచ్ఛతో వ్యవహరిస్తూ ఉంటాడు. అటువంటి సన్న్యాసులు తమకు తామే శత్రువులు, అంతే కాదు లోకానికి కూడా హాని తలపెట్టగల సమర్థులు. గురువులేని సన్న్యాసుల జోలికి వెళ్ళద్దు అంటారు పూజ్యగురుదేవులు. గురువు ఉండాలి, ఇంకా ముఖ్యంగా ఆ గురువు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడై ఉండాలి.

ఆవేశంతో ఇంట్లో వారితో చిన్న విషయానికి అలిగి సన్న్యాసం తీసుకునే వారు చాలామంది ఉంటారు. అటువంటివారు సన్న్యాస ఆశ్రమానికే చేటు. వారు, మనస్సు సంస్కరింపబడని కారణంచేత, ఒక సద్గురువు లేని కారణంచేత దురలవాట్లకు లోనవుతారు. హుక్కా, గంజాయివంటి మాదకద్రవ్యాలకు బానిసలౌతారు. కొందరు రుద్రాక్షలు అమ్ముతూ ఉంటారు. రకరకాల వ్యాపారాలలో మునిగి ఉంటారు. వారికి మోక్షం ప్రసక్తే రాదు, రానివ్వరు.

సన్న్యాసము తీసుకుంటే బ్రహ్మలోక ప్రాప్తి అని తెలిసి, వ్యాధిగ్రస్థులై మరణము ఆసన్నమయ్యే సమయంలో కొందరు మానసికంగా సన్న్యాసం తీసుకుంటారు. దాన్ని ఆపత్కాల సన్న్యాసము అంటారు. కాని కొందరు అలా సన్న్యాసం స్వీకరించాక ఆరోగ్యం తిప్పుకుని బ్రతుకుతారు. అప్పుడు వారి పరిస్థితి ఘోరంగా ఉంటుంది. ఇంట్లో ఉండలేరు. బయటకి పోయే పరిస్థితి కాదు.

అయోగ్యుడైన సన్న్యాసికన్నా, కర్మయోగమును అనుష్ఠించిన గృహస్థు చాలా నయము అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో అంటాడు.

సన్న్యాసి ఎలా ఉండాలో కైవల్యోపనిషత్తులో ఇలా వివరించబడింది.

**న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః॥**

**– కైవల్యోపనిషత్తు**

కర్మలవల్ల, సంతానమువల్ల, సంపాదనవల్ల మోక్షము రాదు. వివేక వైరాగ్యములవల్లే మోక్షము సాధించవచ్చును.

**సారాంశము – సన్న్యాసులు దంబాచారము, మిథ్యాచారము లేకుండా శాస్త్రవిహితమైన మార్గాన్ని ఆచరించి ముక్తపురుషులు కావాలి.**

## శ్లోకము - 15

**అఙ్గం గలితం పలితం ముణ్డం, దశనవిహీనం జాతం తుణ్డమ్।**
**వృద్ధో యాతి గృహీత్వా దణ్డం, తదపి న ముఞ్చత్యాశాపిణ్డమ్॥**

**అఙ్గం గలితం** = శరీరం కృశిస్తోంది
**పలితం ముణ్డం** = జుట్టు ఊడి తలంతా గుండు అయిపోయింది
**దశనవిహీనం జాతం తుణ్డమ్** = పళ్ళన్నీ ఊడి బోసినోరైంది
**దణ్డం గృహీత్వా వృద్ధో యాతి** = కఱ్ఱపట్టుకుని వృద్ధుడు వెళుతున్నాడు
**తదపి న ముఞ్చత్యాశాపిణ్డమ్** = ఇటువంటి పరిస్థితిలో కూడా యావ, ఆశ చావదు

**పదచ్ఛేదమ్ -** **అఙ్గం, గలితం, పలితం, ముణ్డం, దశనవిహీనం, జాతం, తుణ్డమ్। వృద్ధః, యాతి, గృహీత్వా, దణ్డం, తత్, అపి, న, ముఞ్చతి, ఆశాపిణ్డమ్॥**

**అన్వయమ్ -** **అఙ్గం గలితం। ముణ్డం పలితం। దశనవిహీనం తుణ్డమ్ జాతం। వృద్ధః దణ్డం గృహీత్వా యాతి। తదపి సః ఆశాపిణ్డమ్ న ముఞ్చతి॥**

**తాత్పర్యం -** శరీరం కృశిస్తోంది. తల బట్టతలగా మారింది. నోటిలో పళ్ళు ఊడిపోయి బోసి నోరైంది. వృద్ధుడు కఱ్ఱతో వెళుతున్నాడు. అయినా యావ, ఆశ చావలేదు.

తలలు బోడులైన తలపులు బోడులవునా అంటారు. శరీరం శుష్కించింది, తలమీద ఒక్క వెంట్రుక కూడా లేదు. ముసలివాడు కఱ్ఱ ఆసరాతో అడుగులో అడుగువేసుకుంటూ వస్తున్నాడు. కూర్చోడం ఒక బృహత్కార్యం, నుంచోడం మరో బృహత్కార్యం అన్నట్టుగా ఉంది. దైవచింతన లేనే లేదు. 'తాతా! పెళ్ళి చేసుకుంటావా?' అంటే 'నాకెవరు పిల్లనిస్తార్రా?' అంటాడే గాని 'ఈ వయసులో పెళ్ళేమిటి?' అనడు. యయాతి ముసలితనంలో మరొక యౌవనం కావాలనుకున్నాడు. ఇదీ మానవ నైజము.

ఈ శ్లోకాన్ని **హస్తామలకులవారు** అందచేశారు. శంకరులు దక్షిణాదిన పర్యటన చేస్తూంటే బ్రాహ్మణదంపతులు తమ పుత్రునితో శంకరులను సమీపించి,

'స్వామీ! వీడు పుట్టిన దగ్గరనుంచి మాట్లాడటం లేదు. దయచేసి పరీక్షించండి,' అని వేడుకుంటారు. శంకరభగవత్పాదులు, 'నాయనా! నువ్వెవరవు?' అని ఆ బాలుని ప్రశ్నిస్తారు.

దానికి ఆ బాలుడు వేదాంతసారాన్ని రంగరించి సమాధానం చెబుతాడు.

**నాహం మనుష్యో న చ దేవ యక్షౌ న బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాః॥**
**న బ్రహ్మచారీ న గృహీ వనస్థో భిక్షుర్న చాహం నిజబోధరూపః॥**

నేను మనుష్యుణ్ణి కాను, దేవతను కాను, యక్షుణ్ణి కాను, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రవర్ణములకు చెందిన వాడను కాను. బ్రహ్మచారిని కాను, గృహస్థును కాను, వానప్రస్థిని కాను, సన్న్యాసిని కాను. శుద్ధచైతన్యమును నేను.

అంతే కాదు **స నిత్యోపలబ్ధిస్వరూపోఽహమాత్మా** అనే మకుటంతో పన్నెండు శ్లోకాలలో వేదాంత సారము చెప్తాడు.

ఆచార్యులు శంకరులు చాలా ఆనందపడి ఆ బాలునకు హస్తామలకుడు అని పేరు పెట్టి తన శిష్యుడుగా స్వీకరిస్తారు.

హస్త ఆమలకము అంటే అరచేతిలో ఉసిరికాయ ఎంత స్పష్టముగా కనిపిస్తుందో, ఆత్మతత్త్వమును అంత స్పష్టముగా చెప్పాడని శిష్యునికి ఆ నామకరణము చేశారు.

హస్తామలకుడు చెప్పిన ఈ శ్లోకాలకు వారి గురువైన శంకరులు భాష్యము వ్రాసారు. ఇది చాలా అపురూపమైన విషయము. హస్తామలకుడు పశ్చిమ భారతమున ఉన్న ద్వారక పీఠమునకు మొదటి పీఠాధిపతి. ఈ పీఠమునకు వేదము సామవేదము. మహావాక్యము **తత్త్వమసి.**

చాలా మందిని చూస్తూ ఉంటాము. ఆఖరి క్షణము దాకా సంపాదనలో మునిగి ఉంటారు. పని చేయకుండా ఉండలేమంటారు. భగవంతుడి ధ్యాసే ఉండదు. సంసార లంపటం పెంచుకుంటూ పోతారు. మనతో కూడా వచ్చేది చిల్లిగవ్వ లేదని తెలిసినా అదొక వ్యసనంలా, సంపాదనే పరమావధి అన్నట్టు బతికేస్తారు. అలా లౌకికజీవితం సాగిస్తూ సాగిస్తూ రాలిపోతారు. దేముడిచ్చిన ఈ దేహమనే అమూల్యమైన కానుకను దురుపయోగము చేసుకుంటారు. అలాంటి ఒక వ్యాపారి ఒక ఊళ్ళో జీవిస్తున్నాడు. ఎంతో డబ్బు కూడబెట్టాడు. కూడ పెట్టిన డబ్బు దాచాలి. దొంగలపాలు కాకూడదు. దొరలపాలవకూడదు. గుప్తంగా దాచాలి.

అందుకని చాలా జాగ్రత్తగా కాపాడుకుంటూ వచ్చాడు. పిల్లలకు కూడా తన నిధి ఎక్కడ ఉందో చెప్పలేదు.

ఒకరోజు ఒక సన్న్యాసి అటుగా వెళతూ ఈ వ్యాపారిపై జాలి పడి కర్తృత్వ బోధ చేశాడు. కాని పూర్తిగా లౌకిక మార్గాన్ని ఎన్నుకున్న ఆ వ్యాపారికి దైవసంబంధమైన విషయాలు రుచించలేదు. దాంతో సన్న్యాసి తన దారిన పోయాడు.

ఒక రోజు హఠాత్తుగా గుండె జబ్బు వచ్చి ఆ వ్యాపారి మరణించాడు. ఆయన దాచిన నిధినిక్షేపాలు పిల్లలకు దక్కలేదు. ఆ వ్యాపారి వీధికుక్కలా పుట్టి ఆ యింటిని పట్టుకుని కాపలా కాస్తున్నాడు. ఆ సన్న్యాసి మళ్ళీ అటు వస్తూ కుక్కగా ఉన్న ఈ వ్యాపారిని చూసి జాలిపడి దైవచింతన కలుగచేద్దామని చూశాడు. కాని కుక్కరూపంలో ఉన్న వ్యాపారికి తన నిధిని పిల్లలకు అందచేయాలనే కోరిక బలంగా ఉంది. నిజబోధ ఎందుకు? కుక్కగా నిధికి కాపలా కాయగలడు గాని ఎవరికీ (కనీసం సన్న్యాసికి కూడా) చెప్పలేదు. అదీ పరిస్థితి.

కొన్నాళ్ళకు వారింటి ముందు రోడ్డు విశాలం చేస్తున్నారు. దానికోసం పనివారు నేలను తవ్వడంలో నిధి కూలీలకు దొరికింది. కుక్క అరుస్తూ వారిమీద పడబోతే వారు గునపంతో కొట్టి దానిని చంపేశారు.

పిన్న వయసులో దైవచింతన ఉంటే అదేదో తప్పుగానో, నేరంగానో లోకం చిత్రిస్తుంది. రిటైరయ్యాక చూద్దాము, ఇప్పుడు కాదు, ఇప్పుడు కాదు అంటూ ఆధ్యాత్మిక సాధన వాయిదా వేసేస్తారు. వయస్సు మళ్ళాక చేష్టలుడిగాక ఏమి చేయలేము, దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోమంటారు.

**దంతంబుల్పడనప్పుడే తనువునందారూఢి యున్నప్పుడే**
**కాంతాసంగము రోయనప్పుడే జరాక్రాంతంబు గానప్పుడే**
**వింతల్మేన జరింపనప్పుడే కురులెల్వెల్ల గానప్పుడే**
**చింతింపన్వలె నీ పదాంబుజములన్ శ్రీకాళహస్తీశ్వర!**

**– శ్రీకాళహస్తీశ్వర శతకము**

శ్రీకాళహస్తీశ్వర! పళ్ళూడక ముందే, తల నెరవక ముందే, శరీరంలో పటుత్వము పోనప్పుడే, స్త్రీలు ఈసడించుకోక ముందే, ముసలితనం ముదరక మునుపే, వింత వింత రోగాల పాలవక ముందే నీ పాదపద్మములను ఆశ్రయించాలి

**సారాంశము – రేపో మాపో అని ఆధ్యాత్మిక సాధనను వాయిదా వేయకుండా ఈ క్షణమే సాధన మొదలు పెట్టాలి.**

## శ్లోకము - 16

**అగ్రే వహ్నిః పృష్ఠే భానుః, రాత్రౌ చుబుకసమర్పితజానుః।**
**కరతలభిక్షస్తరుతలవాసః, తదపి న ముఞ్చత్యాశాపాశః॥**

**అగ్రే వహ్నిః** = ముందు చలి మంట
**పృష్ఠే భానుః** = వీపుమీద భానుకిరణాల వేడి
**రాత్రౌ చుబుకసమర్పితజానుః** = రాత్రి సమయంలో చుబుకం మోకాలికి ఆన్చి (పడుకుంటున్నాడు)
**కరతలభిక్షః** = భిక్షాటనకు పాత్ర కూడా లేదు చేతితోనే భిక్ష స్వీకరిస్తాడు
**తరుతలవాసః** = చెట్టు మొదలులోనే శయనం
**తదపి న ముఞ్చత్యాశాపాశః** = (ఇంతటి నిరాడంబర జీవితం గడిపినా) ఆశాపాశం మాత్రం వదటం లేదు

**పదచ్ఛేదమ్-** **అగ్రే, వహ్నిః, పృష్ఠే, భానుః, రాత్రౌ, చుబుకసమర్పిత, జానుః। కరతల-భిక్షః, తరుతల-వాసః, తత్, అపి, న, ముఞ్చతి, ఆశాపాశః॥**

**అన్వయమ్ -** **(కస్యచిత్) అగ్రే వహ్నిః (భవతి)। (తస్య) పృష్ఠే భానుః (భవతి)। (సః) రాత్రౌ చుబుకసమర్పిత జానుః (భవతి)। (సః) కరతలభిక్షః (భవతి)। (సః)తరుతలవాసః (భవతి)। తత్ అపి ఆశాపాశః తం న ముఞ్చతి॥**

**తాత్పర్యం -** ముందు చలిమంట, వీపుమీద భానుకిరణాలు, రాత్రి సమయంలో చుబుకం మోకాలికి ఆన్చి (పడుకుంటున్నాడు) భిక్షాటన పాత్ర కూడా లేదు, చేతిలో భిక్ష స్వీకరిస్తాడు. చెట్టు మొదలులోనే శయనం. (ఇంతటి నిరాడంబర జీవితం గడిపినా) ఆశాపాశం మాత్రం వదలలేదు.

ఈ శ్లోకాన్ని **సుబోధ** అనే శంకర భగవత్పాదుల శిష్యులు అందించారు. ఈ శిష్యుల వివరాలు అందుబాటులో లేవు.

సన్న్యాసిగా ఎంతో కఠినమైన జీవనాన్ని సాగిస్తున్నా మనకు తెలియకుండానే రాగద్వేషాలు మనను లోబరుచు కుంటాయి. ఆ విషయమే సుబోధ ఈ శ్లోకంలో ప్రస్తావిస్తున్నారు.

ఒక ఊళ్ళోకి ఏకాంబరి అనే సాధువు వచ్చాడు. ఆయన ఏకవస్త్రం ధరించేవాడు. ఆయన చాలా నిరాడంబరి. ఎవరి విషయంలోను తలదూర్చేవాడు కాదు. ఏకాంతంగా దైవచింతన చేస్తూ భిక్షాటనం చేసుకునేవాడు. భిక్షాటనకు ఒక పాత్రకూడా లేదు. చేతిలోకే భిక్ష తీసుకునేవాడు. భిక్షగా వచ్చిన అన్నం ఊరి బయట ఉన్న ఒక బండమీద కూర్చుని, ఆ బండమీదే పెట్టుకుని తినేవాడు. పక్కనే ఉన్న చెట్టుకింద పడుకునేవాడు. ఇల్లు, సంసారం లేని సన్యాసి జీవనం గడిపేవాడు. ఆయనను ఆ ఊరిలోని వాళ్ళంతా గౌరవంగా చూసేవారు. ఏకాంబరికి ఒక పాక కట్టి పెడతామన్నా కూడా ఆయన నిరాకరించి అలాగే నిరాడంబర జీవితం కొనసాగించాడు. ఇలా చాలా ఏళ్ళు గడిచాయి.

ఒక రోజు అదే ఊరులోకి కౌపీనాంబరి అనే మరొక సాధువు వచ్చాడు. కౌపీనమే అతని వస్త్రం, ఏకాంబరిలాగే నిరాడంబరి. ఇతను దేశపర్యటనం చేస్తాడు. ఒక ఊరిలో స్థిరంగా ఉండడు. భిక్షాటనం చేస్తూ, ఊళ్ళు తిరుగుతూ, దైవచింతనం చేస్తూ ఉంటాడు.

ఆ రోజు భిక్షాటనం పూర్తి చేసుకుని ఊరి చివర ఏకాంబరి కూర్చునే బండమీద కూర్చుని అన్నం తింటున్నాడు. ఇంతలో ఏకాంబరి కూడా భిక్షాటనం పూర్తి చేసుకుని తన బండ దగ్గరకు చేరాడు. తన బండమీద మరొక సాధువు కూర్చోడం చూడగానే అంతులేని కోపం ఆవేశించింది ఏకాంబరిలో. తన బండను కౌపీనాంబరి దురాక్రమణ చేస్తున్నాడని కౌపీనాంబరిని కాలుతో తన్నాడు.

చూడండి!!! అంతవరకు లేని బంధకత్వం ఆ బండమీద వచ్చేసింది. మనలో కూడా సత్సంగసభ్యులు రోజూ ఒకే చోట కూర్చుంటారు. వారి స్థానంలో మరొకరిని కూర్చోనివ్వరు. ఇదే బంధకత్వం.

రాగద్వేషాలు పూర్తిగా సమసిపోవు. వాటిని ఎప్పటికప్పుడు గమనిస్తూ మన అదుపులోకి తెచ్చుకోవాలి.

వాటికి మనం లొంగిపోకూడదు. అవి దారి దోపిడీదొంగలు, మనను తప్పుదోవ పట్టిస్తాయి అంటారు శ్రీకృష్ణపరమాత్మ.

**ఇంద్రియస్యేంద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ ।**
**తయోర్నవశమాగచ్ఛేత్తౌ హ్యస్య పరిపంథినౌ ॥ గీత 3- 34**

ప్రతి ఇంద్రియముయొక్క విషయమునందు రాగము, ద్వేషము సర్వదా కలిసియే (తప్పనిసరియై) ఉన్నవి. ఆ రెండింటికీ వశము కారాదు. ఏలయన, అవి రెండు ఈ మానవునకు దాగియుండి దెబ్బ తీసే తస్కరులు.

**సారాంశము - రాగద్వేషాలను ఒక కంట కనిపెడుతూ వాటిని అదుపులో పెట్టుకోవాలి.**

### శ్లోకము - 17

**కురుతే గఙ్గాసాగరగమనం, వ్రతపరిపాలనమథవా దానమ్।**
**జ్ఞానవిహీనస్సర్వమతేన, భజతి న ముక్తిం జన్మశతేన॥**

**గఙ్గాసాగరగమనం కురుతే** = గంగాసాగర గమనం (స్నానం) చేసినా
**వ్రతపరిపాలనమథవా దానమ్** = వ్రతాలు, ధానధర్మాలు చేసినా
**జ్ఞానవిహీనస్సర్వమతేన** = జ్ఞానము లేని వాడికి అన్నీ తెలిసినా
**జన్మశతేన** = వంద జన్మలెత్తినా
**ముక్తిం న భజతి** = ముక్తి రాదు

**పదచ్ఛేదమ్ - కురుతే, గఙ్గాసాగరగమనం, వ్రతపరిపాలనమ్, అథవా, దానమ్। జ్ఞానవిహీనః,సర్వమతేన, భజతి, న, ముక్తిం, జన్మశతేన॥**

**అన్వయమ్ - (కశ్చిత్) గఙ్గాసాగరగమనం, వ్రతపరిపాలనమ్ అథవా దానమ్ కురుతే। (సః) జ్ఞానవిహీనః (చేత్) సర్వమతేన జన్మశతేన (అపి) ముక్తిం న భజతి।**

**తాత్పర్యం -** గంగాస్నానాలు చేసినా, వ్రతాలు చేసినా, దానాలు చేసినా జ్ఞానవిహీనుడైతే వంద జన్మలెత్తినా ముక్తి రాదు.

ఈ శ్లోకాన్ని సురేశ్వరాచార్యులు రచించారు. వీరు దక్షిణభారతంలోని శృంగేరీపీఠానికి మొట్టమొదటి పీఠాధిపతులు. ఇక్కడి వేదం యజుర్వేదం. మహావాక్యం **అహం బ్రహ్మ అస్మి.**

సురేశ్వరాచార్యులు వేదపూర్వంలో దిట్ట. వీరు యజ్ఞయాగాదుల విషయాలలో ఆరితేరినవారు. కర్మవల్లనే మోక్షము అనే భావనలో ఉండేవారు. వీరికీ శంకరాచార్యులకూ వాదోపవాదాలు జరిగాయి. చివరికి సురేశ్వరులు శంకరులు చెప్పినదే సత్యమని గ్రహించి, ఆదిశంకరులను అనుసరించి వారి శిష్యులై, శంకరభాష్యాలకు వార్తికాలు, ఉపభాష్యాలు వ్రాసారు. వీరు

బృహదారణ్యకోపనిషత్తు శంకరభాష్యముమీద వార్తికాలు వ్రాశారు. వీరిని వార్తిక కారుడు అంటారు.

మనిషి ఏం చేసినా శాంతి, సుఖం, భద్రతకోసమే చేస్తూంటాడు. అవి వస్తువుల్లోనూ, పరిస్థితుల్లోనూ, మనుషుల్లోనూ, సంఘటనల్లోనూ ఉందనుకుంటాడు. తన స్వరూపమే శాంతి, సుఖం, భద్రత అని తెలుసుకోక, బాహ్యంగా పరుగులు తీస్తూంటాడు. కస్తూరిమృగం తనలో సువాసన పెట్టుకుని బయట ఎక్కడో ఉందని వెతికి, వెతికి; అలసి, సొలసి చనిపోతుందిట. సరిగ్గా మనిషి కూడా అలానే చేస్తాడు. తనే ఆనందస్వరూపం అని గ్రహించడు.

కుండకు ఎవరో చెప్పారు. నీ గురించి నువ్వు తెలుసుకో! స్వరూపంగా నువ్వెవరో తెలుసుకో! స్వరూపతః నువ్వు మట్టివి. మట్టిని తెలుసుకుంటే, వెంపర్లాట, ఆరాటం పోయి జీవన్ముక్తి పొందుతావు అని చెప్పారు. వెంటనే కుండ మూటముల్లే సర్దుకుని స్వరూపంగా మట్టిని చూద్దామని చార్‌ధామ్ యాత్రకు బయలు దేరింది. యాత్ర అంతా పూర్తి అయింది కాని **స్వరూపంగా మట్టి** మాత్రం కనపించలేదు.

యజ్ఞ యాగాదులు చేసింది మట్టి జాడే తెలియలేదు.

ధ్యానం చెయ్యాలన్నారెవరో! ధ్యానం లోనూ మట్టి కనపడలేదు.

కుండ మట్టిని వెతకాలి. ఎలా?

మట్టి ఎక్కడ ఉంది? కుండలోపల ఉందా?

కుండ బయట ఉందా?

కుండ మధ్యలో ఉందా?

అసలు కుండకు మట్టికి దూరం ఎంత?

కుండ అంతటా మట్టే. మట్టి తప్ప కుండే లేదు. కుండకు, మట్టికి దూరం ఏమిటి? అవి రెండు వస్తువులైతే కదా! మట్టినే కుండ అంటున్నాం. కుండగా పరిమితత్వం, అల్పత్వం, అశాశ్వతత్త్వం ఉన్నాయి. అదే మట్టిగా అపరిమితత్వం, అనల్పత్వం, శాశ్వతత్త్వం ఉన్నాయి. అదే జీవన్ముక్తి. ఇప్పుడు కుండ ఏం చేయాలి?

అంతటా వెతకాలా?

పూజలు చేయాలా?

ధ్యానం చేయాలా?

నేనే మట్టిని అని తెలుసుకుంటే చాలు. కుండ తయారుకాక ముందూ మట్టే, కుండగానూ మట్టే, కుండ పగిలినా మట్టే. మట్టిగా దానిలో ఏ మార్పు లేదు. దానికి పుట్టుకా లేదు. మరణం లేదు. అదే కుండయితే మరణం, పుట్టుక తప్పవు.

అదే మాదిరిగా జీవుడు తను స్వరూపతః బ్రహ్మను అని తెలుసుకుంటే, తనే ఆనందస్వరూపమని తెలుసుకుంటాడు. అదే జీవన్ముక్తి. జీవుడు ఎప్పుడూ ముక్తుడే. ఆ విషయం తెలుసుకోవడమే తరువాయి. దీనినే శాస్త్రం **ప్రాప్తస్య ప్రాప్తం** అంటుంది. **మోక్షం సిద్ధవస్తువు, సాధ్యవస్తువు కాదు.**

**వేదాంతంలో ఐదు మౌలికమైన సూత్రాలున్నాయి.**

1. శాశ్వతమైన శాంతి, ఆనందము, భద్రత మోక్షమువల్ల మాత్రమే సాధ్యమవుతుంది.
2. మోక్షము ఆత్మజ్ఞానమువల్ల మాత్రమే సాధ్యమవుతుంది.
3. ఆత్మజ్ఞానము సాంప్రదాయ పద్ధతిలో గురుప్రాప్తి, శాస్త్రప్రాప్తితో జ్ఞానయోగ్యులకు మాత్రమే సాధ్యము.
4. జ్ఞానయోగ్యతకు చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్తవైశాల్యము అవసరము.
5. చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్తవైశాల్యం ఏర్పడడానికి అనేకమైన మార్గాలున్నాయి.

(కర్మయోగము, పంచమహాయజ్ఞాలు, ఉపాసనలు)

**కంఠ చామీకర న్యాయం –** ఒక రాజ్యంలో రాణిగారు చాలా ఖరీదైన నెక్లెస్ విదేశాలనుంచి తెప్పించుకున్నారు. అకస్మాత్తుగా ఆ నెక్లెస్ కనిపించడం లేదు. రాణిగారికి చాలా ప్రీతికరమైన నెక్లెస్ మాయమయింది. దానిమీదమోజు తీరకుండానే పోయింది. దానితో రాణిగారు విపరీతమైన ఆవేదన చెందారు. సేవకులతో రాజప్రాసాదమంతా అడుగడుగునా గాలింపు చేయించారు.

ఎంతవెతికినా ప్రయోజనం కన్పించ లేదు. మంత్రి ఏమైనా మార్గం చూపుతాడేమోనని పిలిపించారు. మంత్రిగారికి విషయం వాకబు చేస్తే రాణిగారి నెక్లెన్ పోయిందని తెలిసింది. రాణిగారిని చూడగానే మంత్రిగారికి నెక్లెస్ జాడ తెలిసిపోయింది. వెంటనే మంత్రి, 'అమ్మా మీ సేవకులను వెతకడం ఆపమనండి,' అన్నారు.

మంత్రి తెలివితేటలమీద అచంచలమైన విశ్వాసం ఉన్న రాణిగారు చప్పట్లు కొట్టి నెక్లెస్ గురించి వెతకడం ఆపింది.

"అమ్మా రాణిగారూ! మీ మెడను ఒకసారి తడుముకోండి,' అన్నారు మంత్రి. అప్పుడు రాణిగారికి మెడ తడుముకోకుండానే నెక్లెస్ బరువు తెలిసింది. ఆమె తన

మెడలోనే నెక్లెస్‌ను పెట్టుకుని, ఊరంతా వెతుకుతోంది. తనదగ్గరే వున్న నెక్లెస్ బయట ఎలా దొరుకుతుంది? విశ్వమంతా ఎంత వెతికినా దొరకదు. ఈ సమస్యకు పరిష్కారం – నెక్లెస్ పోయింది అనే అజ్ఞానం తొలిగి తన దగ్గరే, తన మెడలోనే ఉందని తెలిస్తే చాలు. దీనినే కంఠ చామీకర న్యాయం అంటారు. ఇది తెలిస్తే ఇక ఎటువంటి ఆందోళన ఉండదు. కంఠ చామీకరం అంటే నెక్లెస్ అని అర్థం.

సరిగ్గా ఇలాగే జీవుడు తనే స్వరూపతః బ్రహ్మనని తెలుసుకోలేక జన్మ జన్మలనుంచి బ్రహ్మను వెతుకుతూనే ఉన్నాడు. మన దగ్గరే కోహినూర్ డైమండ్ ఉంది. దానిని అజ్ఞానంతో పేపరు వెయిట్‌లా వాడుతున్నాము.

ఏకాదశి ఉపవాసము, నామస్మరణము, మంత్రజపము, అన్నదానము యివన్నీ మంచివే. వాటివల్ల చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్తవైశాల్యము కలుగుతాయి. జ్ఞానయోగ్యత వస్తుంది.

జ్ఞానయోగ్యత వచ్చాక జ్ఞానప్రాప్తికోసం శ్రోత్రియుడైన, బ్రహ్మనిష్ఠుడైన, గురువును ఆశ్రయించి శాస్త్ర అధ్యయనం చేయాలి. శాస్త్రం, గురువు మీకు మీ స్వరూపము తెలియజేస్తారు. ఆ నిష్ఠలో ఉన్నప్పుడు మీకు జీవన్ముక్తి, విదేహముక్తి లభిస్తాయి.

**పఠన్తు శాస్త్రాణి యజన్తు దేవాన్।**
**కుర్వన్తు కర్మాణి భజన్తు దేవతాః।**
**ఆత్మైక బోధేన వినా విముక్తిః**
**న సిధ్యతి బ్రహ్మ శతాంతరేపి॥ – వివేకచూడామణి**

శాస్త్రములు అధ్యయనము చేయుదురు గాక; యజ్ఞములతో, వైదికకర్మలతో దేవతలను తృప్తి పరుతురు గాక; దేవతలను పూజాదికములతో స్తుతింతురు గాక; అహం బ్రహ్మ అస్మి అనే ఆత్మబోధ జరగకపోతే వందలకొలది బ్రహ్మకల్పములు గడిచినా మోక్షము సిద్ధించదు.

ధర్మరాజు తీర్థయాత్రలు చేయాలని సంకల్పించాడు. సోదరులు అందరు కలిసి తీర్థయాత్రలు చేద్దామని సన్నాహాలు చేశారు. శ్రీకృష్ణుడు కూడా వస్తే బాగుంటుందని, కృష్ణపరమాత్మని వారు రమ్మని వేడుకొన్నారు.

కాని కృష్ణపరమాత్మ పని భారముచేత రాలేనని చెప్పి తన బదులుగా సొరకాయనిచ్చి ఇది నా గుర్తుగా తీసుకువెళ్ళండి అన్నాడు. దీనితో నేను వచ్చినట్లే భావించండి అని మరీ చెప్పాడు. వారు వెళ్ళిన ప్రతితీర్థములోనూ సొరకాయను ముంచారు. తిరిగి వచ్చాక భద్రంగా సొరకాయను కృష్ణునికి అప్పచెప్పచూశారు.

దానికి పరమాత్మ ఈ సొరకాయను బ్రాహ్మణ సంతర్పణములో వినియోగము చేయండి అని చెప్పాడు.

దానికి పాండవులు సరేనని సొరకాయతో కూర చేయించి, సంతర్పణములో అందరికీ తలో కొంచము వడ్డించారు. శ్రీకృష్ణుని సొరకాయని, అందరూ ముందుగా సొరకాయ కూరను చవి చూచారు. అది కటిక చేదుగా ఉండి వాంతి వచ్చినంత పనయింది.

ధర్మజుడు నొచ్చుకుని కృష్ణుని సమీపించి, 'భగవాన్ అది చేదు సొరకాయని తమకు తెలియదా?' అని ప్రశ్నించాడు. నాకు తెలుసు కాని తీర్థస్నానాల తరువాత తీపి అవుతుందేమోనని ఆశించానని వ్యంగ్యంగా సమాధానమిచ్చాడు.

**సారాంశము – కర్మలవల్ల, ఉపాసనలవల్ల ఆత్మజ్ఞానము రాదు. ఆత్మజ్ఞానము శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన గురువుద్వారా, వేదాంతశాస్త్రముద్వారా మాత్రమే వస్తుంది. ఆత్మజ్ఞానము మాత్రమే మోక్షానికి మార్గము.**

## శ్లోకము – 18

**సురమన్దిరతరుమూలనివాసః, శయ్యా భూతలమజినం వాసః।**
**సర్వపరిగ్రహభోగత్యాగః, కస్య సుఖం న కరోతి విరాగః॥**

| | | |
|---|---|---|
| **సురమన్దిరతరుమూలనివాసః** | = | దేవాలయంలో కాని చెట్టు క్రిందకాని పడుకుంటాడు |
| **శయ్యా భూతలమ్** | = | అతని పక్క, భూమి |
| **అజినం వాసః** | = | చర్మం, అతని దుస్తులు |
| **సర్వపరిగ్రహభోగత్యాగః** | = | అన్ని భోగాలను త్యాగం చేసాడు |
| **కస్య సుఖం న కరోతి విరాగః** | = | అటువంటి విరాగికి ఆనందము ఎందుకు ఉండదు? |

**పదచ్ఛేదమ్ – సురమన్దిర–తరుమూలనివాసః, శయ్యా, భూతలమ్, అజినం, వాసః। సర్వపరిగ్రహ–భోగత్యాగః, కస్య, సుఖం, న, కరోతి, విరాగః॥**

**అన్వయమ్ – (కశ్చిత్) సురమన్దిరతరుమూలనివాసః (అస్తి), (తస్య) శయ్యా భూతలం, (తస్య) వాసః అజినం (సః) సర్వపరిగ్రహభోగత్యాగః (తస్య సుఖం భవతి), విరాగః కస్య సుఖం న కరోతి॥**

**తాత్పర్యం –** దేవాలయంలో కాని, చెట్టు క్రిందకాని పడుకుంటాడు. అతని పక్క భూమి. చర్మం, అతని దుస్తులు. అన్ని భోగాలను త్యాగం చేశాడు. అటువంటి

విరాగికి ఆనందము ఎందుకు ఉండదు? వైరాగ్యవంతుడైన సన్న్యాసి వస్తువుల ప్రమేయము లేకుండానే ఆనందముగా ఉంటాడు.

వైరాగ్యధనంతో అన్ని భోగాలను వదిలి వేసి ఉన్న సన్న్యాసికి గూడు, చెట్టు నీడే; శయనం క్రిమికీటకాదుల మయమైన కటిక నేల; బట్టలు జింక చర్మము. విచిత్రము ఏమిటంటే అతనికి ఎటువంటి దుఃఖము లేదు సరికదా ఆనందంతో, చిద్విలాసంతో ఉంటాడు.

ఈ శ్లోకాన్ని అందించిన వారు **నిత్యానందుడు**. వీరి వివరములు తెలియవు. ఆ రోజులలో వారు తమ పేరు గురించి ప్రాకులాడేవారు కారు.

ఇక్కడ శ్లోకములో సుఖము అంటే ఆనందము అని గ్రహించాలి. సాధారణముగా సుఖము అనేది శరీరానికి సంబంధించినది. ఆనందము మనసుకు సంబంధించినది. అన్ని సుఖాలు ఉంటాయి. ఏ సి రూమ్‌లో చాలా సుఖాన్ని అనిభవిస్తూంటాడు. కాని మనస్సు ఆవేదనతో పరితపిస్తూంటుంది. అంటే సుఖంగా బాధపడుతూంటాడు.

విరాగికి ఎటువంటి సుఖమూ లేకపోయినా హాయిగా ఉంటాడు. అతనికి ఏ కొరత, ఏ వెలితి లేదు. పూర్ణత్వాన్ని దర్శిస్తున్నాడు. ఆనందం అతని స్వభావము. అతని స్వరూపము. అందుకే సహజ సిద్ధంగా ఆనందంగా ఉన్నాడు. ఈ రోజుల్లో టీ.వీ లేకపోయినా, మొబైల్ లేకపోయినా గడవదు. అవి ఏవి లేకుండానే జ్ఞాని అమితానందంగా ఉండగలడు.

రమణ మహర్షి మనకు ఒక ఉదాహరణ. వారు కేవలము కౌపీనముతో జీవితమంతా ఎటువంటి చింతలేక ఆనందముతో గడిపారు.

తైత్తిరీయంలో మనిషి అనుభవించే ఆనందం ఏ ఏ లోకాల్లో ఎంత ఉంటుందో వస్తుంది. దీనిని ఆనంద మీమాంస అంటారు.

**సైషాऽऽనందస్య మీమాగ్ంసా భవతి। యువా స్యాత్సాధుయువాऽధ్యాయకః। ఆశిష్ఠో దృఢిష్ఠో బలిష్ఠః। తస్యేయం పృథివీ సర్వా విత్తస్య పూర్ణా స్యాత్। స ఏకో మానుష ఆనందః।**

ఆనందం స్థాయిలు తెలియచేయడానికి, మొదటగా శ్రుతి ఒక యువకుని ఎంచుకుంది. ఉదాహరణకు ఒక యువకుడు ఉన్నాడనుకుందాము. ఆ యువకుడు సాధుపుంగవుడు, సదాచారసంపన్నుడు, సంస్కారవంతుడు, శ్రుతిని చక్కగా అభ్యసించినవాడు, చురుకైనవాడు, దృఢమైన మనస్సు కలవాడు, బలిష్ఠుడు అయి

ఉంటే, అతనికి భూగోళంలోని సమస్త సంపదలు-ధనం, ఖనిజసంపద మొదలైనవి-సమకూరితే, ఎంత ఆనందంగా ఉంటాడో, ఆ ఆనందం ఒక మనుష్య ఆనందంతో సమానం అంటుంది శ్రుతి. **తే యే శతం మానుషా ఆనందాః । స ఏకో మనుష్య గంధర్వాణామానందః॥**

ఈ మనుష్య ఆనందానికి వందరెట్లు ఆనందం మనుష్యగంధర్వ ఆనందానికి సమానం. అజ్ఞాని పుణ్యఫలంతో ఆ లోకానికి చేరుకుని ఈ ఆనందం అనుభవించవచ్చు.

**శ్రోత్రియస్య చాకామహతస్య॥** మనుష్య ఆనందం వరకూ అంతా మిథ్య అని వైరాగ్యంతో ఉన్న వివేకవంతునికి, మనుష్యగంధర్వ ఆనందం ఇక్కడే లభిస్తుంది.

1 మనుష్య గంధర్వ ఆనందం = 100 రెట్లు మనుష్య ఆనందం. (ఒకటి తరువాత రెండు సున్నాలు.)

**తేయే శతం మనుష్యగంధర్వాణామానందాః॥ స ఏకో దేవగంధర్వాణామానందః॥**

ఈ మనుష్యగంధర్వ ఆనందానికి వందరెట్లు ఆనందం దేవగంధర్వ ఆనందానికి సమానం. అజ్ఞాని పుణ్యఫలంతో ఆ లోకానికి చేరుకుని ఈ ఆనందం అనుభవించవచ్చు.

**శ్రోతియస్య చాకామహతస్య॥**

మనుష్యగంధర్వ ఆనందం వరకూ అంతా మిథ్య అని వైరాగ్యంతో వున్న వివేకవంతుడుకి దేవగంధర్వ ఆనందం ఇక్కడే లభిస్తుంది. 1 దేవగంధర్వ ఆనందం = 100 రెట్లు మనుష్యగంధర్వ ఆనందం.

అంటే 1 దేవగంధర్వ ఆనందం = 10000 రెట్లు మనుష్య ఆనందం అన్నమాట.(ఒకటి తరువాత నాలుగు సున్నాలు.)

**తే యే శతం దేవగంధర్వాణామానందాః । స ఏకః పితృణాం చిరలోక లోకానామానందః॥ శ్రోత్రియస్య చాకామహతస్య॥ తే యే శతం పితృణాం చిరలోక లోకానామానందాః॥ స ఏక ఆజానజానాం దేవానా౭ మానందః॥ స ఏకః అజనజానాం దేవానా౭ మానందః॥ శ్రోత్రియస్య చాకామహతస్య॥ తే యే శతమాజానజానాం దేవానామానందాః॥ స ఏకః కర్మదేవానాం దేవానా౭ మానందః॥ యే కర్మణా దేవానప్రియన్తి॥ శ్రోత్రియస్య చాకామహతస్య॥ తే యే శతం కర్మదేవానా౭ మానందాః॥ స ఏకో దేవానా౭**

**మానందాః। శ్రోత్రియస్య చాకామహతస్య। తే యే శతం దేవానా౭ మానందాః। స ఏకో ఇంద్రస్యానందః। శ్రోత్రియస్య చాకామహతస్య। తే యే శతం ఇంద్రస్యానందాః। స ఏకో బృహస్పతేరానందః। శ్రోత్రియస్య చాకామహతస్య। తే యే శతం బృహస్పతేరానందాః। స ఏకః ప్రజాపతేరానందః। శ్రోత్రియస్య చాకామహతస్య। తే యే శతం ప్రజాపతేరానందాః। స ఏకో బ్రహ్మణ ఆనందః। శ్రోత్రియస్య చాకామహతస్య।**

రకరకాల లోకాలు, అక్కడ ఆనందము చెప్పుకుంటూ బ్రహ్మలోకము వరకు వచ్చి అక్కడ ఆనందం కూడా జ్ఞాని భూలోకంలోనే ఉంటూ వివేక వైరాగ్యల ద్వారా పొందవచ్చు అంటుంది శాస్త్రం.

ఈ విధంగా బ్రహ్మలోకములో ఆనందము మనుష్య ఆనందానికి 100000000000000000000 రెట్లు.

ప్రజాపతి ఆనందంవరకూ అంతా మిథ్య అని వైరాగ్యంతో ఉన్న వివేకవంతునికి హిరణ్యగర్భ ఆనందం ఇక్కడే భూలోకంలోనే ఇప్పుడే లభిస్తుంది.

1 హిరణ్యగర్భ ఆనందం = 100 రెట్లు ప్రజాపతి ఆనందం.

అంటే 1 హిరణ్యగర్భ ఆనందం = 100000000000000000000 రెట్లు మనుష్య ఆనందం అన్నమాట.(ఒకటి తరువాత ఇరవయి సున్నాలు.) వివేకవంతుడైన జ్ఞాని బాహ్యంగా సుఖాలు కోల్పోతున్నట్టు కన్పిస్తున్నా వైరాగ్యం స్థాయినిబట్టి ఆ ఉన్నతలోకాల ఆనందము అతనికి ఇక్కడే ఇప్పుడే లభిస్తుంది.

**మూలం తరోః కేవలమాశ్రయన్తః।**
**పాణిద్వయం భోక్తుమమన్త్రయన్తః।।**
**కన్థామివ శ్రీమపి కుత్సయన్తః।**
**కౌపీనవన్తః ఖలు భాగ్యవన్తః।। - కౌపీనపంచకమ్**

చెట్టునీడనే ఆశ్రయంగా చేసుకుని, రెండు చేతులు బిక్షాపాత్రగా కలిగి, ఐశ్వర్యమనిన విముఖత చూపించే కౌపీనదారులు సన్యాసులు, సర్వసంగపరిత్యాగులు ఎంత భాగ్యవంతులు.

**సారాంశము - సుఖాలు, సంపదలు, భోగాల వెనక ఉన్న ఆనందం కన్నా ఎన్నో రెట్లు ఎక్కువ ఆనందాన్ని వివేక వైరాగ్యములతో జ్ఞాని ఇక్కడే, ఇప్పుడే పొందగలడు.**

## శ్లోకము - 19

**యోగరతో వా భోగరతో వా, సఙ్గరతో వా సఙ్గవిహీనః।**
**యస్య బ్రహ్మణి రమతే చిత్తం, నన్దతి నన్దతి నన్దత్యేవ॥**

**యోగరతః వా భోగరతః వా** = యోగంలో ఉన్నా, భోగంలో ఉన్నా (యోగియైనా భోగియైనా)

**సఙ్గరతః వా సఙ్గవిహీనః** = నలుగురిలో ఉన్నా, ఒంటరిగా ఉన్నా

**యస్య బ్రహ్మణి రమతే చిత్తం** = ఎవని చిత్తం సదా ఆ బ్రహ్మములో రమిస్తుందో

**(సః) నన్దతి నన్దతి నన్దత్యేవ** = అతనికి ఆనందమే ఆనందము

**పదచ్ఛేదమ్ - యోగరతః, వా, భోగరతః, వా, సఙ్గరతః, వా, సఙ్గవిహీనః। యస్య, బ్రహ్మణి, రమతే, చిత్తం, నన్దతి, నన్దతి, నన్దతి, ఏవ॥**

**అన్వయమ్- యోగరతః వా భోగరతః వా సఙ్గరతః వా సఙ్గవిహీనః (భవతు)। యస్య చిత్తం బ్రహ్మణి రమతే। (సః) నన్దతి నన్దతి నన్దత్యేవ॥**

**తాత్పర్యం -** యోగంలో ఉన్నా భోగంలో ఉన్నా (యోగియైనా, భోగియైనా); సంగములో ఉన్నా, సంగవిహీనుడైనా; ఎవని చిత్తం సదా ఆ బ్రహ్మములో రమిస్తుందో, అతనికి ఆనందమే ఆనందము.

ఈ శ్లోకము **ఆనందగిరి** రచించారు. వీరు శంకరభాష్యాలకు భాష్యాలు వ్రాశారు. వీరి ఈ భాష్యాలవల్లే శంకరహృదయం అర్థమౌతుందని అంటారు. వీరు రచించిన **ఉపదేశ సాహస్రి** చాలా ప్రసిద్ధికెక్కిన గ్రంథము.

కర్మయోగములో ఉన్నా, విషయసుఖాలను అనుభవిస్తున్నా, పదిమందిలో ఉన్నా, ఏకాంతములో ఉన్నా బ్రహ్మధ్యాసలో ఉన్న నిష్ఠాపరునకు ఆనందమే ఆనందము.

అన్ని పనులు చేస్తూ బ్రహ్మధ్యాసలో ఎలా ఉండగలము? నర్తకి నెత్తిమీద కుండలు పెట్టుకుని అవి పడకుండా నాట్యము చేస్తుంది. ఆమె వేగంగా నాట్యం చేస్తున్నా కూడా నెత్తిమీదకుండలు పడిపోవు. ఆమె హావభావాలతో రకరకాల భంగిములు ప్రదర్శిస్తుంది. అభ్యాసంవల్ల నాట్యం చేస్తున్నంతసేపూ ఆమె దృష్టి నెత్తిమీద ఉన్న కుండలమీదే కేంద్రీకృతమై ఉంటుంది.

మరొక ఉదాహరణ – మనము ట్రైనులో ఢిల్లీకి వెళుతున్నాము, మధ్యలో నాగపూర్ స్టేషన్లో దిగి టీ తాగుతున్నాము. టీ తాగుతున్నంత సేపు ఒక కన్ను ట్రైనుమీద వేసి ఉంచుతాము కదా!!

అదే విధంగా జ్ఞాని ఏ పనిలో నిమగ్నమై ఉన్నా ధ్యాస మాత్రం బ్రహ్మ మీదనే ఉంటుంది.

అజ్ఞాని, ఆనందము మనుష్యులలో ఉంది అనుకుంటాడు. ఈ మనిషి నా దగ్గరే ఉండాలంటాడు. ఇద్దరు వేగంగా నడుచుకుంటూ వస్తూ ఢీకొని కింద పడ్డారు. కాసేపు కీచులాడుకుని స్నేహితులయ్యారు. విషయమేమిటంటే, వారు యిద్దరూ అంత ఉద్వేగంతో హడావుడిగా వెళ్ళేది దేనికోసం అని విచారిస్తే, ఒకరు విడాకుల కోసమైతే, మరొకరు పెళ్ళి చేసుకోడంకోసం. యింకా విచిత్రం ఏమిటో తెలుసా? మొదటివ్యక్తి ఏ స్త్రీకి విడాకులు యివ్వబోతున్నాడో అదే స్త్రీని రెండవ అతను వివాహం చేసుకోబోతున్నాడు. ఇప్పుడు ఆనందం ఎవరిలో ఉంది? ఆ స్త్రీలో లేదు. ఆమె ఒకరికి దుఃఖహేతువు, మరొకరికి ఆనందహేతువు.

అవివేకి, ఆనందము వస్తువులలో, ప్రదేశాలలో ఉందని భ్రాంతి చెందుతూ ఉంటాడు.

వస్తువులలో ఆనందముందనుకుని వస్తువులను ప్రోగుచేస్తుంటాడు. ప్రదేశాలలో ఆనందం ఉందని దేశమంతా గాలిస్తాడు.

ఉదాహరణకు ఒకరికి ఫ్లాటు కొంటే ఆనందమనుకోండి. ఆ ఫ్లాటు అమ్మే బిల్డరుకు దానినే అమ్మితే ఆనందం వస్తోంది. ఫ్లాటులో ఆనందము ఉంటే దాన్ని అమ్మడు కదా!!

దక్షిణాదిన ఉన్న మనకు హిమాలయప్రాంతము ఆనందముగా ఉంటుంది. అక్కడే పుట్టి పెరిగిన వ్యక్తినడగండి!! అతను అక్కడనించి ఎప్పుడు బయటపడదామా అనే ప్రయత్నంలో ఉంటాడు. అవకాశాలు బయట ఉన్నాయి అంటాడు. అతనికి అక్కడ ఆనందము దొరకటం లేదు.

ఆనందము – మనుష్యులలో లేదు, వస్తువులలో లేదు, ప్రదేశాలలో లేదు, పరిస్థితులలో లేదు. మరెక్కడ ఉంది? నీలోనే ఉంది. నిజానికి నీ స్వరూపమే ఆనందము. పూర్ణత్వదర్శనము చేస్తున్న జ్ఞానికి ఏ వెలితీ లేదు. జ్ఞాని మనుష్యుల అవసరం లేకుండానే, వస్తువుల ఆసరా లేకుండానే, ప్రదేశాలు తిరగకనే, పరిస్థితుల

ప్రమేయము లేకుండానే అమిత ఆనందముగా ఉంటాడు. జ్ఞానికి ఇది ఇలా ఉంటేనే ఆనందము అనే నియామకము లేదు.

**నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।**
**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥**
**ప్రలపన్ విసృజన్ గృహ్ణన్నున్మిషన్ నిమిషన్నపి ।**
**ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంత ఇతి ధారయన్ ॥ గీత 5 – 8,9**

చూస్తూ, వింటూ, ముట్టుకుంటూ, వాసన చూస్తూ, తింటూ, నడుస్తూ, స్వప్నముకంటూ, శ్వాసపీలుస్తూ, మాట్లాడుతూ, విసర్జిస్తూ, స్వీకరిస్తూ, కళ్ళార్పుతూ, మూస్తూ ఇంద్రియాలు వాటి వాటి పనులు చేస్తున్నాయి; ఆత్మగా, చైతన్యస్వరూపునిగా నేనేమి చేయటము లేదు అనే ధారణలో ఉంటాడు జ్ఞాని. అతనికి ఏ లోటుగాని, వెలితిగాని లేదు. పూర్ణత్వదర్శనముతో ఆనందముగా ఉంటాడు.

ఆత్మ ఏ పనీ చెయ్యదు. అది అకర్తా. అందువల్ల అభోక్తా కూడా. చెయ్యి కదిలితే కాంతి కూడా కదిలినట్టుగా అనిపిస్తుంది కాని నిజానికి కాంతి కదలదు. జ్ఞాని తను అకర్తా, అభోక్తా అని తెలిసి కూడా, తను చేయవలసిన విధిని నిర్వర్తిస్తాడు. అతనికి ఏమీ వ్యక్తిగత కోరిక లేదు. అతను పూర్ణపురుషుడు, కృతకృత్యుడు. అలాంటప్పుడు అతన్ని పని చెయ్యటానికి ఏది ప్రేరేపిస్తుంది? సమాజంమీద దయ, కరుణతో పనిచేస్తాడు. అజ్ఞాన పూర్వకమైన సమాజంకోసం, అవస్థపడుతున్న జగత్తుకోసం పనిచేస్తాడు. ప్రేమ, కరుణలను అతను అలవరచుకోనవసరం లేదు. జ్ఞానం అతనిలోని సహజసిద్ధంగా ఉన్న ప్రేమను, కరుణను వెలికితీస్తుంది. దయానంద స్వామీజీ అద్భుతంగా చెబుతారు – ఎవరూ ప్రేమను కష్టపడి పెంపొందించుకోనవసరం లేదు. ఎందుకంటే మనం స్వతహాగా ప్రేమమూర్తులం. మన సహజగుణం జాలి, దయ. కాని మనం దాన్ని మన స్వార్థంతో కప్పేశాము. స్వార్థం, మన శరీర అభిమానంవల్ల ఏర్పడింది. ఎప్పుడైతే దేహ అభిమానాన్ని పారద్రోలుతామో, అప్పుడే కప్పబడివున్న జాలి, దయాగుణాలు వాటంతట అవే వెలికివస్తాయి. జ్ఞాని అనుక్షణం పూర్ణత్వంతో ఆనందంగా ఉంటాడు.

**సారాంశము – ఆత్మనిష్ఠ లేదా బ్రహ్మనిష్ఠలో ఉన్న జ్ఞాని ప్రతిక్షణమూ ఆనందముగా ఉంటాడు.**

**శ్లోకము - 20**

**భగవద్గీతా కిఞ్చిదధీతా, గఙ్గాజలలవకణికా పీతా।**
**సకృదపి యేన మురారిసమర్చా, క్రియతే తస్య యమేన న చర్చా॥**

**భగవద్గీతా కిఞ్చిదధీతా** = భగవద్గీతను కొంచమైనా చదివి,
**గఙ్గాజలలవకణికా పీతా** = గంగా జలాన్ని కొంచమైనా త్రాగి,
**సకృదపి యేన మురారిసమర్చా** = ప్రతిరోజూ ఆ మురారిని పూజచేసినవానికి
**తస్య యమేన న చర్చా క్రియతే** = అతనికి యమునితో చర్చలేదు

(మరణభయంలేదు అంటే చావులేదని కాదు అనాయాస మరణం. దోసకాయ పరిపక్వమైతే ఎలా తీగనుంచి సునాయాసంగా విడిపోతుందో అలా)

**పదచ్ఛేదమ్-** **భగవద్గీతా. కిఞ్చిత్, అధీతా, గఙ్గాజలలవకణికా, పీతా। సకృత్, అపి, యేన, మురారిసమర్చా, క్రియతే, తస్య, యమేన, న, చర్చా॥**

**అన్వయమ్ -** **(యేన) భగవద్గీతా కిఞ్చిదధీతా, (యేన) గఙ్గాజలలవకణికా పీతా, యేన సకృత్ అపి యేన మురారి సమర్చా (క్రియతే), తస్య యమేన చర్చా న క్రియతే॥**

**తాత్పర్యం -** భగవద్గీతను కొంచెమైనా చదివి, గంగా జలాన్ని కొంచమైనా త్రాగి, ప్రతిరోజూ ఆ మురారిని పూజచేసినవానికి యమునితో ఎటువంటి చర్చ ఉండదు.

భగవద్గీత మోక్షశాస్త్రం. ముముక్షువులు తప్పనిసరిగా చదవలిసిన గ్రంథము. భగవద్గీత ఆచరణీయ గ్రంథము. దానిని గురువుద్వారా గ్రహించి జీవితభాగస్వామిగా చేసుకోవాలి. భగవద్గీత దిశానిర్దేశము చేస్తుంది. మొదట్లో ఒక శ్లోకముతో మొదలు పెట్టి, మెల్లిగా రోజూ ఒక అధ్యాయము చదివే స్థితికి చేరాలి. అలా చేస్తే చిత్తము ప్రక్షాళనం అవుతుంది. జీవితం అర్థవంతంగా ఉంటుంది. జగత్తు ఒక నందనవనంలా ఆనందదాయకమౌతుంది. భగవద్గీత రోజూ పఠించాలి. మనను మనమే ఉద్ధరించు కోవాలి.

**గీతార్థశ్రవణాసక్తో మహాపాపయుతోఽపి వా ।**
**వైకుంఠం సమవాప్నోతి విష్ణునా సహ మోదతే ॥**

**గీతార్థశ్రవణాసక్తో మహాపాపయుతోఽ పి వా –** అతను మహాపాపి అయినా కూడా, గీత వినటంమీద అతనికి బాగా శ్రద్ధ ఉంటే అది ప్రాయశ్చిత్తంలా పనిచేస్తుంది. అంటే దీని ఉద్దేశం గీత జ్ఞానజలంవంటిది. ఎవరైనా మరణిస్తే, వారిని చూసి వచ్చి స్నానం చేసి, ఎలా శుద్ధి పొందుతామో, అలా ప్రపంచంలోకి వెళితే ఎన్నో పాపాలను చేస్తాము; గీత వింటే అది మానసస్నానంలాంటిది. అంతేకాదు–

**వైకుంఠం సమవాప్నోతి–** అతను వైకుంఠలోకాన్ని పొందుతాడు.

**విష్ణునా సహ మోదతే –** ఎప్పుడూ విష్ణుమూర్తి సమక్షంలో ఉండవచ్చు. విష్ణువు ఉంటే లక్ష్మీదేవి కూడా ఉంటుంది. ఇహభోగాలు సమకూరుతాయి.

గంగాస్నానము, మురారిపూజ అంటే సదాచారము చేయమని సూచన. నిత్యపూజ, పారాయణము, వేదప్రోక్తమైన పంచమహాయజ్ఞములు చేయాలి. వీటివల్ల మనలో ఉండే మలినాలు పోతాయి. మనలో ఏ మలినాలు ఉన్నాయి? రాగము, ద్వేషము, కామము, క్రోధము, మోహము, మదము, మాత్సర్యము అనే ఆరు మలినాలున్నాయి. సదాచారమువల్ల ఈ మలినాలు పోయి ఏ ఆందోళన లేకుండా హాయిగా చీకూ చింతలేని జీవితం గడపవచ్చు.

**తస్య యమేన న చర్చా క్రియతే** యమునితో చర్చలేదు అంటే మరణముండదని కాదు. మరణభయముండదు.

ఒకతను ఆఖరు క్షణంలో భగవన్నామం చెపితే ఉన్నతలోకాలకు వెళతారనే శాస్త్రవాక్యం తెలుసుకున్నాడు. ఇదేదో బాగుందని యమునితో ఇలా మొరపెట్టుకున్నాడు. స్వామీ! నన్ను తీసుకెళ్ళే ముందు నాకు తెలియజెయ్యండి. నేను భగవన్నామం చేసుకుంటా అన్నాడు. యముడు దానికేముంది సరే అన్నాడు. యముని అభయంతో భగవంతుడి ధ్యాసేలేకుండా విలాసాలతో యథేచ్ఛగా గడుపుతున్నాడు.

ఒక రోజు హఠాత్తుగా మరణించాడు. యమభటులు అతన్ని తీసుకుపోయి యముని ముందు హాజరు పరిచారు. అతను యమునితో వారిరువురి పూర్వ ఒప్పందము గుర్తుచేసి, నువ్వు నన్ను తీసుకువెళ్ళే ముందు తెలియజేస్తానని వాగ్దానం చేశావు. అలా నేను మరణించే ముందు తెలియచేయకుండా మోసం చేశావని నొచ్చుకుంటూ పలికాడు.

దానికి యముడు నేను నీకు నాలుగు మార్లు తెలియచేశాను. అయితే మా పద్ధతిలో తెలియచేశాను. నువ్వే పట్టించుకోకుండా యథేష్టాచారం చేశావు, కులాసాగా గడిపేశావు అన్నాడు.

నాలుగుసార్లా ఎలా అని ప్రశ్నించాడు అతను –
మొదటిసారి నీ జుత్తు తెల్లబడేలా చేశాను – నువ్వు రంగు వేసుకుని కుర్ర వేషాలేశావు.
రెండవసారి నీ పళ్ళూడేలా చేశాను – నువ్వు కట్టుడు పళ్ళు కట్టించుకుని ఏమి తెలియనట్టు వ్యవహరించావు.
మూడవసారి బీ.పీ. షుగరు వచ్చేలా చేశాను – నువ్వు మాత్రలు మింగుతూ, కులాసాలు మానలేదు.
నాలుగవ సారి గుండెపోటు తెప్పించాను – నువ్వు బైపాస్ చేయించుకుని, నా సూచనలేమీ పట్టించకోలేదు అన్నాడు వాపోతూ యముడు.

మన జీవితమంతా లౌకికవ్యవహారంలో గడిపేస్తూ, భగవంతుణ్ణి పట్టించుకోము. చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభమేముంది?

**గీతార్థం ధ్యాయతే నిత్యం కృత్వా కర్మాణి భూరిశః ।**
**జీవన్ముక్తస్స విజ్ఞేయో దేహాంతే పరమం పదమ్ ॥ గీతా మాహాత్మ్యము**

**కృత్వా కర్మాణి భూరిశః –** చాలా పుణ్యకర్మలు చేశాక; నిత్యనైమిత్తిక కర్మలు చేసి చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్తవైశాల్యం పొందాక;
**గీతార్థం ధ్యాయతే–** జ్ఞానయోగానికి వస్తే అతనికి కలిగే ఫలమేమిటి?
**జీవన్ముక్త స్స విజ్ఞేయః –** అతనికి జీవన్ముక్తి కలుగుతుంది. అంటే ఇక్కడే, ఇప్పుడే సంసార బంధంనుంచి మోక్షం కలుగుతుంది.
**దేహాంతే పరమం పదమ్–** శరీరం పడిపోయినప్పుడు అంటే మరణానంతరం అతనికి విదేహముక్తి కూడా కలుగుతుంది. అంటే అతనికి పునర్జన్మ ఉండదు.

**సారాంశము – ప్రతివారు భగవద్గీత పారాయణము, అధ్యయనము చేయాలి. నిత్యపూజ చేస్తూ వైదిక జీవనము గడపాలి.**

## శ్లోకము – 21

**పునరపి జననం పునరపి మరణం, పునరపి జననీజఠరే శయనమ్।**
**ఇహ సంసారే బహుదుస్తారే, కృపయాఽపారే పాహి మురారే॥**

**పునరపి జననం పునరపి మరణం =** మళ్ళీ మళ్ళీ పుట్టడం, మరణించడం
**పునరపి జననీజఠరే శయనమ్ =** మళ్ళీ తల్లిగర్భంలో ప్రవేశించడం

**ఇహ సంసారే బహుదుస్తారే** = ఈ సంసారము చాలా దుర్భరమైనది
**కృపయాఽపారే పాహి మురారే** = హే మురారి అపారమైన కృపతో మమ్ము రక్షించుము

**పదచ్ఛేదమ్–** **పునః అపి, జననం, పునః అపి, మరణం, పునః అపి, జననీజఠరే, శయనమ్। ఇహ, సంసారే, బహు, దుస్తారే, కృపయా, అపారే, పాహి, మురారే॥**

**అన్వయమ్ –** **(హే) మురారే! పునః అపి జననమ్। పునః అపి మరణమ్। పునః అపి జననీజఠరే శయనమ్। బహు దుస్తారే,అపారే,ఇహ సంసారే (త్వం) కృపయా (మాం) పాహి॥**

**తాత్పర్యం –** హే మురారి! మళ్ళీ మళ్ళీ పుట్టడం, మరణించడం, మళ్ళీ తల్లిగర్భంలో ప్రవేశించడం, ఈ సంసారము చాలా దుర్భరమైనది. (ఇది మాకు వద్దు.) నీవు దయతో మమ్ము రక్షించుము. (మాకు సద్గురువును ప్రసాదించుము. ఆ గురువు ద్వారా మాకు శాస్త్ర అవగాహన కలిగించి మమ్ము రక్షించుము).

ఈ శ్లోకాన్ని **నిత్యనాథుడు** రచించారు. సంసారములో మూడు దోషాలున్నాయి.

**మొదటిది దుఃఖమిశ్రితత్వము.** ప్రతిసుఖము, ఆనందము వెనక కష్టము, దుఃఖము పొంచి ఉంటాయి. ఒక ఉద్యోగి ప్రమోషను కోసము ఎంతో వెంపర్లాడుతున్నాడు. చాలా ఏళ్ళ తరువాత అతన్ని బాస్ రూమ్‌లోకి పిలిచి నిన్ను మన జిల్లా మొత్తానికి అధికారిగా నియమిస్తున్నాను అని శుభవార్త అతనికి చెప్పాడు. అతని ఆనందానికి అవధులు లేవు. బాసుకు కృతజ్ఞతలు తెలుపుకుని తన సీట్ దగ్గరకు వచ్చాడు. అందరికీ స్వీట్స్ పంచి ఈ విషయం చెప్పాలనుకుంటున్నాడు. ఈలోగా అతని సబార్డినేటు స్వీట్సు పంచుతూ కనిపిస్తున్నాడు. తన ప్రమోషను గురించి తెలిసి అతను ముందే స్వీట్సు పంచుతున్నాడనుకుని అతనిని పిలిచి స్వీట్స్ ఎందుకు పంచుతున్నావని అడిగాడు. అతను రాష్ట్రం మొత్తానికి తనను అధికారిని చేశారని చెప్పాడు.

తన జూనియర్ తనమీద పెత్తనం చేసేలా తనకు ప్రమోషన్ యిచ్చారు. అంతవరకు ఉన్న అతని ఆనందం క్షణంలో ఆవిరి అయిపోయింది. జీవితం దుఃఖమిళితమై ఉంటుంది. అతి దుఃఖకరమైన సంసారాన్ని భరిస్తూ కూడా జీవి ఇందులో ఆనందముందనుకుంటాడు. పుట్టడమే ఏడుస్తూ పుడతాం. ముసలితనం,

అనారోగ్యం, మరణం ఇవన్నీ ప్రతి వారికి తప్పనిసరి దుఃఖాలు. సంసారమే దుఃఖాలయం అంటుంది శాస్త్రం.

**రెండవది అతృప్తికరత్వం.** ఏది ఉన్నా ఎంత ఉన్నా తృప్తి ఉండదు. ఒక జంట ఆడుతూ పాడుతూ హాయిగా కాపురం చేస్తున్నారు. భగవంతుడు వారిని పరీక్షించాలని రాత్రి ఏడు గోతాములు వారి యింట్లో పడేశాడు. అందులో ఆరు గోతాములు బంగారు నాణాలతో నిండి ఏడో గోతాము సగం బంగారు నాణాలతో నిండి ఉన్నాయి. ఆ జంట ఉదయాన్నే గోతాములు చూసి ఎంతో మురిసి పోయారు. భగవంతుడ్ని ఎంతగానో కొనియాడారు. కాని వారి ఆనందము ఎంతోసేపు నిలువలేదు. ఏడవ గోతాము సగమే నిండి ఉంది, దాన్ని ఎలాగైనా నింపాలని రాత్రింబవళ్ళు కష్టపడిదానిని నింపే ప్రయత్నంలో శాంతిని, అంతకు ముందు ఉన్న ఆనందాన్ని కూడా కోల్పోయారు. అదే ఆరు గోతాముల నిండా నాణెలు ఉన్నాయనే తృప్తితో ఉంటే జీవితం ఆనందమయమయ్యేది. ఎంత ఉన్నా అసంతృప్తి. ఇది ఒక దోషము.

**మూడవది బంధకత్వము.** బంధకత్వము ఒక దోషము. మనుష్యులు మనను మానసికంగా బంధిస్తారు. సంయోగ వియోగాలు జీవితములో తప్పవు. బంధకత్వంవల్ల మనకు కావలసినవారు దూరమైతే దుఃఖము. అలాగే వస్తువులు, ప్రదేశాలు, పరిస్థితులు మనను బంధిస్తున్నాయి.

**యక్షప్రశ్నలలో ఒక ప్రశ్న** – జీవులు పుట్టడం, మరణించడం అనునిత్యం చూస్తూనే ఉన్నా, మనిషి తను మాత్రం ఈ భువిలో శాశ్వతమన్నట్టుగా వ్యవహరిస్తూ ఉంటాడు. ఎందుకు?

ఒక ఎక్సిబిషనులో పెద్ద జయంట్ వీల్ అమర్చారు. దానిలోకి ఎక్కి అందరూ ఆనందిస్తున్నారు. జయంట్ వీల్‌ను ఆన్ చేసిన యజమాని జయంట్ వీల్ వదిలేసి ఎటో వెళుతున్నాడు. దానిని మీరు జయంట్ వీల్‌లోంచి గమనించారు. మీకు భయం మొదలౌతుంది. ఈ జయంట్ వీల్ ఎప్పుడాగుతుందా అని కంగారు పడతారు. ఎప్పుడు కిందకు దిగుదామా అని భయంతో జయంట్ వీల్ ఆపమని అరుపులు అరుస్తారు. కాని పునరపి జననం పునరపి మరణం జరగుతున్నా, ఎన్నో దుఃఖాలు అనుభవిస్తున్నా, ఈ సంసారమనే జయంట్ వీల్ దిగుదామని మాత్రం మనుషులకు బుద్ధి రావటం లేదు.

**అచ్చపు చీకటింబడి గృహవ్రతులై విషయప్రవిష్టులై**
**చచ్చుచు పుట్టుచున్ మరల చర్వితచర్వణులైన వారకిం**
**జెచ్చెర బుట్టునే పరులు సెప్పిననైన నిజేచ్ఛనైన నే**
**మిచ్చిన నైన కానలకు నేగిననైన హరిప్రబోధముల్ ?**
**– ప్రహ్లాద చరితము**

గృహస్థులు సంసారలంపటములో చిక్కుకుని, లౌకిక విషయవాసనలతో, దైవస్మరణ లేకుండా జీవితం వెళ్ళబుచ్చి మానవజీవితమనే అమూల్యమైన దైవదత్తమైన ఈ కానుకను దురుపయోగము చేసుకుంటున్నారు. పుడుతూ, మరణిస్తూ ఈ కష్టాలను మళ్ళీ మళ్ళీ కొని తెచ్చుకుంటున్నారు.

**సారాంశము – జన్మరాహిత్యమునకు ఆత్మజ్ఞానము తప్పనిసరి. ఆత్మజ్ఞానమునకు(అద్వైతవాసనకు) ఈశ్వర అనుగ్రహము కావాలి. అందుకు నిత్యము ఈశ్వరప్రార్థన చేయాలి.**

**శ్లోకము – 22**

**రథ్యాచర్పటవిరచితకన్థః, పుణ్యాపుణ్యవివర్జితపన్థః।**
**యోగీ యోగనియోజితచిత్తః, రమతే బాలోన్మత్తవదేవ॥**

**రథ్యాచర్పటవిరచితకన్థః** = దారిలో పడిన గుడ్డపీలికలు అతని వస్త్రం
**యోగీ యోగనియోజితచిత్తః** = యోగమందే(బ్రహ్మమందే) చిత్తమును నిలిపిన యోగి
**బాలః ఉన్మత్తవత్ ఏవ రమతే** = బాలునివలె, పిచ్చివాని వలె (బ్రహ్మములో) రమిస్తూ ఉంటాడు
**పుణ్యాపుణ్యవివర్జితపన్థః** = పుణ్యం–పాపం ఈ రెండిటికీ అతీతమైన మార్గంలో చరిస్తూ (ఉంటాడు)

**పదచ్ఛేదమ్ – రథ్యా–చర్పట–విరచిత–కన్థః,పుణ్య–అపుణ్య–వివర్జిత–పన్థః।**
**యోగీ,యోగ–నియోజితచిత్తః,రమతే, బాలః, ఉన్మత్తవత్,ఏవ॥**

**అన్వయమ్ – రథ్యాచర్పటవిరచితకన్థః, పుణ్యాపుణ్యవివర్జితపన్థః**
**యోగనియోజితచిత్తః యోగీ ఏవ బాలోన్మత్తవత్ రమతే॥**

**తాత్పర్యం-** దారిలో పడిన గుడ్డపీలికలు అతని వస్త్రం. యోగమందే (బ్రహ్మమందే) చిత్తమును నిలిపిన యోగి. పుణ్యం-పాపం ఈ రెండిటికీ అతీతమైన మార్గంలో చరిస్తూ, బాలునివలె, పిచ్చివానివలె (బ్రహ్మములో) రమిస్తూ ఉంటాడు.

జ్ఞాని రోడ్డుమీద విసిరేసిన బట్టలు వేసుకున్నాడు. పాపపుణ్యాలకు అతీతమైన మార్గంలో బాలునివలె పిచ్చివానివలె ఉన్నాడు. నిదిధ్యాసనంలో బ్రహ్మలో రమిస్తున్నాడు. బాలునివలె, పిచ్చివానివలె బ్రహ్మలో రమిస్తునాడు అంటే అన్యమైన ధ్యాసలేకుండా ప్రపంచవిషయాలు పట్టించుకోకుండా బ్రహ్మనిష్ఠలో ఉన్నాడని అర్థం.

సదాశివ బ్రహేంద్ర గురించి ఇలాగే చెబుతారు. ఆయన ఒక ఉన్మాదిలా తన తత్త్వప్రపంచములోనే ఉండేవాడని చెపుతారు. **రే రే బ్రహ్మమయం** అని పరవశించిపోయేవాడు. **ప్రపంచాన్ని సరిగ్గా చూస్తే అదే బ్రహ్మ. బ్రహ్మను సరిగ్గా అర్థం చేసుకోకపోతే అదే ప్రపంచము.**

జ్ఞానులందరూ ఇలాగే ఉండాలని లేదు. శంకరాచార్యులు అనేక గ్రంథాలు రచించారు. పిచ్చివాళ్ళు సమర్థవంతమైన రచనలు చేయలేరు. దీని ఉద్దేశ్యం ప్రపంచధోరణి ఉన్న మనుష్యులు డబ్బుకు, లౌకిక విషయాలకు ప్రాధాన్యతనిస్తారు. జ్ఞానికి బ్రహ్మ ఒక్కటే ముఖ్యము. ప్రపంచము మిథ్యగా ఉంటుంది. అన్యమైన ప్రాపంచిక విషయాలు పట్టించుకోడు. అతని ధోరణి ప్రపంచ ధోరణికి భిన్నముగా ఉంటుంది అందుకని బాలునివలె, పిచ్చివానివలె ఉన్నాడంటారు.

అప్పయ్య దీక్షితులు మహాపండితుడు, జ్ఞాని. అనుక్షణము తత్త్వచింతనలో ఉండేవారు. తను అపస్మారక స్థితిలో ఉంటే భగవతత్త్వ చింతనము చేస్తున్నానా లేదా అని పరీక్షించుకోవాలని ఔషధము సేవించి, ఉన్మత్త స్థితికి వెళ్ళారు. గురువుల ఆదేశం ప్రకారం వారి శిష్యులు, దీక్షితులుగారిని ఒక గదిలో బంధించారు. ఆ సమయంలో వారు ఏమి చేశారో పరిశీలించి చెప్పమని ముందే గురువుగారి ఆదేశము. అప్పయ్య దీక్షితులు ఆ సమయంలో కూడా భగవతత్త్వం గురించి ఆలోచిస్తున్నారు. వారు ఆ స్థితిలో **ఉన్మత్త శతకమనే** అద్భుతమైన తాత్త్విక గ్రంథరచన చేశారు. జ్ఞానులకు సుప్తచేతనములో **అహం బ్రహ్మ అస్మి** అనే సత్యము, **బ్రహ్మ సత్యం జగన్మిథ్యా** అనే పరమ సత్యము అనుక్షణము మెదులుతూ ఉంటాయి.

పాపం, పుణ్యం - రెండూ సంకెళ్ళే. రెండూ మనిషిని బంధించేవే. పాపం హీనలోకాలకి తీసుకువెళితే, పుణ్యం ఉన్నతలోకాలకి తీసుకువెళుతుంది. రెండింటివల్ల

జన్మరాహిత్యము జరగదు. లోకాలు సంచరించే ఒక బాటసారిగానే మిగిలిపోతాం. జన్మరాహిత్యానికి జ్ఞానమొక్కటే శరణ్యం. **జ్ఞానాదేవ కైవల్యం.**

**యదా పశ్యః పశ్యతే రుక్మవర్ణం**
**కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిమ్।**
**తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ**
**నిరంజనః పరమం సామ్యముపైతి॥ ముండకోపనిషత్తు 3-1- 3**

విచక్షణ ఉన్న జ్ఞాని ఎప్పుడు జగత్కారణమైన పరమాత్మను తానుగా చూస్తాడో; చతుర్ముఖ బ్రహ్మ నానుంచే (నా స్వరూపమైన చైతన్యంనుంచి) పుట్టాడని ఎప్పుడు అనుకుంటాడో, అప్పుడు ఆ జ్ఞాని పుణ్యపాపాలను విదిలించుకుని. నిరంజనమైన, శ్రేష్ఠమైన పరమాత్మలో ఐక్యం పొందుతాడు.

**సారాంశము - జ్ఞాని బ్రహ్మలో రమిస్తూంటాడు. అతనికి లౌకికవిషయాలు పట్టవు. పుణ్యపాపాలకు అతీతమైన మార్గములో ఉంటాడు.**

## శ్లోకము - 23

**కస్త్వం కో౽హం కుత ఆయాతః, కా మే జననీ కో మే తాతః।**
**ఇతి పరిభావయ సర్వమసారమ్, విశ్వం త్యక్త్వా స్వప్నవిచారమ్॥**

| | |
|---|---|
| **కః త్వమ్** | = నువ్వు ఎవరు? |
| **అహం కః** | = నేనెవరిని? |
| **అహం కుతః ఆయాతః** | = నేనెక్కడినుంచి వచ్చాను? |
| **మే జననీ కా** | = నా తల్లి ఎవరు? |
| **మే తాతః కః** | = నా తండ్రి ఎవరు?(సంస్కృతంలో తాత అంటే తండ్రి) |
| **ఇతి పరిభావయ** | = ఈ విధమైన విచారణ చేసి |
| **సర్వమసారమ్** | = ఇదంతా సారములేనిదని తెలుసుకో |
| **విశ్వం త్యక్త్వా** | = జగత్తును (మిథ్యా భూతంగా) వదలివేసి |
| **స్వప్న-విచారమ్** | = (జగత్తు ఈశ్వర) స్వప్నంగా తెలుసుకో |

పదచ్ఛేదమ్ - **కః, త్వం, కః, అహం, కుతః, ఆయాతః, కా, మే, జననీ, కః, మే, తాతః। ఇతి, పరిభావయ, సర్వమ్+అసారమ్, విశ్వం, త్యక్త్వా, స్వప్న-విచారమ్॥**

**అన్వయమ్ - కః త్వమ్? అహం కః? కుతః ఆయాతః? మే జననీ కా? కః మే తాతః? విశ్వం త్యక్త్వా సర్వమ్ అసారం స్వప్నవిచారమ్ ఇతి పరిభావయ॥**

**తాత్పర్యం -** నువ్వు ఎవరు? నేనెవరిని? నీ తల్లి ఎవరు? నీ తండ్రి ఎవరు? ఎక్కడినుంచి వచ్చాము? ఈ విధమైన విచారణ చేసి, (జగత్తుకు సారము, అధిష్ఠానము ఏదో దాన్ని పట్టుకో) జగత్తును (మిథ్యా భూతంగా) మానసికంగా వదలి వేయి, జగత్తును (మిథ్యా భూతంగా) వదలి వేయి అంటే ఇదే నిజమనే మాయలో పడకు.

బ్రహ్మవిద్య నేర్పే గురువు దగ్గర ఒక గృహస్థ శిష్యుడు ఉంటాడు. ఎంతో శ్రద్ధగా విషయాలు గ్రహిస్తున్నాడు. కాని అతనికి భార్యా పిల్లలమీద ఎనలేని మక్కువ. అందుకని వైరాగ్యధోరణి అనుష్ఠానములోకి రావటం లేదు. ఈ విషయమే గురువుకు తెలియజేస్తాడు. దానికి గురువు శిష్యునికి ఒక రహస్యప్రయోగము చెబుతాడు. అదేమిటి? మరుసటి రోజు గురువు వారింటికి వస్తాడు.

ఆ సమయంలో యోగవిద్యలో నేర్పరియైన శిష్యుడు చనిపోయిన వానిలా శ్వాసను కుంభించి చేష్టలుడిగి పడిపోతాడు. అప్పుడు కుటుంబసభ్యులు ఆయన చనిపోయాడని కంగారుగా, దుఃఖాన్ని మింగుతూ గురువు గారిని సమీపించి ఆయనను బ్రతికించమని వేడుకుంటారు. దానికి ఈ శిష్యుణ్ణి బ్రతికిస్తాను కాని అతనికోసం మీలో ఎవరైనా ప్రాణదానం చేస్తే ఆయన బతుకుతాడు, కాని అలా ప్రాణం దానం చేసిన వ్యక్తి చనిపోతాడు అన్నాడు.

గురువుగారు ముందుగా శిష్యుని భార్యనడిగారు, 'నీ ప్రాణాలు భర్తకోసము ధారపోస్తావా?' దానికి ఆమె, 'ఈ పిల్లల ఆలనా పాలనా అంతా చూసేది నేనే. ఈయనేం చూశాడు వీరిని. ఈయన ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే. నేను వెళ్ళిపోతే వీరంతా ఏమయి పోవాలి? నేను నా ప్రాణాలివ్వలేను,' అని తేల్చి చెప్పింది.

పెద్దకొడుకును అడిగారు గురువుగారు. 'నేనిప్పుడే ఉద్యోగంలో చేరాను. జీవితం యింకా పూర్తిగా అనుభవించనే లేదు. మా నాన్న అన్నీ అనుభవించాడు. ఆయన లేకపోయినా ఫర్వాలేదు. నేను నా ప్రాణాలు యివ్వలేను,' చెప్పేశాడు. గురువుగారు కూతురిని అడిగారు, 'అమ్మో నాకు పెళ్ళయి నాలుగేళ్ళే అయింది. నా సంసారము, నా భర్త నాకు ముఖ్యం. ఏదో చుట్టపు చూపుగా వచ్చాను, నా ప్రాణాలు ఎందుకిస్తాను?' అంది శిష్యుని గారాల కూతురు. యిలా అందరూ

తలా ఒక వంకా చెప్పి తప్పించుకుంటున్నారు. ఊపిరి బిగించి చచ్చినట్టుగా నటిస్తున్న శిష్యునికి బంధాలు బాంధవ్యాలు ఎంతవరకో అర్థమైంది.

**ఎక్కడ తల్లిదండ్రి, సుతులెక్కడివారు, కళత్ర బాంధవం**
**బెక్కడ జీవుడెట్టి తనువెత్తిన బుట్టుచు బోవుచున్నవా**
**డొక్కడె, పాపపుణ్యఫల మొందిన నొక్కడె కానరాడు వే**
**రొక్కడు వెంటనంటి భవమొల్లనయా కృప జూడవయ్యా నీ**
**టక్కరి మాయలందిడక దాశరథీ! కరుణా పయోనిధీ!**

తల్లి, తండ్రి, పిల్లలు, భార్యా, బాంధవ్యము ఏదీ శాశ్వతము కాదు. ప్రారబ్ధము తీరిపోతే ఎవ్వరూ మిగలరు. పరమేశ్వరుడే శాశ్వతమైనవాడు. ఆయనతో సంబంధమే అసలయిన సంబంధము.

**సారాంశము - ఆత్మా - అనాత్మల వివేకము చేయాలి. ఏది నిత్యము, శాశ్వతమో దానిని గట్టిగా పట్టుకోవాలి.**

## శ్లోకము - 24

**త్వయి మయి చాన్యత్రైకో విష్ణుః, వ్యర్థం కుప్యసి మయ్యసహిష్ణుః।**
**భవ సమచిత్తః సర్వత్ర త్వం, వాఞ్ఛస్యచిరాద్యది విష్ణుత్వమ్॥**

| | |
|---|---|
| **త్వయి** | = నీకు |
| **మయి చ** | = నాకు |
| **అన్యత్ర** | = ఇతరులకు |
| **విష్ణుః ఏకః** | = విష్ణువు ఒకడే |
| **వ్యర్థం కుప్యసి** | = అనవసరంగా కోపించిచున్నావు |
| **మయ్యసహిష్ణుః** | = నాపై అనవసరంగా ద్వేషించుచున్నావు |
| **వాఞ్ఛస్యచిరాద్యది విష్ణుత్వమ్** | = నీవు శీఘ్రంగా విష్ణుత్వం కోరుకున్నటైతే |
| **సర్వత్ర త్వం సమచిత్తః భవ** | = అంతటా నీవు సమచిత్తం వహించు |

**పదచ్ఛేదమ్ - త్వయి, మయి,అన్యత్ర, ఏకః, విష్ణుః, వ్యర్థం, కుప్యసి, మయి, అసహిష్ణుః। భవ, సమచిత్తః, సర్వత్ర, త్వం, వాఞ్ఛసి, అచిరాత్, యది, విష్ణుత్వమ్॥**

**అన్వయమ్ -** **త్వయి మయి అన్యత్ర చ విష్ణుః ఏకః। మయి అసహిష్ణుః వ్యర్థం కుప్యసి। యది అచిరాత్ విష్ణుత్వం వాఞ్ఛసి (తర్హి) సర్వత్ర త్వం సమచిత్తః భవ।**

**తాత్పర్యం -** నీకు, నాకు, ఇతరులకు, విష్ణువు ఒకడే, అనవసరంగా కోపించుచున్నావు, నాపై అనవసరంగా ద్వేషించుచున్నావు. నీవు శీఘ్రంగా విష్ణుత్వం కోరుకున్నట్లైతే, అంతటా నీవు సమచిత్తం వహించు.

విష్ణుత్వం అంటే అహం బ్రహ్మ అనే నిజత్వంలో ఉండడం. బ్రహ్మ అంటే చైతన్యం. చైతన్యం అంటే ఏమిటో తెలియాలి మనకు.

**చేయి - కాంతి ఉదాహరణ**

చెతన్యం లక్షణాలు బోధించడానికి పరమార్థానందస్వామీజీ తరుచు చేయి - కాంతి ఉదాహరణ వాడుతూంటారు. ఇదిగో నా చేయి చూడండి! ఏం చూస్తున్నారు? అని ప్రశ్నిస్తే. చేయి, చేతిలోని రేఖలు, చేతికున్న గోరింటాకు, చేతి వేళ్ళు ఇలా సమాధానం వస్తుందే కాని ఎవరు కాంతిని చూస్తున్నాం అని చెప్పరు. మనకి చేయి కనబడడానికి కారణం కాంతి. కాంతి చేతిమీద పడి ప్రతిబింబిస్తుంది. ఆ ప్రతిబింబమే మనకి చేయిలా కనబడుతుంది. ఇప్పుడు కాంతికి చేయికి గల విశ్లేషణ చూద్దాం.

- ఐదు అంశాలు పరిశీలిద్దాం!

1. కాంతి చేతిలో ఒక భాగం కాని, లక్షణం కాని కాదు. చేతినుంచి ఉత్పత్తి చెందింది కూడా కాదు.
2. కాంతి స్వతంత్రమైనది. అది చేయి అంతటా వ్యాపించి, చేతిని ప్రకాశింప చేస్తుంది.
3. కాంతి చేయి సరిహద్దులకే పరిమితమవలేదు.
4. చేయి కనుమరుగైతే కాంతి నాశనమవదు. అలా చేయి తీసివేసినా కూడా కాంతి ఉంటుంది.
5. కాంతి చేయి లేకపోయినా ఉంటుంది. కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపజేసే చేయి లేదు కాబట్టి అది కనిపించదు. అంత మాత్రాన కాంతి లేనట్టు కాదు. దీనినే చైతన్యానికి వర్తింప చేద్దాం. కాంతి బదులు చైతన్యాన్ని, చేయి బదులు శరీరాన్ని ఊహించుకోండి.

ఐదు చైతన్య లక్షణాలు –

1. చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని కాదు. శరీరాన్నించి ఉత్పత్తి చెందింది కూడా కాదు.
2. చైతన్యం స్వతంత్రమైనది. అది శరీరం అంతటా వ్యాపించి, శరీరాన్ని ప్రకాశింప చేస్తుంది.
3. చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
4. చైతన్యం శరీరం నాశనమయితే నాశనమవదు. అలా శరీరం పతనం చెందాక కూడా చైతన్యం ఉంటుంది.
5. చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది.కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపజేసే శరీరం లేదు కాబట్టి అది కనిపించదు. అంత మాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఐదు వేదాంత గుళికలు –

1. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని.
2. శాంతి, ఆనందం, భద్రతలు నానుంచే వస్తున్నాయి.
3. కేవలం నా ఉనికి వల్లే నా భౌతిక శరీరానికి జీవం ఏర్పడి, ఈ జగత్తులో వ్యవహారం నడపగలుగుతోంది.
4. ఈ జగత్తులో ఏం జరిగినా అది నన్ను చలింప చేయలేదు.
5. నా అసలు స్వరూపాన్ని నేను మర్చిపోయి, నా జీవితాన్ని భారంగా చేసుకుంటున్నాను. నా స్వరూపనిష్ఠలో ఉండి, జీవితాన్ని ఒక ఆటగా మలచుకుంటాను.

   అంతటా ఈశ్వరుడే ఉన్నాడని జ్ఞాని సమదర్శనం చేస్తాడు.

   ఈ విధంగా ఆత్మబోధ చేసి గురువుగారు శిష్యులను పరీక్షిద్దామని అందరికి తలో ఒక లడ్డూ యిచ్చి, ఎవరు చూడకుండా దీనిని తిని రండి అని ఆదేశించాడు.

   ఒకడు తన గదిలో తలుపు వేసుకుని తిన్నాడు. మరొకడు ముసుగు కప్పుకుని తిన్నాడు. ఇంకొకడు నిర్జన ప్రదేశానికి పోయి తిన్నాడు. ఒకడు మాత్రము గురువును సమీపించి క్షమాపణ అడిగాడు.

గురువర్యా నేను ఎవరూ చూడకుండా తినలేకపోయాను. ఎక్కడ చూచినా భగవంతుడే ఉన్నాడు. భగవంతుని తప్పించుకోవటం నాకు చేతనవలేదు అని లడ్డు తిరిగి గురువు చేతిలో పెట్టాడు. గురువు మెచ్చుకుంటూ వెన్నుతట్టి ఇతను నా బోధ సరిగా అర్థం చేసుకున్నాడని చెప్పాడు.

**సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని।**
**ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః॥ గీత 6 - 29**

యోగము(ఏకాగ్రత)తో కూడిన చిత్తముగల యోగి సకల ప్రాణులయందుండే చైతన్యస్వరూపమును తన యందే దర్శించును. అతడు సర్వమునందు సమమగు బ్రహ్మను దర్శిస్తాడు.

**సారాంశము - సర్వం బ్రహ్మమయం. సర్వత్ర బ్రహ్మదర్శనం చేసే జ్ఞానికి ఆనందమే ఆనందము.**

### శ్లోకము - 25

**శత్రౌ మిత్రే పుత్రే బన్ధౌ, మా కురు యత్నం విగ్రహసన్ధౌ।**
**సర్వస్మిన్నపి పశ్యాత్మానం, సర్వత్రోత్సృజ భేదాజ్ఞానమ్॥**

**శత్రౌ మిత్రే పుత్రే బన్ధౌ** = శత్రువుల యందు, మిత్రులయందు, పుత్రులయందు, బంధువులయందు

**విగ్రహసన్ధౌ యత్నం మా కురు** = పోట్లాడి విడిపోవటం, ఆపైన రాజీలు వద్దు. అంటే సామరస్యంతో మెలగాలి

**(త్వం) సర్వస్మిన్ అపి ఆత్మానం పశ్య** = అన్నిటా ఆత్మగా నేనే ఉన్నాను అనే దర్శనం చేయి

**సర్వత్ర భేద అజ్ఞానమ్ ఉత్సృజ** = అన్నిటా భేదభావం లేకుండా చూడు

**పదచ్ఛేదమ్ -** **శత్రౌ, మిత్రే, పుత్రే, బన్ధౌ, మా, కురు, యత్నం, విగ్రహ, సన్ధౌ। సర్వస్మిన్, అపి, పశ్య, ఆత్మానం, సర్వత్ర+ఉత్సృజ భేద+అజ్ఞానమ్॥**

**అన్వయమ్ -** **శత్రౌ మిత్రే పుత్రే బన్ధౌ విగ్రహసన్ధౌ యత్నం మా కురు। (త్వం) సర్వస్మిన్ అపి ఆత్మానం పశ్య। సర్వత్ర భేద అజ్ఞానమ్ ఉత్సృజ ॥**

**తాత్పర్యం –** శత్రువులందు, మిత్రులందు, పుత్రులందు, బంధువులందు పోట్లాడి విడిపోవటం, ఆపైన రాజీలు వద్దు. అంటే సామరస్యంతో మెలగాలి. అన్నిటా ఆత్మగా నేనే ఉన్నాను అనే దర్శనం చేయి. ఎక్కడా భేదభావం లేకుండా చూడు.

శత్రువులు, మిత్రులు, పుత్రులు, బంధువులు అనే భేదబుద్ధి వద్దు. అంతటా ఈశ్వరుడే ఉన్నాడు. సర్వం బ్రహ్మమయం. అంతటా ఈశ్వరదర్శనం చేసే జ్ఞానికి రాగద్వేషాలుండవు.

పొరపాటున నాలుక కరుచుకున్నాము. చాలా నొప్పి పుడుతుంది. అలాగని ఒక సుత్తి తీసుకుని పన్ను విరగకొడతామా? లేదే? ఎందుకు? పన్ను మనదే. నాలుకా మనదే. ఎవరిమీద కోపము? అంతటా నేనే చైతన్యముగా ఉన్నాను.

ఒక రాజ్యం శివార్లలో రాజభటులు కాపు కాస్తున్నారు. ఒక బాటసారి ఆ రాజ్యంలోకి ప్రవేశిస్తూ, 'మీ రాజ్యంలో ప్రజలు ఎలా ఉంటారు,' అని ప్రశ్నించాడు. దానికి ఆ భటుడు సమాధానమివ్వకుండా ఆ బాటసారిని తిరిగి ప్రశ్నించాడు. 'మీ రాజ్యంలో ప్రజలెలా ఉంటారు,' అన్నాడు.

ఆ బాటసారి, 'మా రాజ్యం ప్రజలు చాలా దుర్మార్గులు, ఎవ్వరికీ సాయంచేయరు, చాలా స్వార్థపరులు,' అన్నాడు. దాంతో ఆ భటుడు,'ఇక్కడి ప్రజలు పరమనీచులు ఎవరికీ సాయం చేయరు. వీరూ స్వార్థపరులే,' అన్నాడు.
కొంత సేపటికి మరొక బాటసారి వచ్చాడు.

ఆ బాటసారి కూడా ఆ రాజ్యంలోకి ప్రవేశిస్తూ, 'మీ రాజ్యంలో ప్రజలు ఎలా ఉంటారు?' అడిగాడు. దానికి ఆ భటుడు సమాధానమివ్వకుండా ఆ బాటసారిని తిరిగి ప్రశ్నించాడు. 'మీ రాజ్యంలో ప్రజలెలా ఉంటారు?'

బాటసారి సమాధానంగా, 'మా రాజ్యం ప్రజలు చాలా మంచివారు, పరోపకారము అంటే ముందు కొస్తారు, స్నేహశీలురు,' అన్నాడు. దాంతో ఆ భటుడు, 'ఇక్కడి ప్రజలు పరమసాధువులు ఎదురు సాయం చేస్తారు. వీరూ స్నేహపరులే,' అన్నాడు.

ఇదంతా గమనిస్తున్న తోటిభటుడు ఆశ్చర్యంతో ప్రశ్నించాడు. మొదటి వానికి ఒకలాగా, రెండవ వానికి మరొకలాగా మన ప్రజల గురించి ఎందుకు చెప్పావు అని ప్రశ్నిస్తే చూసే వాడి దృష్టి బట్టే ప్రపంచముంటుంది అన్నాడు.

జ్ఞానికి జగత్తు ఒక నందనవనం. దుర్యోధనుడుని ఒక మంచివాడిని చూపించమంటే చూపించ లేకపోయాడుట. అలాగే ధర్మరాజుని చెడ్డవానిని చూపమంటే చూపించ లేకపోయాడుట.

**యస్మిన్సర్వాణి భూతాని ఆత్మైవాభూద్విజానతః ।**
**తత్ర కో మోహః కః శోక ఏకత్వమనుపశ్యతః ॥ - ఈశావాస్యోపనిషత్తు**

ఆత్మే సకలజీవరాసులుగా అభివ్యక్తమైనదని గ్రహించి ఏకత్వభావన ఏర్పరచుకున్న జ్ఞానికి మోహం ఎక్కడుంటుంది? శోకం ఎక్కడుంటుంది?

**సారాంశం- సమదర్శనం చేసే జ్ఞానికి జగత్తు ఒక నందనవనము.**

## శ్లోకము - 26

**కామం క్రోధం లోభం మోహం, త్యక్త్వాఽత్మానం పశ్యతి సోఽహమ్।**
**ఆత్మజ్ఞానవిహీనా మూఢాః, తే పచ్యన్తే నరకనిగూఢాః॥**

| | |
|---|---|
| **కామం క్రోధం లోభం మోహం త్వక్త్వా** | = జ్ఞాని కామం క్రోధం లోభం మోహం వదలి |
| **సః ఆత్మానమ్ అహం సః ఇతి పశ్యతి** | = నేనే ఆ ఈశ్వరుడను అని తెలుసుకుంటాడు |
| **మూఢాః** | = మూఢులు |
| **ఆత్మజ్ఞానవిహీనాః** | = ఆత్మజ్ఞానము లేనివారు |
| **తే నరక నిగుఢా పచ్యన్తే** | = వారు నరకములో వండబడతారు |

**పదచ్ఛేదమ్ - కామం, క్రోధం, లోభం, మోహం, త్యక్త్వా+ఆత్మానం, పశ్యతి, సోఽహమ్। ఆత్మ, జ్ఞాన, విహీనా, మూఢాః, తే, పచ్యన్తే, నరక, నిగూఢాః॥**

**అన్వయమ్ - (ఆత్మజ్ఞః) కామం క్రోధం లోభం మోహం త్యక్త్వా సః అహమ్ ఇతి ఆత్మానం పశ్యతి। ఆత్మజ్ఞానవిహీనాః మూఢాః। తే నరకనిగూఢాః (యమాదిభిః) పచ్యన్తే।**

**తాత్పర్యం** – జ్ఞాని కామం క్రోధం లోభం మోహం వదలి, నేనే ఆ ఈశ్వరుడను అని తెలుసుకుంటాడు. మూఢులు, ఆత్మజ్ఞానము లేనివారు నరకములో వండబడతారు (అనేక బాధలు అనుభవిస్తారు).

ఒక తల్లి పిల్లలకు జంతువుల బొమ్మలున్న బిస్కట్స్ యిచ్చింది. వారు బిస్కట్స్ తీసుకుని కాసేపు ఆడుకున్నారు. ఇంతలో ఒకరు నాది సింహము బిస్కట్ నీ లేడి బిస్కట్‌ను తినేస్తుంది అని నోరు తెరుచుకుని లేడి బిస్కట్‌ని తినడానికి బయలుదేరాడు. దాంతో పిల్లల ఏడుపులు మొదలయ్యాయి. తల్లి వారిని కూర్చోపెట్టి ఇవి గోధుమపిండి బిస్కట్స్. అంతా గోధుమే. సింహము, లేడి, చిలక, ఆవు ఇవన్ని కేవలం రూపాలే నిజానికి ఉన్నది గోధుమ పిండి మాత్రమే, దానిలో తేడా ఉందని మీరు తగువు పెట్టుకోకండి అని నచ్చచెప్పింది.

మనమూ అంతే. భిన్నముగా కన్పిస్తున్నా నిజానికి మన మందరము ఒకే చైతన్యము. సమదర్శనము చేస్తూ క్రోధము, లోభము, మోహము వదిలి వేయాలి. అలా భేదబుద్ధి ఉంటే కష్టాల పాలవుతాము.

మనమెవరో తెలియని అజ్ఞానంవల్ల మనలో అపూర్ణత్వం ఉదయిస్తుంది. అపూర్ణత్వంవల్ల కోరిక. కోరికవల్ల రాగము, క్రోధము పుడతాయి. కోరిక తీరితే రాగము. తీరకపోతే క్రోధము కలుగుతాయి.

**ధ్యాయతో విషయాన్ పుంసస్సంగస్తేషూపజాయతే ।**
**సంగాత్సంజాయతే కామః కామాత్క్రోధోఽభిజాయతే ॥గీత 2-62**

ఏకాగ్రచిత్తముతో ఇంద్రియభోగముల గురించి చింతన చేసే వ్యక్తికి, వాటియందు ఆసక్తి పుడుతుంది. ఆసక్తినుండి కోరిక, కోరికనుండి క్రోధము పుడుతుంది.

**క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః ।**
**స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి ॥ గీత 2-63**

క్రోధమునుండి సమ్మోహము (మూఢభావము) కలుగును, సమ్మోహము నుండి స్మృతి కోల్పోవును. స్మృతినష్టమవటంవల్ల బుద్ధివినాశము కలుగును. బుద్ధినాశమువలన వ్యక్తి పూర్తిగా పతనమవుతాడు.

**సారాంశము – కామక్రోధాలను వీడి చైతన్యస్వరూపముగా నేనే ఈశ్వరుడను అనే నిష్ఠలో ఉన్నవానికి క్రోధము లేదు. కామము లేదు.**

**చర్పట పంజరికా శ్లోకముల వర్ణన ముగిసినది.**

# ఉపసంహార శ్లోకముల వ్యాఖ్యానము

**శ్లోకము - 27**

**గేయం గీతానామసహస్రం, ధ్యేయం శ్రీపతిరూపమజస్రమ్।**
**నేయం సజ్జనసజ్గే చిత్తం, దేయం దీనజనాయ చ విత్తమ్॥**

**గేయం గీతానామసహస్రం** = భగవద్గీత, విష్ణుసహస్రనామం పఠిస్తూ ఉండాలి

**ధ్యేయం శ్రీపతిరూపమజస్రమ్** = శ్రీపతి రూపాన్ని ధ్యానించాలి

**నేయం సజ్జనసజ్గే చిత్తం** = సత్పురుషుల సాంగత్యం చేయాలి

**దేయం దీనజనాయ చ విత్తమ్** = దీనజనులకు శక్తికొలది సాయం చేయాలి

**పదచ్ఛేదమ్ -** **గేయం, గీతా-నామసహస్రం, ధ్యేయం, శ్రీపతి, రూపమ్, అజస్రమ్। నేయం, సజ్జన-సజ్గే, చిత్తం, దేయం, దీన-జనాయ, చ, విత్తమ్॥**

**అన్వయమ్-** **(త్వయా)గీతానామసహస్రం గేయం। శ్రీపతిరూపమజస్రమ్ ధ్యేయం। సజ్జనసజ్గే చిత్తం నేయం। దీనజనాయ విత్తమ్ దేయం చ అస్తి॥**

**తాత్పర్యం -** భగవద్గీత, విష్ణుసహస్రనామం రోజూ పఠిస్తూ ఉండాలి. శ్రీపతి రూపాన్ని ధ్యానించాలి. సత్పురుషుల సాంగత్యం చేయాలి. దీనజనులకు శక్తికొలది సాయం చేయాలి.

గ్రంథ ఉపసంహారము జరుగుతోంది. సదాచారము ఎలా చేయాలో చెపుతున్నారు. రోజూ గీత, విష్ణుసహస్రనామపారాయణ చేయాలి, దానం చేయాలి, సజ్జనసాంగత్యం చేయాలి. **ముముక్షువులకు నాలుగు సాధనలు చెప్పారు.**

**1. పారాయణము 2. ధ్యానము 3. సత్సంగము 4. దానము.**

పారాయణము అర్థ సహితంగా చేస్తే మంచిది. ధ్యానము అంటే సగుణ ఈశ్వరుణ్ణి ఏకాంత ప్రదేశంలో రోజులో కొంతసేపు ధ్యానించాలి. సత్సంగము అంటే సత్పురుషుల సాంగత్యం. మనను సద్గురువు దగ్గరకు తీసుకువెళుతుంది.

సద్గురువు మనకు మనస్వరూపాన్ని పరిచయం చేస్తాడు. స్వరూపనిష్ఠవల్ల జీవన్ముక్తి, విదేహముక్తి వస్తాయి. దానమువల్ల చిత్తశుద్ధి ఏర్పడుతుంది.

పారాయణము చాలా ముఖ్యము దానిని సాధ్యాయం అంటారు, తైత్తిరీయంలో స్వాధ్యాయాన్ని విడవవద్దని వస్తుంది.

**ఋతం చ స్వాధ్యాయప్రవచనే చ। సత్యం చ స్వాధ్యాయప్రవచనే చ। తపశ్చ స్వాధ్యాయప్రవచనే చ। దమశ్చ స్వాధ్యాయప్రవచనే చ। శమశ్చ స్వాధ్యాయప్రవచనే చ। అగ్నయశ్చ స్వాధ్యాయప్రవచనే చ। అగ్నిహోత్రం చ స్వాధ్యాయప్రవచనే చ। అతిథయశ్చ స్వాధ్యాయప్రవచనే చ। మానుషం చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజా చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజనశ్చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజాతిశ్చ స్వాధ్యాయప్రవచనే చ। సత్యమితి సత్యవచా రాథీతరః। తప ఇతి తపోనిత్యః పౌరుశిష్టిః। స్వాధాయప్రవచనే ఏవేతి నాకో మౌద్గల్యః। తద్ధి తపస్తద్ధి తపః॥**

ఈ మంత్రంలో సాధ్యాయప్రవచనాలు విడవవద్దని పదే పదే చెప్పడం జరిగింది.

స్వామి పరమార్థానందగారు స్వాధ్యాయంగా రోజూ తైత్తిరీయం (కనీసం ఒక వల్లి), భగవద్గీత(కనీసం ఒక అధ్యాయం), విష్ణుసహస్రనామం, పురుషసూక్తం, శ్రీరుద్రం పారాయణము చేయమంటారు. ఇవి నిత్యం నిష్కాముకంగా చేయడం వల్ల అంతఃకరణశుద్ధి జరుగుతుంది. తద్వారా శాస్త్ర అధ్యయనానికి అధికారం సంపాదిస్తారు.

ఇంకా తైత్తిరీయం దానం ఎలా చేయాలో చెపుతుంది.

**శ్రద్ధయా దేయమ్। అశ్రద్ధయాఽదేయమ్। శ్రియా దేయమ్। హ్రియా దేయమ్। భియా దేయమ్। సంవిదా దేయమ్।**

**శ్రద్ధయా దేయమ్।** దానం. ఇది భగవంతుడు నాకిచ్చిన సదవకాశం అనే శ్రద్ధతో చేయాలి.

**అశ్రద్ధయాఽదేయమ్।** అశ్రద్ధతో దానం చేయకూడదు. తీసుకునే వ్యక్తిమీద చులకన భావం ఉండకూడదు. దానం తీసుకునేది సాక్షాత్తు పరమేశ్వరుడే అనే భావన ఉండాలి.

**శ్రియా దేయమ్।** శక్తివంచన లేకుండా చేయాలి. వందరూపాయిలు ఇవ్వగలిగే సామర్థ్యం ఉండి పది రూపాయలు దానం చేస్తే అది సరైన పద్ధతి కాదు.

**హ్రియా దేయమ్।** ఇంతకన్నా దానం చేయలేకపోతున్నానే అని సిగ్గుతో దానం చేయాలి.

**భియా దేయమ్।** దానం చేయకపోతే పాపమొస్తుందేమో అనే భయంతో దానం చేయాలి.

**సంవిదా దేయమ్।** మనస్ఫూర్తిగా దానం చేయాలి. డబ్బు ఖర్చయిపోయిందే అని దానం చేసి నొచ్చుకోకూడదు.

**కాయేన మనసా బుద్ధ్యా కేవలైరింద్రియైరపి ।**
**యోగినః కర్మ కుర్వంతి సంగం త్యక్త్వాత్మశుద్ధయే ॥ గీత 5-11**

కర్మయోగం ఏ స్థాయిలోనైనా చెయ్యవచ్చంటాడు కృష్ణపరమాత్మ. అది కాయికం, వాచికం, మానసం ఏదైనా కావచ్చు. ఏది కుదిరితే అది చెయ్యవచ్చు. అవన్నీ చిత్తశుద్ధికి తోడ్పడతాయి.

**సారాంశము - భగవద్గీత, విష్ణుసహస్రనామం పారాయణం, సజ్జన సాంగత్యం చేయాలి. దీనజనోద్ధరణ చేయాలి.**

**శ్లోకము - 28**

**సుఖతః క్రియతే రామాభోగః, పశ్చాద్ధన్త శరీరే రోగః।**
**యద్యపి లోకే మరణం శరణం, తదపి న ముఞ్చతి పాపాచరణమ్॥**

**రామాభోగః సుఖతః క్రియతే** = ఇంద్రియలోలుత్వంతో సుఖాలలోను, భోగాలలోనూ గడుపుతున్నాడు.

**పశ్చాద్ధన్త శరీరే రోగః** = దానితో శరీరం రోగాల పాలయింది.

**యద్యపి లోకే మరణం శరణం** = చివరకు లోకంలో మరణమే శరణమైంది

**తదపి న ముఞ్చతి పాపాచరణమ్** = అయినా పాపాలు చేయడం మానలేదు.

పదచ్ఛేదమ్- **సుఖతః, క్రియతే, రామాభోగః, పశ్చాత్, హన్త, శరీరే, రోగః। యది, అపి, లోకే, మరణం, శరణం, తత్, అపి న, ముఞ్చతి, పాప+ఆచరణమ్॥**

అన్వయమ్ - **హన్త! సుఖతః రామాభోగః క్రియతే।** **పశ్చాత్ శరీరే రోగః** (భవతి)। **యద్యపి లోకే మరణం శరణం। తత్ అపి మూఢః పాపాచరణమ్ న ముఞ్చతి।**

**తాత్పర్యం –** ఇంద్రియలోలుత్వంతో సుఖాలలోనూ, భోగాలలోనూ గడుపుతున్నాడు. దానితో శరీరం రోగాల పాలయింది. చివరకు లోకంలో మరణమే శరణమైంది. అయినా పాపాలు చేయడం మానటం లేదు.

లౌకికసుఖమే పరమార్ధం అన్నట్టు భోగాల వెంట పరుగులు. భోగలాలసత్వంలో ఆరోగ్యం గుల్ల అయింది. శరీరం రోగాల పాలైంది. కూడబెట్టిన ధనం, ఆరోగ్యరక్షణలో వైద్యుల సొత్తైంది. మరణం తప్పటం లేదు అని తెలిసినా పాపపు పనులు మాత్రం మానటం లేదు.

కొందరు వైద్యులు మరీ వ్యాపారపరంగా మారారు. మనిషి చనిపోయాక కూడా శవాన్ని హాస్పిటల్‌లో ట్రీట్ చేస్తూ ఉన్న ఉదంతాలు వింటున్నాము. స్వామీజీ ఇటువంటి వ్యాపారపరమైన డాక్టర్లను ఉద్దేశిస్తూ ఒక శ్లోకం చెప్పారు.

**వైద్యరాజ నమస్తుభ్యం యమరాజ సహోదర।**
**యమస్తు ప్రాణాన్ హరతి వైద్యో ప్రాణాన్ ధనాని చ॥**

వైద్యరాజా! నీకు నమస్సులు. నువ్వు యముడి సహోదరుడివి. ఎందుకంటే యముడు ప్రాణమొక్కటే పట్టుకెళతాడు. నువ్వో ప్రాణమూ, ధనమూ రెండూ పట్టుకుపోతావు.

అందరు వైద్యులు ఇలా ఉండరు. కొందరు సేవాభావంతో దైవాంశసంభూతులుగా ఉంటారు. వారికి నా నమస్సులు.

**సారాంశము – దీపముండగానే యిల్లు చక్క బెట్టుకోవాలి. లౌకికధోరణినుంచి ఆధ్యాత్మికతకు మళ్ళాలి.**

* * *

**శ్లోకము - 29**

**అర్థమనర్థం భావయ నిత్యం, నాస్తి తతః సుఖలేశః సత్యమ్।**
**పుత్రాదపి ధనభాజాం భీతిః, సర్వత్రైషా విహితా రీతిః॥**

| | |
|---|---|
| **అర్థమనర్థం నిత్యం భావయ** | = ధనం అనర్థమని నిత్యం తెలుసుకో |
| **తతః సుఖలేశః న అస్తి (ఇతి ఏవ) సత్యమ్** | = ధనంలో సుఖం లవలేశం కూడా లేదు. ఇదే సత్యం |
| **పుత్రాదపి ధనభాజాం భీతిః** | = ధనాశతో నీ పుత్రులు కూడ నీకు శత్రువులౌతారు |
| **సర్వత్ర ఏషా విహితా రీతిః** | = లోకమంతా ఇదే తీరున ఉంది |

**పదచ్ఛేదమ్ -** **అర్థమ్, అనర్థం, భావయ, నిత్యం, నాస్తి, తతః, సుఖలేశః, సత్యమ్। పుత్రాత్, అపి, ధనభాజాం, భీతిః, సర్వత్ర, ఏషా, విహితా, రీతిః॥**

**అన్వయమ్ -** **అర్థమ్ అనర్థం నిత్యం భావయ। తతః సుఖలేశః న అస్తి ఇతి ఏవ సత్యమ్। ధనభాజాం స్వపుత్రాదపి భీతిః (భవతి)। సర్వత్ర ఏషా విహితా రీతిః (భవతి)॥**

**తాత్పర్యం -** ధనం అనర్థమని నిత్యం తెలుసుకో. ధనంలో సుఖం లవలేశం కూడా లేదు. ఇదే సత్యం. ధనాశతో నీ పుత్రులు కూడ నీకు శత్రువులౌతారు. లోకమంతా ఇదే తీరున ఉంది.

మితిమీరిన ధనసంపాదన దుఃఖానికి దారితీస్తుంది. అంతే కాదు ప్రాణాలు కూడా తీస్తుంది. కుటుంబ సభ్యులే ఎదురు తిరుగుతారు. నిత్యభయహేతువు.

మొగల్ చరిత్ర తిరగేస్తే తండ్రిని కారాగృహంలో పెట్టడం తండ్రి రాజ్యాన్ని, ధనాన్ని బలవంతంగా లాగుకోవడం చూస్తాము. ధనంవల్ల భద్రతలేక బ్రతుకు భయంతో కూడి ఉంటుంది. భయం ఎన్ని కోణాల్లో ఉంటుందో భర్తృహరి మాటల్లో చూద్దాం.

**భోగే రోగభయం, కులే చ్యుతిభయం, విత్తే నృపాలాద్భయమ్**
**మానే దైన్యభయం, బలే రిపుభయం, రూపే జరాయా భయమ్**
**శాస్త్రే వాదభయం, గుణే ఖలభయం, కాయే కృతాంతాద్భయమ్**
**సర్వం వస్తు భయాన్వితం భువి నృణాం, వైరాగ్యమేవాభయమ్॥ -భర్తృహరి**

**సారాంశము - వెర్రిగా ధనంవెంట అర్థంలేని పరుగుతీసి కష్టాలపాలయ్యేకన్నా భగవంతుని వైపు దృష్టిమరల్చి జీవితాన్ని సార్థకం చేసుకోవాలి.**

## శ్లోకము - 30

**ప్రాణాయామం ప్రత్యాహారం, నిత్యానిత్యవివేకవిచారమ్।**
**జాప్యసమేతసమాధివిధానం, కుర్వవధానం మహదవధానమ్।।**

**ప్రాణాయామం ప్రత్యాహారం** = ప్రాణాయామం, ఇంద్రియ నిగ్రహం (శమదమాది షట్క సంపత్తి)

**నిత్యానిత్యవివేకవిచారమ్** = నిత్యానిత్య వివేకం

**జాప్యసమేతసమాధివిధానం** = జపం సమాధి మొదలయిన సాధనలు నిత్యం చేయాలి

**కుర్వవధానం మహదవధానమ్** = సావధానంతో పట్టు విడువకుండా చేయాలి

**పదచ్ఛేదమ్ - ప్రాణాయామం, ప్రత్యాహారం, నిత్య+అనిత్య-వివేక-విచారమ్। జాప్యసమేత-సమాధి-విధానం, కురు, అవధానం, మహత్, అవధానమ్।।**

**అన్వయమ్ - ప్రాణాయామం ప్రత్యాహారం (కురు)। నిత్యానిత్యవివేక విచారమ్ (కురు)। జాప్యసమేతసమాధివిధానం అవధానం కురు। మహత్ అవధానం (కురు)।।**

**తాత్పర్యం -** నిత్యము ప్రాణాయామము చేయాలి. ఇంద్రియాలు నిగ్రహించుకోవాలి. నిత్యానిత్యవివేకము చేయాలి. జపం సమాధి వంటి సాధనలు విడవకుండా చేయాలి. ఈ సాధనలన్నీ సావధానముతో పట్టు విడవ కుండా చేయాలి.

ఇంద్రియనిగ్రహం గురించి ఒక కథ చెబుతారు. ఒక కోతి తన ఇంద్రియనిగ్రహం పరిక్షించుకోవాలని ఒక అరటిపండు తెచ్చి పెట్టుకుంది. తరువాత దానిని వాసన చూసింది. నోట్లో పెట్టుకుంటే తప్పేముంది, తింటే కదా అనుకుంది. బుగ్గన పెట్టుకుంది. మెల్లిగా ఎప్పుడు మింగిందో దానికే తెలియదు. ఆధ్యాత్మిక సాధనలో ఇంద్రియ నిగ్రహమూ, మనోనిగ్రహమూ చాలా ముఖ్యము.

ఈ విషయంలో చాలా సావధానంగా ఉండాలి.

**తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।**
**వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ గీత 2- 61**

ఇంద్రియములను నియమించి ఏకాగ్రచిత్తుడై నేనే(ఆత్మ) పరమలక్ష్యముగా గలవాడై స్థిరముగా నుండవలెను. ఎందుకంటే, ఎవనికి ఇంద్రియములు వశములో ఉండునో, అట్టి వాని ప్రజ్ఞ ప్రతిష్ఠితమైనది

**సారాంశము - ప్రాణాయామం, ప్రత్యాహారం, నిత్యానిత్య వివేకం చేయాలి. సావధానముగా ఉండాలి.**

**శ్లోకము - 31**

**గురుచరణామ్బుజనిర్భరభక్తః, సంసారాదచిరాద్భవముక్తః।**
**సేన్ద్రియమానసనియమాదేవం, ద్రక్ష్యసి నిజహృదయస్థం దేవమ్॥**

**గురుచరణామ్బుజనిర్భరభక్తః** = గురుదేవుల పాదపద్మముల పై అపారమైన భక్తిగల సాధకుడా!

**సంసారాదచిరాద్భవముక్తః** = సంసార బంధనాలనుంచి త్వరగానే ముక్తిని పొందెదవు గాక!

**సేన్ద్రియమానసనియమాదేవం** = నీ ఇంద్రియాలు, మనస్సు అదుపులోకి తెచ్చిన నీవు

**ద్రక్ష్యసి నిజహృదయస్థం దేవమ్** = నీ హృదయంలో నివసిస్తున్న పరమాత్ముని దర్శించెదవు గాక

**పదచ్ఛేదమ్ - గురుచరణ-అమ్బుజ-నిర్భర-భక్తః, సంసారాత్, అచిరాత్, భవ, ముక్త ః। స+ఇన్ద్రియ-మానస-నియమాత్, ఏవం, ద్రక్ష్యసి, నిజహృదయస్థం, దేవమ్॥**

**అన్వయమ్- గురుచణామ్బుజనిర్భరభక్తః। (త్వం) సేన్ద్రియమానసనియమాత్ సంసారాత్ అచిరాత్ ముక్తః భవ। ఏవం (త్వం) నిజహృదయస్థం దేవమ్ ద్రక్ష్యసి॥**

**తాత్పర్యం -** గురుదేవుల పాదపద్మముల పై అపారమైన భక్తిగల సాధకుడా! నీ ఇంద్రియాలు, మనస్సు అదుపులోకి తెచ్చిన నీవు నీ హృదయంలో నివసిస్తున్న పరమాత్ముని దర్శించెదవు గాక.

**గురుదేవుల స్మరణముతో గ్రంథము ముగిసినది. లౌకికజీవనము నుంచి ఆధ్యాత్మికజీవనము వైపుకు మళ్ళండి అనే శంకరభగవత్పాదుల బోధతో, వారి శిష్యుల సలహాలతో సంస్కృతపండితుడు తన దృష్టిని భగవంతుని వైపు మళ్ళించి జీవితాన్ని సార్థక్యం చేసుకున్నాడు.**

**శ్రుతిస్మృతిపురాణానామ్ ఆలయం కరుణాలయమ్ ।**
**నమామి భగవత్పాదం శఙ్కరం లోకశఙ్కరమ్ ॥**

తాత్పర్యము:– వేద, ఇతిహాస, పురాణజ్ఞానమునకు నిలయమై, కరుణాంతరంగ హృదయులై, లోకమునకు మంగళము కలిగిస్తున్న శంకరభగవత్పాదులకు నమస్కారములు.

**శఙ్కరం శఙ్కరాచార్యం కేశవం బాదరాయణమ్ ।**
**సూత్రభాష్యకృతౌ వన్దే భగవన్తౌ పునః పునః ॥**

ప్రస్థానత్రయానికి భాష్యాన్ని రచించిన సాక్షాత్ శంకరులైన శంకరాచార్యులకు, బ్రహ్మసూత్రాలను రచించిన సాక్షాత్ విష్ణువైన వ్యాసమహర్షికి పదే పదే నమస్కారములు.

**భజ గోవిన్దం భజ గోవిన్దం గోవిన్దం భజ మూఢమతే।**
**సంప్రాప్తే సన్నిహితే కాలే న హి న హి రక్షతి దుకృఞ్కరణే॥**

**ఇంతటితో భజగోవిందస్తోత్రం అయినది.**

***

# యమనియమాలు

ప్రసంగాలు విని, పుస్తకాలు చదివి లేదా సత్సంగాలలో పాల్గొని ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందుతారు కొందరు సాధకులు. కొంతకాలం గడిచేసరికి, చాలామంది సాధకులలో ఒక భావన ఏర్పడుతుంది. చాలా ఎక్కువే చదివాము, బాగానే శాస్త్రం వంటబట్టింది కాని ఆచరణలో పెట్టలేకపోతున్నామన్న చింత పట్టుకుంటుంది. వాళ్ళకి పుస్తకజ్ఞానం ఉంది కాని, అనుష్ఠానం లేదన్నమాట. అనుష్ఠానం అంటే నేర్చుకున్నదాన్ని ఆచరణలో పెట్టడం. ఇటువంటి సమస్యను అనుభవిస్తున్న సాధకులు ఈ ప్రణాళికను చేపట్టవచ్చు. ఆ మాటకొస్తే ఎవరైనా చేపట్టవచ్చు. ఇది పాటిస్తే శాస్త్రం నేర్పించిన అంశాలను తేలిగ్గా అమలు పరచగలుగుతారు.

ఈ కార్యక్రమం ఒక సంవత్సరం కాలం పడుతుంది. దీన్ని మళ్ళీ వచ్చే సంవత్సరం కూడా కొనసాగించవచ్చు. ఈ ప్రణాళికను ఉన్నదున్నట్టుగా అమలులో పెట్టవచ్చు లేదా మీ అవసరాలకు, మీ వీలుకు తగ్గట్టుగా మార్చుకోవచ్చు. ఇందులో 12 అంశాలు ఉన్నాయి కాబట్టి, ఒక్కొక్క అంశాన్ని ఒక్కొక్క నెలరోజులు సాధన చేయాలి కాబట్టి, నూతన సంవత్సర శుభారంభం రోజున మీరు దీనికి శ్రీకారం చుట్టవచ్చు. ఒక్కముక్కలో చెప్పాలంటే మన హిందూ ధర్మం చెప్పే **టెన్ కమాండ్‌మెంట్స్** అనవచ్చు దీన్ని. ఐదు నిషేధాలు, ఐదు విధులు ఉంటాయి. వాటిని యమ, నియమాలు అంటారు. హిందూ ధర్మం చెప్పే విధినిషేధాలన్నమాట.

ఈ టెన్ కమాండ్‌మెంట్స్ రెండు భాగాలుగా ఉంటుంది. ముందు నిషేధాలు–యమలు; తర్వాత విధులు–నియమాలు గురించిన వివరణ వస్తుంది. అనటానికి విధి నిషేధాలన్నా, శాస్త్రం నిషేధానికి అంటే యమలకు పెద్దపీట వేసింది. అందుకని ముందు యమల గురించి చెప్పాక, నియమాల గురించి చెప్పింది. వాటి నిర్వచనం, వాటిని పాటించే విధానం చూద్దాము.

**యమలు –** ఐదు యమలు వరుసగా అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం.

**1. అహింస–** అహింస అంటే హింస చేయకపోవటం లేదా హాని కలుగచేయక పోవటం. అహింస అనేక స్థాయిల్లో ఉంటుంది. హింసలో ఎక్కువగా ప్రకటిత మయ్యేది శారీరక హింస. శారీరక హింస అంటే మనుష్యులను కొట్టటమే కాదు, వస్తువులను మనుష్యులమీద విసిరేయటం, లేదా నేలకేసి కొట్టటం కూడా వస్తుంది.

ఈ కార్యక్రమం చేపట్టగానే, ముందస్తుగా ఈ శారీరక హింసను మానాలి. ఒకవేళ మనం ఆ స్థాయిలో హింస చేయనట్టయితే, వాచిక హింసమీద దృష్టి పెట్టవచ్చు. వాచికహింస అంటే ఎవరిమీదనైనా అరవటం, దూషించటం, అశ్లీలమైన భాష వాడటం.

**2 సత్యం–** ఇది ప్రాథమికంగా వాచికతపస్సు. మనకున్న పరిజ్ఞానం, మన ఆలోచనలు, మన మాటల మధ్య అనుసంధానం ఉండాలి. మనం పలికే మాటలు మనకున్న జ్ఞానాన్ని కాని, మన ఉద్దేశ్యాలను కాని దాయకూడదు. ఒక్కముక్కలో చెప్పాలంటే మనసావాచా ఒక్క త్రాటిమీద నడవాలి. నిజానికి సత్యం అనేది సానుకూల భావన. దానిని ఒక యమగా శాస్త్రం వర్ణించిందంటే దాన్ని మనం సరిగ్గా అర్థం చేసుకోవాలి. సత్యం పలుకకూడదు, అనకూడదు. అసత్యం పలుకకూడదు అని అర్థం చేసుకోవాలి. అంటే అబద్ధాలు ఆడకూడదు, నిజాలు కానివి చెప్పకూడదు.

**3. అస్తేయం–** అస్తేయం అర్థం అక్షరాలా తీసుకుంటే దొంగతనం చేయకపోవటం. మనం దొంగలం కాము కదా, ఈ విలువ చెప్పటం అవసరమా అనిపించవచ్చు మనకు. కాని స్తేయం అంటే అక్షరాలా ఎవరి ఇంటికో కన్నం వేసి డబ్బు దొంగిలించటం మాత్రమే కాదు. అన్యాయంగా ఏదైనా వ్యవహారం జరిపి, కొంత సొమ్ము పోగేసుకున్నా కూడా అది స్తేయం కిందకే వస్తుంది. అంతేకాదు, ఎవరికైనా ఒక పనికి ఇస్తానని ఒప్పుకున్న సొమ్ము పూర్తిగా ఇవ్వకపోవటం కూడా స్తేయం కిందకే వస్తుంది. ఎందుకంటే ధర్మబద్ధంగా అతనికి చెందాల్సిన సొమ్మును మనం మన దగ్గర పెట్టుకున్నాము కాబట్టి.

**4. బ్రహ్మచర్యం–** పరస్త్రీవ్యామోహం ఉండకూడదు. స్త్రీకి పరపురుషునిమీద, పురుషునికి పరస్త్రీమీద చెడు ఆలోచనలు కాని, వ్యామోహం కాని ఉండకూడదు. ఒకరినొకరు గౌరవంగా చూడాలి. సత్యం లాగే, బ్రహ్మచర్యం కూడా సానుకూల భావనే, అయినా యమలలో చోటు చేసుకుంది కాబట్టి దీన్ని కూడా అలాగే సరిగ్గా అన్వయించుకోవాలి. బ్రహ్మచర్యం పాటించాలంటే పరస్త్రీవ్యామోహం ఉండకూడదు.

**5. అపరిగ్రహం–** పరిగ్రహం అంటే ఆస్తిపాస్తులు ఉండటం. అపరిగ్రహాన్ని అక్షరాలా తీసుకుంటే ఆస్తిపాస్తులు ఉండకూడదు అని వస్తుంది. కాని దాన్ని సాధారణ జీవితం గడపటంగా తీసుకోవాలి. అపరిగ్రహంలో రెండు అంశాలు ఉన్నాయి.

తక్కువ ఆస్తి ఉండటం, ఉన్న కాస్త ఆస్తిమీద సరియైన దృక్పథం కలిగి ఉండటం. హెచ్చులకు పోకుండా, ఆర్భాటాలు చేయకుండా, డాబు, దర్పం చూపకుండా ఉండటం. ఎంతమేరకు అవసరమో అంతమేరకు ఒక గిరి గీసుకుని, అంతే ఉంచుకోవటం. సామాన్యజీవనవిధానమే ఉన్నతస్థాయికి తీసుకుపోతుంది.

ఉన్నకాస్త ఆస్తిమీద సరియైన దృక్పథం ఉండటం ఇంకా ముఖ్యం. తక్కువ ఆస్తి కలిగి ఉండటంకన్నా ఉన్న ఆస్తిమీద వ్యామోహం పెంచుకోకుండా ఉండగలగాలి. నాది, నాది అనుకునేది నాది కాదు. అది భగవంతుని ప్రసాదం. ఆయన మన అభివృద్ధికోసం తాత్కాలికంగా మనకు ఇచ్చాడు. ఏ క్షణంలోనైనా చెప్పో చెప్పకుండానో, దీన్ని తిరిగి తీసుకునే హక్కు, ఆయనకు సర్వవేళలా ఉంది, అని నిరంతరం మనం తలచుకుంటూనే ఉండాలి.

**నియమాలు–** ఐదు నియమాలు – శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వరప్రణిధానం.

**6. శౌచం–** శౌచం అంటే శుభ్రత. ముందుగా శారీరక శుభ్రత మీద దృష్టిపెడితే, క్రమేణా అంతర్గత శౌచంమీద కూడా శ్రద్ధ చూపవచ్చు. శౌచం అంటే మనను, మన పరిసరాలను శుభ్రంగా ఉంచటం అనుకోవచ్చు. అంటే మన శరీరం, మన బట్టలు, మన వస్తువులు, మన ఇల్లు అన్నీ శుభ్రంగా ఉండాలి. శౌచం అంటే కేవలం శుభ్రతే కాదు, ఒక నిబద్ధత కూడా. మన ఇల్లు చాలా శుభ్రంగా ఉండవచ్చు కాని, నిబద్ధత లేకపోతే, ప్రతి చిన్నదానికీ ఇల్లంతా వెతకడంలో ఇల్లంతా చిందర వందర అవుతుంది. **'ప్రతిదానికీ ఒక స్థానం, ప్రతీదీ దాని స్థానంలో,'** సూత్రాన్ని పాటించాలి.

**7. సంతోషం–** సంతోషం అంటే తృప్తి. సంతోషం రెండు స్థాయిల్లో పెంపొందించుకోవాలి. ఎందుకంటే జీవితంలో మన లక్ష్యం రెండు విధాలుగా ఉంటుంది కాబట్టి. అది డబ్బు సంపాదించుకోవటం, దానితో ఆస్తి పెంచుకోవటం. చాలా డబ్బు సంపాదించాలనీ, ఎన్నో వస్తువులు కొని దాచుకోవాలనీ కోరికగా ఉంటుంది. మొదటి దశ తృప్తి ఆస్తిని పెంచుకోవటంలో కలుగుతుంది. మనకు కావాల్సిన ఆస్తిపాస్తులను సమకూర్చుకున్నాక, వాటితో తృప్తి చెందాలి. ఇంకా, ఇంకా వస్తువులు కావాలన్న తపన తగ్గాలి. సంపాదన కొనసాగుతూనే ఉన్నా ఖర్చుపెట్టటం తగ్గాలి. అలా ఎక్కువ సంపాదించి, తక్కువ ఖర్చు పెట్టటంవల్ల

సమాజానికి, దేశానికి ఐశ్వర్యం ఏర్పరచిన వారిమవుతాము. అటువంటి వ్యక్తిని **కర్మయోగి** అంటారు.

రెండో స్థాయి తృప్తి, కోరిక లేకపోవటంనుంచి వస్తుంది. ఇంకా, ఇంకా సంపాదించాలన్న తపన పోతుంది. అలాంటి వ్యక్తిని **జ్ఞానయోగి** అంటారు. సంపాదించే విషయంలో, స్వంతం చేసుకోవాలనే విషయంలో తృప్తి చెందటాన్ని **సంతోషం** అంటారు. దీన్ని సానుకూల దృక్పథంతో ఒక **నియమం**గా పాటించాలి. ఉన్నదానితో తృప్తి చెందాలి, లేని దానికోసం అర్రులు చాచకూడదు. మనస్సు దేనినైనా యాచిస్తుంటే, మనకు సమృద్ధిగా ఉంది, ఇంకేదీ కోరకు అని మనస్సుకు నచ్చచెప్పాలి. దీన్నే **సమృద్ధి సూత్రం** అంటారు.

తృప్తి ఉన్న వ్యక్తి తనకున్నదాన్ని సంతోషంగా ఇతరులకు ఇస్తాడు. సంతోషం లేకపోతే, దానగుణం రాదు. దానగుణం రావాలంటే సంతోషం ఉండాలి.

**8. తపస్సు–** తపస్సును అక్షరాలా తీసుకుంటే తపస్సు చేయటం. కాని అహింస, సంతోషాలలాగా తపస్సుకు కూడా అనేక అర్థాలు ఉన్నాయి. తపస్సును కనిపించే రూపంలో తీసుకుంటే, కాయిక కర్మ అనవచ్చు. మతపరంగానే కాదు, ఆధ్యాత్మిక పరంగానే కాదు, ఆరోగ్యపరంగా చూసినా కూడా కాయిక కర్మ చాలా ముఖ్యమైన అంశం. మన పూర్వీకుల జీవనశైలిలోనే వాళ్ళకు కావాల్సినంత కాయిక కర్మ చోటు చేసుకునేది. ఇప్పుడు జీవన విధానం మారింది కాబట్టి, ఏదైనా వ్యాయామం చేయాలి. అన్నింటిలోకి అత్యుత్తమ వ్యాయామం సూర్య నమస్కారం చేయటం.

వ్యాయామం చేయమనగానే, అబ్బో మాకు బొత్తిగా తీరికలేదు అనేస్తారు చాలామంది. కాని వారు ఒక విషయం గమనించటం లేదు. వారి ఆరోగ్యం నిలబెట్టుకోవటంకోసం ఇవాళ కొన్ని నిముషాలను కేటాయించుకోలేకపోతే, కొన్నాళ్ళ తరువాత వారు (పోగొట్టుకున్న) ఆరోగ్యాన్ని తిరిగి తెచ్చుకోవటానికి కొన్ని నెలలు ఖర్చుపెట్టాల్సి రావచ్చు.

**9. స్వాధ్యాయం–** స్వాధ్యాయం అంటే మన శాస్త్రాన్ని అధ్యయనం చేయటం. అది చాలా ముఖ్యమైన నియమం. ఒకప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా స్వాధ్యాయం చేసేవారు. దాన్ని **బ్రహ్మయజ్ఞం**గా భావించి ప్రతిరోజూ చేసేవారు. ఇప్పుడు ఆధ్యాత్మిక చింతనకు ఎవరూ ప్రాముఖ్యతనివ్వటం లేదు. ఆ అధ్యయనం ఏదో వేదపండితులే చేయాలని లేదా సన్యాసులే చేయాలనే అపోహతో ఉన్నారు. అది పొరపాటు.

అధమపక్షం భగవద్గీతలోంచి రోజుకు కొన్ని శ్లోకాలు అధ్యయనం చేసి, వాటిలో ఉన్న బోధ గురించి మననం చేయాలి.

**10. ఈశ్వరప్రణిధానం–** ఈశ్వరప్రణిధానం అంటే మన జీవితంలో మనకు కలిగిన ప్రతి అనుభవాన్నీ ఈశ్వరప్రసాదంగా స్వీకరించటం. మనం పొందే ప్రతి అనుభవమూ, మనం చేసిన కర్మకు వచ్చిన ఫలం. ఈశ్వరుడు కర్మఫలదాత. మన కర్మఫలం సుఖం అవచ్చు, దుఃఖం అవచ్చు. మనకు నచ్చవచ్చు, నచ్చకపోవచ్చు కాని అది మన చేతిలో లేదు. ప్రతి కర్మఫలం వెనుక, కర్మసిద్ధాంతం ఉంది; కర్మసిద్ధాంతం వెనుక కర్మఫలదాత అయిన ఈశ్వరుడు ఉన్నాడు. ఈశ్వరుడు కనపడడు. కర్మసిద్ధాంతం కనపడదు; కాని దాని సూత్రంద్వారా ఫలం మన చేతికి వచ్చేసరికి, అది అనుభవంలోకి వస్తుంది.

అందువల్ల ఏదొచ్చినా మన మంచికే అనుకుని, స్వీకరించాలి. అప్పుడు మనస్సులో ప్రతికూల ఆలోచనలు కాని, ఉద్రేకాలు కాని ఏర్పడవు. ఇలా ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరించటాన్ని ఈశ్వరప్రణిధానం లేదా శరణాగతి అంటారు. అలా స్వీకరించలేకపోతే మనస్సులో అనారోగ్యకరమైన ఆలోచనలు చోటు చేసుకుంటాయి. వాటివల్ల మనలో కోపం, చిరాకు, ద్వేషం, నిరాశా నిస్పృహలులాంటి భావాలు పెరుగుతాయి.

సాధకులందరూ ఈ పది యమనియమాలనూ తప్పకుండా పాటించాలి. ఇందులో మనం కాదనగలిగిందేమీ లేదు. ఈ యమనియమాలను పాటించకపోతే, వేదాంతం నేర్చుకుని కూడా లాభం లేదు.

**ఈ పది నియమాలు పాటించటం ఎలా?** ఈ క్రింది పద్ధతిని ఉపయోగించవచ్చు. ఒక సంవత్సరానికి ఏర్పాటు చేయబడింది ఇది. మొదటి సూత్రంతో మొదలుపెట్టి నెలకొక సూత్రం తీసుకుని దానిమీద దృష్టి పెట్టాలి. అదే వరుసలో ఒక్కొక్క నెల ఒక్కొక్కటీ పాటిస్తూ రావాలి. ప్రతి ఒక్కటీ ముఖ్యమైనదే. ప్రతిదాన్నీ జాగ్రత్తగా అమలులో పెట్టాలి. అలా ఈ యమనియమాలను సాధన చేయటానికి ఈ క్రింద ఇచ్చిన ఐదు సూత్రాల పద్ధతిని పాటించవచ్చు. అవి సంకల్పం, అవధానం, సంయమం, సింహావలోకనం, విచారణ.

**1. సంకల్పం–** సంకల్పం అంటే నిర్ణయం తీసుకోవటం. ఉన్న పది యమనియమాల్లో నెలకొకటి చొప్పున పాటించాలని చూశారు కదా! ప్రతిరోజూ పొద్దున లేవగానే, ఆ నెలలో ఏది పాటించాలో, దాన్ని ఆ రోజు పాటిస్తానని నిర్ణయం తీసుకోవాలి.

**'అహింస నెల'** లో, 'ఇవాళ నేను అహింసను పాటిస్తాను. నా కుటుంబసభ్యులమీద గానీ, నా క్రింద పనిచేసే ఉద్యోగులమీద గానీ, నేను అరవను,' అని గట్టి నిర్ణయం తీసుకోవాలి. ఒక పుస్తకం పెట్టుకుని, దానిలో రోజూ నిద్రలేవగానే ఆ రోజు మీరు పాటించేది 24 సార్లు రాయాలి. ఉదాహరణకు, 'నేను ఇవాళ అహింస పాటిస్తాను.' ఆ రాయటం ఆషామాషీగా రాయకూడదు. మనస్ఫూర్తిగా, చిత్తశుద్ధితో, అంకితభావంతో రాయాలి.

**2. అవధానం–** అవధానం అంటే జాగ్రత్త. ఇది చాలా ముఖ్యం. ఆధ్యాత్మిక మార్గం ఎన్నుకునే వారు, నిర్లక్ష్యంగా ఉండకూడదంటుంది శాస్త్రం. చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకోకపోవటంవల్లే ఎన్నో రోడ్డు ప్రమాదాలు అవటం చూస్తూనే ఉన్నాము. జాగ్రత్త తీసుకోవటం అనేది మన చేతిలో ఉంది. అందువల్ల మనం అప్రమత్తతతో ఉండాలి. మనం పాటించబోయే యమ నియమాలను మనం ఉల్లంఘించటానికి తోడ్పడే నిర్లక్ష్యాలను పారద్రోలాలి. ఈ సూత్రం ఆరోగ్యానికి కూడా వర్తిస్తుంది. ఆరోగ్యాన్ని నిలబెట్టుకోవాలంటే కొన్ని చిన్న సూత్రాలను పాటించాలి. ఆ చిన్న సూత్రాలను నిర్లక్ష్యం చేస్తే జీవితకాలం అవస్థలు పడక తప్పని పరిస్థితి ఏర్పడవచ్చు.

**3. సంయమం –** సంయమం అంటే అదుపులో పెట్టటం. అవధానం పనిచేయని చోట సంయమం రంగంలోకి దిగుతుంది. పది యమ నియమాలు పాటించాలని ఉన్నా, ఆటంకాలు ఎదురవుతాయి, ముఖ్యంగా ప్రారంభదశలో. అప్పుడు మనం తప్పించుకోవాలని ప్రయత్నిస్తున్న పాత వ్యతిరేకప్రవర్తన దూసుకువస్తుంది. ఎప్పుడైతే మనం పరుషంగా మాట్లాడుతున్నామని గ్రహిస్తామో, అప్పుడే మనస్సును మనం అదుపులో పెట్టుకోవటానికి ప్రయత్నించాలి. పరిస్థితి విషమించకముందే, సంయమనాన్ని పాటించటానికి సాధన చేయాలి.

**4. సింహావలోకనం –** సింహావలోకనం అంటే ఆత్మపరీక్ష. ప్రతిరోజూ, పడుకునే ముందు, ఆ రోజు మన ప్రవర్తనను గుర్తు తెచ్చుకుని, మనం ఎన్నుకున్న దాన్ని ఎంతవరకూ పాటించగలిగామని ఒకసారి బేరీజు వేసుకోవాలి. మనం దారితప్పిన ప్రతి తప్పుకూ, మన పుస్తకంలో, 'ఓం శ్రీ గురుభ్యో నమః,' అని 24 సార్లు రాయాలి.

ఇలా రాయటంవల్ల మూడు ప్రయోజనాలు ఉన్నాయి. ముందుగా, మన నియమాన్ని పాటించనందుకు అది ప్రాయశ్చిత్తంగా పని చేస్తుంది. రెండోది, గురుకృపను కోరుతున్నాము. గురువు అంటే భగవంతుడు కూడా వస్తాడు.

ఎందుకంటే ఆదిగురువు సాక్షాత్తూ ఆ పరమాత్మే. మూడోది, గురుకృపవల్ల మనం పాటించాల్సిన నియమాన్ని పాటించటానికి వీలులేకుండా చేసిన పరిస్థితులు లేదా సందర్భాలు అంతకంతకూ తగ్గుతూ వస్తాయి.

అంతేకాదు, మన దృక్పథంలో కూడా మార్పు వస్తుంది. ప్రస్తుతం మనం ఏదైనా నియమం పాటించకపోతే, పరిస్థితులను నిందిస్తాము. పైగా ఆ పరిస్థితుల్లో అలాగే ప్రవర్తించి తీరాలి అని సమర్థించుకుంటాము కూడా. కాని, గురుకృపవల్ల, కొన్ని రోజులు పోయాక, అంతకుముందు ఏ పరిస్థితుల్లో అయితే అబద్ధమాడి తీరాలనుకున్నామో, అప్పుడు కూడా అసత్యం చెప్పలేదు అని గ్రహిస్తాము. ఆ విధంగా గురుకృపవల్ల, మనను రెచ్చగొట్టే ఇటువంటి సందర్భాలు అంతకంతకూ తగ్గుతూ వస్తాయి. అంతేకాదు, వచ్చిన అతి కొద్ది సందర్భాలలో కూడా, మనం రెచ్చిపోయి, అంతకు ముందులా నియమాన్ని ఉల్లంఘించము కూడా. ఈ నాలుగు పద్ధతులనూ ప్రతిరోజూ పాటించాలి.

**5. విచారణ–** విచారణ అంటే అధ్యయనం చేయటం. ఇది చాలా శక్తివంతమైన, అత్యంత ముఖ్యమైన కిటుకు. మనం పాటించబోయే ఒక్కొక్క నియమాన్ని లోతుగా అధ్యయనం చేయాలి. **'ఒక విలువయొక్క విలువ'**ను గుర్తించాలి. ఏ నెల ఏ నియమాన్ని ఎన్నుకుంటే, ఆ నెలంతా ఆ నియమంమీద దృష్టిపెట్టాలి. ఉదాహరణకు 'అహింస నెల'లో అహింసమీద వీలున్నంత సమాచారం సేకరించాలి. వారానికి ఒక గంటసేపన్నా దానికి సంబంధించిన విషయాలన్నీ చదివి, దాని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలి.

హింస మానకపోతే మోక్షం ఎందుకు పొందలేము? అసలు ఎందుకు హింసా ప్రవృత్తి చూపుతాము? హింస చూపకుండా ఉండటానికి ఏ జాగ్రత్తలు పాటించగలము? ఈ విషయాలమీద విశ్లేషణ చేస్తే మనకు ఒక విషయం తేటతెల్లమవుతుంది. హింసచూపే ముందు కోపం వస్తుంది. ఈ విశ్లేషణలో ఇంకా ముందుకు సాగవచ్చు. అసలు కోపం ఎందుకు వస్తుంది? కొంతమంది ప్రవర్తనవల్ల వస్తోందా? వారు మారాలని ఆశించకుండా, నేను నా కోపాన్ని తప్పించుకోవటానికి లేదా కనీసం తగ్గించుకోవటానికి నన్ను ఎలా మార్చుకోగలను?

ఇటువంటి విచారణ మనం ఒంటరిగా చేసుకోవచ్చు. లేదా ఒక సత్సంగంలో చేరి, ఆ సత్సంగ సభ్యులతో కలిసి చేయవచ్చు. అలాంటి సత్సంగంలో వారానికి ఒకసారి కలిసి, ఒకరి అనుభవాలు ఒకరు పంచుకోవచ్చు. దానివల్ల

వారెలా ఈ నియమాలను పాటిస్తున్నారో తెలుసుకునే అవకాశం కలుగుతుంది. సత్సంగంలో ఇలా చర్చించటంవల్ల సభ్యులందరూ ప్రయోజనం పొందుతారు.

పైపెచ్చు అందరిలోనూ శ్రద్ధ, అంకితభావంపెరుగుతాయి. అందువల్ల సత్సంగాలకు వెళ్ళటం మంచిది.

విచారణ చేయటంవల్ల ఒక్కొక్క నియమానికీ కనబడే స్థూల అంశం, కనబడని సూక్ష్మ అంశం ఉంటాయని, ఒక్కో దానికి అనేక కోణాలు ఉంటాయనీ తెలుస్తుంది. మనం మొదటి సంవత్సరం కనబడే స్థూల అంశం మీద దృష్టి పెడితే, తర్వాత వచ్చే సంవత్సరాలలో సూక్ష్మ అంశాలను సాధన చేయవచ్చు.

పది యమనియమాలు పదినెలలకు సరిపోతే, తక్కిన రెండునెలలు ఏం చేయాలనే ప్రశ్న ఉదయించవచ్చు. పదకొండవ నెలలో, సాధకుడు తనకున్న ఒక చెడు లక్షణాన్ని ఒదులుకోవటానికి ప్రయత్నించవచ్చు అంటే పొగ త్రాగే అలవాటును ఒదులుకోవటమో, కోపం పోగొట్టుకోవటమో చేయవచ్చు. దీనికి కూడా అదే పద్ధతి. ముందు పైకి కనబడే స్థూల అంశంతో మొదలుపెట్టి రాను రానూ సూక్ష్మమైన బలహీనతలను తగ్గించుకోవచ్చు.

పన్నెండవ నెలలో మనం ఒక మంచి అలవాటును పెంపొందించుకోవాలి. ఒకవేళ మనకు ఇతరులను విమర్శించే అలవాటు ఉంటే, దానికి భిన్నమైన మంచి అలవాటును పెంచుకోవాలి. అంటే మెచ్చుకోవాల్సిన చోట మెచ్చుకోవటం అలవరచుకోవాలి. ఎటువంటి అలవాట్లను వదులుకోవాలి లేదా ఎటువంటి అలవాట్లను పెంపొందించుకోవాలి అనే అంశంమీద ఒకవేళ ఏమైనా సందేహాలుంటే భగవద్గీతలోనే పదహారవ అధ్యాయాన్ని అధ్యయనం చేయవచ్చు. అందులో శ్రీకృష్ణపరమాత్మ చెడు లక్షణాలను ఆసురీసంపత్తి కింద, మంచి లక్షణాలను దైవీసంపత్తి కింద విపులంగా చర్చించాడు. వాటిని అధ్యయనం చేసి దైవీ సంపత్తిని అలవరచుకుని, ఆసురీ సంపత్తిని పోగొట్టుకోవచ్చు.

* * *

**యమనియమలు – అందరికి ఉపయోగకరంగా ఉంటుందని వేదాంత జీవన విధానము అనే మా పుస్తకంనుంచి తీసుకుని ఇక్కడ పొందుపరిచాము.**

# తెలుగు భక్తి పేజీలు - వెలుగొందిన తీరు

'చేత వెన్నముద్ద, చెంగల్వ పూదండ,'తో మనని అలరించిన చిన్నికృష్ణుడు, 'ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే!' అంటూ మనకి భగవద్గీత అనే మహాగ్రంథాన్ని ఇచ్చాడు.

ఆ చిన్ని శ్లోకంనుంచి ఈ పెద్ద గ్రంథం వరకూ అన్నీ తనలోనే ఇముడ్చుకున్న వెబ్‌సైట్ పేరు www.telugubhakti.com ఒక చిన్న అలలాగ వచ్చిన ఆలోచన రూపుదాల్చటంవల్ల, మరెన్నో అలలు వచ్చి దాన్ని చేరటంవల్ల మహాసముద్రం లాంటి ఆధ్యాత్మిక బాంఢాగారంగా, మన తెలుగువారి పాలిట కల్పవృక్షంగా పెరిగింది.

ఒకరోజు రాఘవరావు గారు తన చిన్నారి శ్రీస్నిగ్ధకి ముద్దు మురిపాలతో పాటు కొన్ని శ్లోకాలు రంగరించి పోస్తున్నారు. తన ముద్దుల పాప అంతకన్నా మురిపెంగా వల్లె వేస్తోంది. ఉన్నట్టుండి 'అమెరికాలో ఉన్న మన తెలుగువారికి ఈ ఆనందం లేదు కదా!' అనిపించింది ఆయనకు. వారికి నేర్పించాలన్న తపన ఉన్నా, తెలుగులో ఉండే ఈ శ్లోకాలు దేశం కాని దేశంలో ఎలా దొరుకుతాయి అని ఆరోజు బాధపడ్డారు. మర్నాడు కొంతలో కొంతన్నా వారికి కూడా ఈ ఆనందం కలిగించవచ్చు కదా అని మెరుపులా ఒక ఆలోచన తట్టింది.తట్టడం ఆలశ్యం తనకి తెలిసిన నాలుగు శ్లోకాలకు మరికొన్ని శ్లోకాలు జతచేసి అమెరికాలో ఉన్న తన బంధువులకూ, తెలుగురాష్ట్రాలకు దూరంగా ఉన్న కొందరు ఆప్తులకూ ఈ-మెయిల్‌ద్వారా పంపారు.

వారందరూ మూకుమ్మడిగా ప్రశంసల వర్షం కురిపించి, ఇదేదో వెబ్‌సైట్‌లో పెడితే మాలాంటి వారు మరికొంతమంది చూస్తారు అన్నారు. వెంటనే www.zing.com లో పెట్టారు. మరికొన్ని స్తోత్రాలు సేకరించి అవి కూడా పెట్టారు. ఇదంతా 1998లో ప్రాణం పోసుకుంటే 2002లో www.telugubhakti.comగా రూపుదిద్దుకుంది. అమెరికాలో ఉన్న మద్దూరి శ్రీ శేషాచలకుమార్, శ్రీ మద్దూరి కిరణ్‌దత్తు, ఆ వెబ్‌సైట్‌ని హోస్ట్ చేయటానికి సహకరించారు. ఎప్పుడైతే ఇలా పెడుతున్నారని తెలిసిందో, ఎందరో వారు నిత్యం

చేసుకునే పూజలనీ, వారి దేవుళ్ళ స్తోత్రాలనీ, నోములనీ రకరకాలుగా తెచ్చి ఇవ్వటం మొదలుపెట్టారు. ఈ పూజ చేస్తే ఈ ఫలితం దక్కుతుంది ఇది చేయమనండి అనేవారు. ముందు ఒక్కొక్క పండగకి దానికి సంబంధించినవి పెట్టి, రానురాను ఒక్కొక్క దేవుడికి విడివిడిగా పెట్టడం మొదలుపెట్టారు.

ఉదాహరణకి శివరాత్రికి శివపార్వతులమీద అనేక స్తోత్రాలు, సహస్రనామాలు అన్నీ సేకరించారు. ఆ అనుభవం మర్చిపోలేనిది అంటున్నారు రాఘవరావుగారు. అన్నీ సేకరించి దాన్ని పెడదామని వారం ముందు ప్రయత్నిస్తే ఏమైందో తెలీదు–వెబ్‌సైట్ ఓపెన్ అవలేదు. శివరాత్రికి పెడుతున్నామని ఒక పక్క అనౌన్స్‌మెంట్ ఇచ్చి కూర్చున్నారు. 'స్వామీ నేనేం అపరాధం చేసాను? నన్ను క్షమించు. శివరాత్రి వరకూ ఏకభుక్తం ఉంటాన'ని నిష్ఠగా ఉండి, రేపు శివరాత్రి అనగా, ఈ రాత్రి ప్రయత్నం చేద్దామని చూస్తే ఆశ్చర్యం! దానంతటదే తెరుచుకుంది. చిక్కుముడి ఎలా పడిందో, ఎలా విడిపడిందో ఇప్పటికీ తెలియదంటారు ఆయన. అంతేకాదు ఆ మర్నాడు శివుడు, పార్వతి, వినాయకుడు, సుబ్రమణ్యం అందరూ ఉన్న కాలెండర్ ఎవరో తెచ్చి ఇచ్చారు.

అలా నిజం చెప్పాలంటే ఏ దేవుడి శ్లోకాలు వెబ్ సైట్‌లో పెడితే ఆ దేవుడి ప్రసాదమో, ఫోటోనో ఏదో ఒకటి వచ్చేది. రాఘవేంద్రస్వామి గురించిన శ్లోకాలు పెడదామంటే రెండుసార్లు ఆటంకం వచ్చింది. స్వామే గుర్తు చేసాడు రెండు సార్లూనూ! ప్రసాదం పంపించి ఒకసారి, మంత్రాలయం క్యూలో ఉన్న తన స్నేహితుడు, శ్రీ విష్ణుప్రసాదుగారి ఫోను ద్వారా మరోసారి! అలాగే నాయనార్ల గురించి వారి పినమామగారు శ్రీ యమ్ వి సుబ్బారావుగారు రాసింది పెడితే అనుకోకుండా ఇద్దరూ కలిసి కొందరు నాయనార్ల గుళ్ళకి వెళ్ళారు.

దీనికి నా ఒక్కరి పేరు రాయవద్దు, నాదేం లేదు, అంతా లైక్ మైండెడ్ పీపుల్ సమిష్టి కృషి అంటారు రాఘవరావు గారు. ఆయన నోరు తెరిచి ఎవర్నీ అడిగింది లేదు. వారే వెతుక్కుంటూ వచ్చి దాన్ని పెంచుకుంటూ వచ్చారు. ఇందులో ఇప్పుడు అనేక నోములు, వ్రతాలు, చాటువులు, తెలుగు పద్యాలు, శతకాలు, పెళ్ళిమంత్రాలు– వాటి అర్థాలు, యోగాసనాలు, ముద్రలు, నేచురోపతి ఆరోగ్యసూత్రాలు, అలా ఎన్నో తెలుగులిపిలో ఉన్నాయి. కొన్నిటికి ఆడియో ఉంది.

మారిషియస్ దీవుల్లో ఉన్న సోదరులు శివరాత్రి మీ స్తోత్రాలతో గడిపామని రాశారు. నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా రాణించక, మీ పెళ్ళిమంత్రాలు డౌన్‌లోడ్ చేసుకుని పురోహితుడిగా ఇక్కడ సెటిల్ అయిపోయానని ఇంకో సోదరుడు విదేశాలనుంచి రాశాడు. వేమన పద్యాలు పెట్టినప్పుడయితే వచ్చిన స్పందన చూసి తీరాల్సిందే అంటారు రాఘవరావుగారు. మళ్ళీ చిన్నప్పుడు స్కూల్లో మాష్టారు చెపుతుంటే విన్నట్టు ఉందనీ; మా అమ్మ పాడేది, ఆ రోజులు గుర్తుకొస్తున్నాయనీ పుంఖానుపుంఖాలుగా ఉత్తరాలు వచ్చాయి. అప్పట్లో గూగుల్ సెర్చ్‌లో ఇది మొదటిస్థానంలో ఉండేది.

ఇది కాక ఒక యాహూ గ్రూప్‌లో కూడా ఉంది. యాహూ గ్రూప్‌లో వారు ఆధ్యాత్మిక విషయాలమీద చర్చలు జరుపుతారు. దాంట్లో 5107 మెంబర్లు ఉండేవారు. ఒక ఈ–మ్యాగజైన్ ఉంది. నెలనెలా అందులో భారతం తెలుగులో, ఇంగ్లీషులో, భక్తుల కథలు ఇంగ్లీషులో, నడిచే దేవుడు, ప్రేమ్‌సిద్ధార్థ గారి భజగోవిందానికి ఇంగ్లీషు అనువాదం, ఋషుల కథలు, వగైరాలు ఉంటాయి. ఎన్నో మంచి వెబ్‌సైట్లకి లింకులు ఉన్నాయి.

దీనికి మోడరేటర్స్ శ్రీగోపీకృష్ణగారు, శ్రీజాజిశర్మగారు. ఎడిటర్లు శ్రీమతి రాజ్యశ్రీ, శ్రీవిష్ణుప్రసాద్‌గారు, శ్రీమతి అరుణాయశోదగారు. ప్రస్తుతం తెలుగుభక్తి.కామ్‌లో లక్షపై చిలుకు పేజీలున్నాయి.

ఈ వెబ్‌సైట్ మన హిందూధర్మప్రచారంకోసం స్థాపించబడింది కాని వేరే ప్రయోజనాలేవీ ఆశించి కాదు. దీనివల్ల మీకేమిటి లాభం అని నిలదీసారు కూడా ఎవరో! మనిషై పుట్టినందుకు మనకి తెలిసిన మంచి మనం ఆచరించి, మరో నలుగురు ఆచరించేందుకు మన చేతనైన సహాయం చేద్దామన్న ప్రయత్నమే తప్ప ధనార్జనకోసం కాదు. ఎవరి దగ్గరా ఒక రూపాయి తీసుకోలేదు. ఎవరైనా సాయం చేయదలుచుకుంటే వారికి తోచిన సాయం వెబ్‌సైట్‌కు వారి ఆర్టికల్స్‌ద్వారా చేస్తే చాలు, అలా చేస్తూనే ఉన్నారు అన్నారు. అలా తెలుగుభక్తి.కామ్ అనేక అందాలు సంతరించుకుంటోంది అని సంతోషిస్తున్నారు.

ఒక ఏన్యువల్ మీట్ రాఘవరావుగారి దిశానిర్దేశం చేసింది. దాని తరువాత వారు ప్రచురించిన ఉపనిషత్తులు, ప్రకరణ గ్రంథాలు కూడా ఇందులో చోటు

చేసుకున్నాయి. తెలుగుభక్తి.కామ్‌ను పైకి తీసుకు రావాలని ఎందరో స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. దీని బాధ్యత వారు భుజస్కంధాలమీద వేసుకున్నారు. వారి గురించి వింటే వారి ముందు నేనెంత అని వినమ్రంగా చేతులు జోడిస్తున్నారు రాఘవరావుగారు!

అంతా కృష్ణార్పణమస్తు అన్నారు!

**మద్దూరి రాజ్యశ్రీ**

***

# స్వామీజీ సూక్తిముక్తావళి

ఈ నాలుగు పెద్ద అంశాల విషయంలో శ్రద్ధ వహించండి.
**అహంకారం, మమకారం, రాగం, ద్వేషం.**
వాటిని పూర్తిగా పారద్రోలలేరు, కాని జీవన్ముక్తి పొందటానికి వాటిని శక్తి విహీనం చేయటం సాధ్యం, అవసరం కూడా.

***

మనం మన నోరు చేసే రెండు పనుల గురించి జాగ్రత్త వహించాలి–
**తినే నోరు (జ్ఞానేంద్రియం), మాట్లాడే నోరు(కర్మేంద్రియం).**
నోటిని అదుపులో పెడితే తక్కిన నాలుగు ఇంద్రియాలు నియంత్రించబడుతాయి. అందువల్ల **ఉపవాసం, మౌనం** ముఖ్యమైన సాధనల క్రిందకి వస్తాయి.

***

# దక్షిణమూర్తి స్తోత్రమ్ / దక్షిణమూర్తి అష్టకమ్

ధ్యానశ్లోకాః -
మౌనవ్యాఖ్యాప్రకటితపరబ్రహ్మతత్త్వం యువానం
వర్షిష్ఠాన్తే వసదృషిగణైరావృతం బ్రహ్మనిష్ఠైః
ఆచార్యేంద్రం కరకలితచిన్ముద్రమానన్దరూపం
స్వాత్మారామం ముదితవదనం దక్షిణామూర్తిమీడే ॥1॥

వటవిటపిసమీపే భూమిభాగే నిషణ్ణం
సకలమునిజనానాం జ్ఞానదాతారమారాత్ ।
త్రిభువనగురుమీశం దక్షిణామూర్తిదేవం
జననమరణదుఃఖచ్ఛేదదక్షం నమామి ॥2॥

చిత్రం వటతరోర్మూలే వృద్ధాః శిష్యా గురుర్యువా ।
గురోఽస్తు మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు ఛిన్నసంశయాః ॥3॥

నిధయే సర్వవిద్యానాం భిషజే భవరోగిణామ్ ।
గురవే సర్వలోకానాం దక్షిణామూర్తయే నమః ॥4॥

ఓం నమః ప్రణవార్థాయ శుద్ధజ్ఞానైకమూర్తయే ।
నిర్మలాయ ప్రశాన్తాయ దక్షిణామూర్తయే నమః ॥5॥

ఈశ్వరో గురురాత్మేతి మూర్తిభేదవిభాగినే।
వ్యోమవద్ వ్యాప్తదేహాయ దక్షిణామూర్తయే నమః ॥6॥

అథ స్తోత్రమ్ । ఓం
విశ్వం దర్పణదృశ్యమాననగరీతుల్యం నిజాన్తర్గతం
పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథా నిద్రయా ।

యః సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మానమేవాద్వయం
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥1॥

బీజస్యాన్తరివాంకురో జగదిదం ప్రాఙ్నిర్వికల్పం పునః
మాయాకల్పితదేశకాలకలనావైచిత్ర్యచిత్రీకృతమ్ ।
మాయావీవ విజృమ్భయత్యపి మహాయోగీవ యః స్వేచ్ఛయా
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥2॥

యస్యైవ స్ఫురణం సదాత్మకమసత్కల్పార్థకం భాసతే
సాక్షాత్తత్త్వమసీతి వేదవచసా యో బోధయత్యాశ్రితాన్ ।
యత్సాక్షాత్కరణాద్భవేన్న పునరావృత్తిర్భవామ్భోనిధౌ
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥3॥

నానాచ్ఛిద్రఘటోదరస్థితమహాదీపప్రభాభాస్వరం
జ్ఞానం యస్య తు చక్షురాదికరణద్వారా బహిః స్పన్దతే ।
జానామీతి తమేవ భాన్తమనుభాత్యేతత్సమస్తం జగత్
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥4॥

దేహం ప్రాణమపీన్ద్రియాణ్యపి చలాం బుద్ధిం చ శూన్యం విదుః
స్త్రీబాలాన్ధజడోపమాస్త్వహమితి భ్రాన్తా భృశం వాదినః ।
మాయాశక్తివిలాసకల్పితమహా వ్యామోహసంహారిణే
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥5॥

రాహుగ్రస్తదివాకరేన్దుసదృశో మాయాసమాచ్ఛాదనాత్
సన్మాత్రః కరణోపసంహరణతో యోఽభూత్సుషుప్తః పుమాన్ ।
ప్రాగస్వాప్సమితి ప్రబోధసమయే యః ప్రత్యభిజ్ఞాయతే
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥6॥

బాల్యాదిష్వపి జాగ్రదాదిషు తథా సర్వాస్వవస్థాస్వపి
వ్యావృత్తాస్వనువర్తమానమహమిత్యన్తః స్ఫురన్తం సదా ।
స్వాత్మానం ప్రకటీకరోతి భజతాం యో ముద్రయా భద్రయా
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥7॥

విశ్వం పశ్యతి కార్యకారణతయా స్వస్వామిసంబన్ధతః
శిష్యాచార్యతయా తథైవ పితృపుత్రాద్యాత్మనా భేదతః ।
స్వప్నే జాగ్రతి వా య ఏష పురుషో మాయాపరిభ్రామితః
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥8॥

భూరమ్భాంస్యనలోఽనిలోఽమ్బరమహర్నాథో హిమాంశుః పుమాన్
ఇత్యాభాతి చరాచరాత్మకమిదం యస్యైవ మూర్త్యష్టకమ్ ।
నాన్యత్కించన విద్యతే విమృశతాం యస్మాత్పరస్మాద్విభోః
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥9॥

సర్వాత్మత్వమితి స్ఫుటీకృతమిదం యస్మాదముష్మిన్ స్తవే
తేనాస్య శ్రవణాత్తదర్థమననాద్ధ్యానాచ్చ సంకీర్తనాత్ ।
సర్వాత్మత్వమహావిభూతిసహితం స్యాదీశ్వరత్వం స్వతః
సిద్ధ్యేత్తత్పునరష్టధా పరిణతం చైశ్వర్యమవ్యాహతమ్ ॥10॥

**ఇతి శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్యస్య శ్రీగోవిన్దభగవత్పూజ్యపాదశిష్యస్య శ్రీమచ్ఛంకరభగవతః కృతౌ దక్షిణామూర్త్యష్టకం సమ్పూర్ణమ్ ॥**

***